


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 111 | శనివారం | 05-10-2024 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

మోదీ 'మేక్ ఇన్ ఇండియా'పై అల్ప సంతోషం

మార్కెట్ శక్తుల మోసాలే ధరల పెరుగుదలకు కారణం

లోపలి పేజీల్లో

తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణల వివాదంపై

# ఐదుగురితో కొత్త 'సిట్'



సిబిఐ నుంచి ఇద్దరు, ఎపి పోలీసు నుంచి ఇద్దరు.. సుప్రీం కోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ :** తిరుపతి లడ్డూలో జంతువు కొవ్వు కలిసిందన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు ఒక స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (ఇండిపెండెంట్ సిట్) ఏర్పాటు చేసింది. ఐదుగురు సభ్యులతో ఈ స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారంనాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్' స్థానంలో సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక బృందం ఈ దర్యాప్తు నిర్వహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకునే ఈ స్వతంత్ర దర్యాప్తుకు ఉత్తర్వులు ఇచ్చినట్లు ధర్మాసనం ప్రకటించింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) తరువాయి 2లో

## అంతర్జాతీయంగా గుర్తింపు పొందేలా నూతన క్రీడా విధానం

2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకుని లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్



అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి గుర్తింపు తీసుకొచ్చేలా కొత్త క్రీడా పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. '2036 ఒలింపిక్స్'ను దృష్టిలో పెట్టుకుని కొత్త పాలసీలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీని పిపిపి విధానంలో నిర్వహించాలని, ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియమించాలని, యూనివర్సిటీకి స్వయం ప్రతిపత్తిని కల్పించాలని సూచించారు. అధికారులు రూపొందించిన కొత్త 'క్రీడాపాలసీ ముసాయిదా'పై సిఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు తరువాయి 2లో

● దద్దరిల్లిన దండకారణ్యం

# భారీ ఎన్‌కౌంటర్

## 30 మంది నక్సల్స్ మృతి

పేలుడు పదార్థాలు, ఆటోమెటిక్ తుపాకులు లభ్యం

ఈ ఏడాది 187 మంది మావోయిస్టులు హతం

అటవీ గ్రామాల్లో టెన్షన్ టెన్షన్...



ప్రజాపక్షం/భద్రాచలం



ఛత్తీస్‌గఢ్ అడవుల్లో తుపాకుల మోతతో రక్తపుటేరులు పారాయి. శుక్రవారం భద్రతా బలగాలు మావోయిస్టుల మధ్య చోటు చేసుకున్న భారీ ఎదురు కాల్పుల్లో ఏకంగా 30 మంది మావోయిస్టులు హతమయ్యారు. వివరాల ప్రకారం... ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రేంజ్‌లో గల దంతెవాడ –నారాయణపూర్ జిల్లా మాడ్ ఏరియా అటవీ ప్రాంతంలో ఈ ఎన్ కౌంటర్ చోటుచేసుకుంది.. ఇంటెలిజెన్స్ వర్గాల పక్కా సమాచారం మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఓర్చా, బర్సూర్, పోలీస్ స్టేషన్ల పరిధిలోని గోవెల్, నెందుర్, తుల్తుడి గ్రామాల్లో సిఆర్‌పిఎఫ్, కోబ్రా, డిఆర్‌జి, స్పెషల్ టాస్క్ ఫోర్స్ బలగాలు సంయుక్త ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. అబూజ్మడ్‌లో మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కొనసాగుతున్న కూంబింగ్‌లో ఆచితూచి అడుగులేస్తున్న భద్రతాబలగాలు నలు వైపుల నుండి మావోయిస్టు లు ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టారు. దీంతో వారిని లొంగిపోవాలంటూ భద్రతా బలగాలు హెచ్చరించినప్పటికీ ఏకపక్షంగా మావోయిస్టులు ఎదురు కాల్పులకు దిగారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రాణ రక్షణలో భాగంగా భద్రతా బలగాలు సైతం మావోయిస్టులపై కాల్పులు మొదలు పెట్టాయి. ఇరు వర్గాల మధ్య సుమారు ఐదు గంటలకు పైగా భీకర కాల్పులు జరిగాయి. మావోయిస్టులు పోలీసుల తూటాల ధాటికి తాళలేక అడవుల్లోనికి జారుకోవడంతో ఆ వైపు నుండి కాల్పులు ఆగిపోయాయి. అనంతరం సంఘటనా స్థలాన్ని పరిశీలించగా 30 మంది మావోయిస్టు మృత దేహాలు లభ్యమయ్యాయి. ఘటనా స్థలంలో మృతదేహాలతో పాటు ఆటోమెటిక్ గన్నులు, ఎస్ఎల్ఆర్ తుపాకులు కూడా లభ్యమైనట్లు నారాయణపూర్ ఎస్‌పి ప్రభాత్‌కుమార్ తెలిపారు. బస్తర్ ఐజి సుందర్‌రాజ్‌తో పాటు రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నిఘా పెట్టి వివరాలు సేకరిస్తున్నారు. మావోయిస్టు చరిత్రలో ఇది ఒక అతి పెద్ద దెబ్బగా చెప్పవచ్చు.మావోయిస్టులకు వ్యతిరేకంగా జరిగిన అతిపెద్ద విజయాల్లో ఇదొకటిగా అధికారులు అభివర్ణిస్తున్నారు.

**ఈ ఏడాది 187మంది మావోయిస్టులు హతం**

తాజాగా చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 30 మంది మావోయిస్టులతో కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకు 187మంది మావోయిస్టులు హతమయ్యారు. దంతెవాడ, నారాయణపూర్ సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో పోలీసులే పై చేయి సాధిస్తున్నారు. ఏప్రిల్ 16న కాంకేర్ జిల్లాలో జరిగిన కాల్పుల్లో 29మంది మృతి చెందారు. వరుసగా తరువాయి 2లో




## 'జైకా' వెయ్యి కోట్ల రుణాలు ఏమయ్యాయి?

రాష్ట్రప్రగతికి అడ్డుపడే రాజకీయాలతో ప్రజలకు నష్టం

జిహెచ్ఎంసిలో 4 మేయర్ స్థానాలను పరిశీలిస్తున్నాం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రప్రగతికి అడ్డుపడే రాజకీయాలు ప్రజలకు నష్టం చేస్తాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గతంలో మూసీ నదిని ప్రక్షాళన చేస్తామని జైకా నుంచి వెయ్యి కోట్ల రూపాయల రుణాన్ని తీసుకున్న బిఆర్ఎస్ నాయకులు, అధికారం పోగానే మూసీ ప్రక్షాళన వద్దని ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారని ఆరోపించారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రజలు తీవ్ర తరువాయి 2లో

## గ్రూప్-1 నోటిఫికేషన్‌పై హైకోర్టులో 'తీర్పు రిజర్వు'



**హైదరాబాద్ :** గ్రూప్1 నోటిఫికేషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. గ్రూప్1 పరీక్షల కీపై అభ్యంతరాలు స్వీకరించామని, వాటిని ఆయా సబ్జెక్ట్‌ల వారీగా నిపుణుల కమిటీకి పంపి.. వారు ఆమోదించిన తర్వాతే ఫలితాలు విడుదల చేసినట్లు టిజిపిఎస్‌సి హైకోర్టుకు గురువారం నివేదించింది. త్వరలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయని, ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొంది. గ్రూప్1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని, ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ తరువాయి 2లో

## ఆడుకోవడానికి వెళ్లి మృత్యు ఒడికి

మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ చెరువులో పడి ముగ్గురు చిన్నారులు మృతి

చేపలు పట్టడానికి వెళ్లిన వారి గాలాలకు చిక్కిన చిన్నారుల మృతదేహాలు

ప్రజాపక్షం/శామీర్‌పేట



సరదాగా ఆడుకోవడానికి వెళ్లి చెరువులో పడి ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడిన హృదయ విధారక విషాద ఘటన మేడ్చల్ జిల్లా తుర్కపల్లి జినోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొల్తూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఇన్స్‌పెక్టర్ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామానికి చెందిన హర్షవర్ధన్(13), మణిహర్ష(14), మనోజ్ (10) శుక్రవారం దసరా సెలవులు తరువాయి 2లో

ఎస్‌సిల ఉపవర్గీకరణ తీర్పుపై

## రివ్యూ పిటిషన్లు కొట్టివేత



**న్యూఢిల్లీ :** ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల ఉపవర్గీకరణ ఆమోదిస్తూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ ఏడాది ఆగస్టులో ఉప వర్గీకరణకు సర్వోన్నత న్యాయస్థానం ఆమోద ముద్ర వేసిన సంగతి తెలిసిందే. తీర్పును సమీక్షించాలంటూ 10 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై నేడు విచారణ జరిగింది. 'పిటిషన్లు అన్నింటినీ పరిశీలించాం. తీర్పును సమీక్షించాల్సిన పరిస్థితులు కనిపించలేదు. అందుకే వాటిని కొట్టివేస్తున్నాం' అని కోర్టు పేర్కొంది. నేపథ్యం ఇదీ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ రిజర్వేషన్లలో 50 శాతాన్ని వాల్మీకి, మజహబీ సిక్కు సామాజికవర్గాలకు తొలి ప్రాధాన్యంగా తరువాయి 12లో

## సచివాలయం నుంచి దూకిన డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు



**ముంబయి:** మహారాష్ట్ర సచివాలయంలో శుక్రవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆదివాసీల రిజర్వేషన్లపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సొంత వర్గం ఎమ్మెల్యేలే ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే డిప్యూటీ స్పీకర్ సహా కొందరు ఎమ్మెల్యేలు, ఓ ఎంపి సచివాలయం మూడో అంతస్తు నుంచి దూకారు. అయితే, అక్కడ సేఫ్టీ నెట్ ఉండటంతో వీరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ పరిణామాలతో కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ధన్‌గఢ్ కమ్యూనిటీని ఎస్‌టి కేటగిరీలో చేర్చాలన్న డిమాండ్‌ను మహారాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తరువాయి 12లో

## అమేథీలో దళిత కుటుంబం దారుణహత్య

ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని యోగీ ఆదిత్యనాథ్ సర్కార్‌పై ప్రతిపక్షాల విమర్శనాస్త్రాలు



**లక్నో :** అమేథీలో దళిత కుటుంబం దారుణ హత్య బిజెపి నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శనాస్త్రాలు సంధించేందుకు అవకాశం ఇచ్చింది. ఈ దారుణ హత్య ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ పరిపాలనను విపక్షాలు తూర్పారబట్టడానికి కారణమయ్యింది. అమేథీ నగరంలోని శివరతన్ గంజ్ ఏరియా నివాసి సునీల్‌కుమార్ (35)అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆయన సతీమణి పూనం (32), ఆ దంపతులకు తరువాయి 12లో



# మరో క్షిపణి దాడికి సిద్ధం

## స్పష్టం చేసిన ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ



**టెహ్రాన్:** ఇజ్రాయెల్‌పై అవసరం అనుకుంటే మరోసారి క్షిపణి దాడికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ స్పష్టం చేశారు. ఈనెల ఒకటోతేదీ, మంగళవారం ఇజ్రాయెల్‌పై ఇరాన్ కనీసం 180 క్షిపణులతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఆ దాడిని ఖమేనీ ప్రశంసించారు. ఇజ్రాయెల్ తన వైఖరి మార్చుకోకపోతే, మరోసారి దాడి చేస్తామని తేల్చిచెప్పారు. సుమారు ఐదు సంవత్సరాల తర్వాత శుక్రవారం ప్రార్థనల్లో ఇరాన్ నాయకుడి హోదాలో తొలిసారి కనిపించిన ఖమేనీ ఇరాన్ దళాలు అద్భుత ప్రతిభాపాటవాలు కనబరిచాయని పేర్కొన్నారు. ఇరాన్ దాడి తర్వాత, లెబనాన్‌పై హిజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా పేర్కొంటూ ఇజ్రాయెల్ తీవ్రస్థాయిలో దాడులకు దిగిన విషయం తెలిసిందే. దీనితో మధ్యప్రాచ్యం యుద్ధం అంచున నిలిచింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను సమర్థవంతంగా అడ్డగించి, కూల్చివేసినట్టు అమెరికా అధికారులు ఇదివరకే ప్రకటించారు.అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ మరింతగా రెచ్చిపోతున్నది. లెబనాన్‌పై జరుగుతున్న దాడులను 80ఏళ్ల ఖమేనీ ఖండించారు. టెహ్రాన్‌లోని ప్రధాన ప్రార్థనా స్థలమైన మొసల్లా మసీదు వద్ద వేలాది మంది ప్రజలను ఉద్దేశించి ఆయన 40నిమిషాలు ప్రసంగించారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ దక్షిణభాగంపై హమాస్ జరిపిన దాడిని 'చట్టబద్ధమైన చర్య'గా ఆయనఅభివర్ణించారు.అణచివేతకు వ్యతిరేకంగా తిరబడే హక్కు పాలస్తీనా ప్రజలకు ఉందని వ్యాఖ్యానించారు. మంగళవారం ఇజ్రాయెల్‌పై క్షిపణి ప్రయోగాన్ని అంతర్జాతీయ చట్టం, ఇరాన్ చట్టంతో పాటు ఇస్లామిక్ మత విశ్వాసాల అనుగుణంగానే జరిగిన చర్యగా ఆయన పేర్కొన్నారు. 'శత్రువు (ఇజ్రాయెల్)పై తగిన చర్య తీసుకోవడానికి అఫ్గానిస్తాన్ నుంచి యెమెన్ వరకూ, ఇరాన్ నుంచి గాజా వరకూ అన్ని దేశాలు సిద్ధంగా ఉండాలి' అని పిలుపునిచ్చారు. లెబనాన్, పాలస్తీనాలో యుద్ధం కారణంగా మరణించిన వారిని 'ధైర్యవంతులు','విశ్వాసపాత్రులు'అని కొనియాడారారు. 2020లో బగ్దాద్‌లో అమెరికా డ్రోన్ దాడిలో మృతి చెందిన రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ ఖాసేమ్ సులేమానీ మరణం తర్వాత ఖమేనీ చివరిసారి శుక్రవారం నాటి ప్రార్థనలో కనిపించారు. ఆతర్వాత ఆయన అధికారికంగా ప్రార్థనలో పాల్గొనడం ఇదే మొదటిసారి. ఆయన ప్రసంగానికి ముందు, హిజ్బొల్లా నాయకుడు హసన్ నస్రల్లా స్మారక కార్యక్రమం జరిగింది. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ షెజెష్కియాన్, రివల్యూషనరీ గార్డ్స్ కీలక నేతలుసహా అత్యంత ఉన్నత స్థాయి అధికారులు హాజరయ్యారు.

# బంగ్లాదేశ్‌లో మలేసియా ప్రధాని పర్యటన

**ఢాకా:** ద్వైపాక్షిక సంబంధాలు, పరస్పర సహకారం వంటి అంశాలపై చర్చలు జరిపేందుకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం శుక్రవారం బంగ్లాదేశ్ రాజధాని ఢాకా చేరుకున్నారు. విమానాశ్రయంలవో ఆయనకు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ మహమ్మద్ యూనస్, ఆయన మంత్రివర్గ సహచరులు ఘనస్వాగతం పలికారు. బంగ్లాదేశ్ విమోచన పోరాటంలో పాల్గొన్న రాజకీయ నాయకుల వారసులకు కల్పిస్తున్న 30 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రారంభమైన విద్యార్థులు, నిరుద్యోగుల ఆందోళ ఆతర్వాత దేశ వ్యాప్తం ఉద్యమంగా మారిన విషయం తెలిసిందే. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆగస్టు 8న అప్పటి ప్రధాని షేక్ హసీనా బంగ్లాదేశ్‌ను విడిచిపెట్టి, భారత్‌లో ఆశ్రయం పొందారు. తీవ్రమైన అనిశ్చితి మధ్య యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఆగస్టు ఉద్యమం తర్వాత బంగ్లాదేశ్‌లో పర్యటిస్తున్న తొలి విదేశీ నాయకుడు అన్వర్. అంతేగాక, మలేసియా తరఫున 11 సంవత్సరాల తర్వాత తిరిగి బంగాళ్లదేశ్ పర్యటనకు వచ్చిన ప్రధాని కూడా ఆయనే. సుమారు 50 మందితో కూడిన బృందంతో పాకిస్తాన్ పర్యటనను ముగించుకొని అన్వర్ ఢాకా చేరుకున్నారు. ఆయనతో యూనస్ పలు అంశాలను చర్చించనున్నారు. ప్రత్యేకించి మయన్మార్ నుంచి వలస వచ్చిన రోహిన్యాల అంశం చర్చకు వస్తుందని సమాచారం. బంగ్లాదేశ్‌లోని శిబిరాల్లో సుమారు పది లక్షల మంది రోహిన్యాలు ఆశ్రయం పొందుతున్నారు. వారిని తిరిగి పంపాలని బంగ్లాదేశ్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

# లెబనాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు



**బీరూట్:** లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తున్నది. హిజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులను కొనసాగిస్తున్నట్టు చెప్తున్నప్పటికీ, జనావాసాలపైనా బాంబుల వర్షం కురిసిన సంఘటనలు ఉన్నాయి. తక్షణమే తమ నివాసాలను విడిచిపెట్టి, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని లెబనాన్‌లోని పలు ప్రాంతాల ప్రజలకు ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీ చేస్తున్నది. ఇరాన్ చేసిన క్షిపణి దాడికి ఏ విధంగా ప్రతీకారం తీర్చుకోవాలనే విషయంపై ఇజ్రాయెల్–అమెరికా చర్చిస్తున్నట్టు సమాచారం. కాగా, ఇరాన్ మద్దతునిస్తున్న హిజ్బొల్లాను తుడిచిపెడతామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించిన తర్వాత, సైనం దాడులను మరింత ముమ్మరం చేసింది. బీరూట్‌లోని రఫిక్ హరిరి ఎయిర్‌పోర్ట్ సమీపంలోనూ పేలుళ్లు చోటు చేసుకోవడం గమనార్హం. శుక్రవారం ఉదయం దుబాయ్ నుంచి వచ్చిన విమానం దిగిన కొన్ని క్షణాలకే ఈ పేలుళ్లు చోటు చేసుకున్నాయి. ఇప్పటికే హిజ్బొల్లా అగ్ర నేత నస్రల్లాతోపాటు మరో ఆరుగురు కీలక నాయకులు మృతి చెందారు. నస్రల్లా కుమార్తె, అల్లుడు కూడా ఇజ్రాయెల్ దాడుల్లో మరణించినట్టు వార్తలు వచ్చాయి. ఇలావుంటే, నస్రల్లా వారసుడు హాషీమ్ సఫీద్దీన్ లక్ష్యంగా మరిన్న దాడులకు ఇజ్రాయెల్ వ్యూహాలు సిద్ధం చేసినట్టు మీడియాలో వార్తలు వస్తున్నాయి. నస్రల్లా స్థానాన్ని సఫీద్దీన్ తీసుకొని, హిజ్బొల్లాను నిడిపిస్తున్నాడని ఇంటెలిజెన్స్ వర్గాలు సమాచారం అందించడంతో, అతని కోసం వేట కొనసాగుతున్నది. దుబాయ్ నుంచి విమానం ల్యాండైన వెంటనే, అత్యంత సమీపంలో పేలుడు జరగడంతో, అతనిని లక్ష్యంగా చేసుకొని జరిగిన దాడిగా పేలుళ్లను పేర్కొంటున్నారు. అయితే, ఇజ్రాయెల్ ఈ వార్తలను ధ్రువీకరించలేదు. నస్రల్లాకు షహీమ్ సమీప బంధువు. అమెరికా 2017లో అతనిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అతనిపై దాడులకు అమెరికా పూర్తి మద్దతు ఉంటుందనే అభిప్రాయం ఒక వైపు, అతనిని కూడా అడ్డు తొలగించుకుంటే హిజ్బొల్లా మరింత బలహీన పడుతుందనే ఆలోచన మరోవైపు తాజా దాడులకు దారితీసిన అంశాలుగా పరిశీలకులు పేర్కొంటున్నారు.




# ఈస్ట్, గల్ఫ్ కోస్ట్ పోర్ట్స్‌లో డాక్ వర్కర్ల సమ్మె వాయిదా




**డెట్రాయిట్:** ఈస్ట్, గల్ఫ్ కోస్ట్ పోర్ట్స్‌లో దాదాపు 45,000 మంది డాక్ వర్కర్లు మూడు రోజుల సమ్మెను విరమించుకొని, తిరిగి పనికి సాజరయ్యారు. యాజమాన్యాలతో మరింత విస్తృతమైన చర్చలకు వీలుగా సమ్మెను జనవరి 15వ తేదీ వరకూ తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ఇంటర్నేషనల్ లాంగ్‌షోర్మెన్ అసోసియేషన్ (ఐఎల్ఎ) ఒక ప్రకటనలో తెలిపింది. డాక్ వర్కర్ల వేతనాలకు సంబంధించి నౌకాశ్రయాలు, షిప్పింగ్ కంపెనీలకు ప్రాతినిథ్యం వహిస్తున్న అమెరికా మారిటైమ్ అలయన్స్ ఒక ఒప్పందం కుదుర్చుకుందని తెలిపింది. ప్రస్తుత షరతు ప్రకారం వేతనం ఆరేళ్లలో 50 నుంచి 62 శాతానికి పెంచేందుకు యాజమాన్యాలు అంగీకరించాయని పేర్కొంది. అయితే, వేతనాల పెంపు, మౌలిక సదుపాయాలు, ఇతరత్రా డిమాండ్లపై మరింత లోతైన చర్చ అవసరమని డాక్ వర్కర్ల యూనియన్ అభిప్రాయపడుతున్నది. అందుకే, దశలవారీ చర్చలను కొనసాగించడానికి వీలుగా, మూడు రోజుల సమ్మెను వాయిదా వేసినట్టు వివరించింది. ఓడ రేవుల్లో ఎక్కువగా యంత్రాలను వాడడం వల్ల ఉద్యోగావకాశాలు తక్కువవుతున్నాయని, ఉద్యోగ భద్రత కూడా లేకుండాపోతున్నదని యూనియన్ అభిప్రాయపడుతున్నది. యాంత్రికీకరణను పరిమితం చేయాలన్నది వర్కర్ల డిమాండ్లలో ఒకటి. కాగా, ఏదైనా ఓడ రేవులో ఒకరోజు సమ్మె జరిగితే, కోలుకోవడానికి నాలుగైదు రోజులు పడుతుందని విశ్లేషకులు అంటున్నారు. సాధ్యమైనంత వరకూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటేనే అటు వ్యాపారలావాదేవీలకు, ఇటు వర్కర్లకు మేలు జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద పోర్ట్ వర్కర్ల డిమాండ్లలో ఎక్కువ శాతం నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# రెచ్చగొడితే అణ్వాయుధ ప్రయోగం

## ప్రత్యర్థులకు ఉత్తర కొరియా అధినేత కిమ్ హెచ్చరిక



**ప్యాంగ్యాంగ్:** అమెరికాసహా ఏ దేశమైనా తమ భూభాగంపై దాడులు చేసినా, రెచ్చగొట్టినా, అణ్వాయుధాన్ని ప్రయోగించడానికి వెనుకాడబోమని ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ హెచ్చరించారు. శత్రువులు తమ భూభాగాన్ని ఆక్రమించాలని చూస్తే, అన్ని రకాల ఆయుధాలను ఉపయోగిస్తామని, అందులో మరో ఆలోచన ఉండబోదని స్పష్టంట చేశారు. ఉత్తర కొరియా పశ్చిమాన ఉన్న ప్రత్యేక దళాల సైనిక శిక్షణా స్థావరాన్ని తనిఖీ చేసిన కిమ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కిమ్ అణ్వాయుధాలను ఉపయోగిస్తే, ఉత్తర కొరియా చరిత్ర ముగిసిపోతుందని దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుకయోల్ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతేగాక, ఈవారం మొదట్లోనే దక్షిణ కొరియా సైనిక కవాతును కూడా నిర్వహించింది. అంతకు ముందు అమెరికాతో కలిసి సైనిక విన్యాసాలు జరిపింది. ఈ పరిణామాలు సహజంగానే ఉత్తర కొరియాను ఆందోళనకు గురిచేసే అవకాశం ఉంది. కిమ్ అణ్వాయుధాల ప్రయోగ హెచ్చరిక ఈ నేపథ్యంలోనే వెలువడిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఉత్తర కొరియా ఎట్టి పరిస్థితుల్లోనూ సార్వభౌమాధికారానికి భంగం కలిగించే ఎలాంటి చర్యలైనా ఎదుర్కొని తీరుతుందని కిమ్ అన్నారు. రెచ్చగొడితే, అణ్వాయుధాలను ప్రయోగిస్తామని అన్నారు. ఉత్తర, దక్షిణ కొరియా నేతల ప్రకటనలతో, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఉత్తరకొరియాకు వ్యతిరేకంగా దక్షిణ కొరియా పాటలు, నృత్యాలను ప్రదర్శిస్తుంటే, అందుకు ప్రతీకారంగా ఉత్తర కొరియా తన ప్రత్యర్థి భూభాగంలోకి వేల సంఖ్యలో చెత్తతో నిండిన బెలూన్లను విడిచిపెడుతున్నది. అమెరికా,దక్షిణ కొరియా సైనిక విన్యాసాలు జరిగినప్పుడు, యురేనియం శుద్ధీకరణ ప్లాంట్‌ను కిమ్ సందర్శించారు. ఆ ఫొటోలు, వీడియోలులను ఉత్తర కొరియా అధికారికంగా విడుదల చేసింది. ఆయుధ ఉత్పత్తిని పెంచాలని కిమ్ అప్పట్లో అధికారులను ఆదేశించారు. కాగా,అణ్వాయుధాలను వాడితే దారుణ పరిణామాలను ఎదుర్కోక తప్పదని ఉత్తర కొరియాకు దక్షిణ కొరియా హెచ్చరికలు జారీ చేసింది. ఆ వెంటనే కిమ్ స్పందించారు. అణు యుద్ధానికి సిద్ధమని ప్రకటించారు.

## భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

చోటు చేసుకుంటున్న ఎన్‌కౌంటర్లలో భద్రతా బలగాలే పై చేయి సాధిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆ రాష్ట్ర బిజెపి ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి మావోస్టుల ఏరివేతకు పెద్ద ఎత్తున వ్యూహాలు రచిస్తున్నారు. ఆపరేషన్ కగర్‌లో భాగంగా 2026 నాటికి దేశాన్ని మావోయిస్టు రహిద దేశంగా చేస్తామని కేంద్ర హోమ్ మంత్రి అమీత్‌షా ఇప్పటికే ప్రకటించారు. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర సంయుక్త బలగాలు అడవులను జల్లెడపడుతున్నాయి.

**అటవీ గ్రామాల్లో హై టెన్షన్...** భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అటవీ గ్రామాల్లో హై టెన్షన్ నెలకొంది. వరుస ఎన్‌కౌంటర్లతో మృత్యువాత పడుతున్న మావోయిస్టు పార్టీకి క్రమంగా కోలుకోలేని దెబ్బతగులుతోంది. తాజాగా జరిగిన ఎన్ కౌంటర్‌లో ఏకంగా 30 మంది హతమయ్యారు. అటవీ గ్రామాల్లో నుండి పక్కా సమాచారాన్ని సేకరిస్తున్న భద్రతా బలగాలు పై చేయి సాధిస్తున్నారు. ఆపరేషన్ కగర్‌లో భాగంగా మావోయిస్టు పార్టీని పూర్తి స్థాయిలో భద్రతా బలగాలు నిలువరించగలుగుతున్నాయి. దీంతో అటవీ గ్రామాల్లో మావోయిస్టులు కొందర్ని టార్గెట్ చేస్తూ పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా ముద్రవేసి హతమారుస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఓ ముగ్గురిని అపహరించిన మావోయిస్టులు ప్రజాకోర్టు నిర్వహించి ఇద్దర్ని హతమార్చి ఒకరిని విడిచిపెట్టిన విషయం విధితమే. ఎన్కౌంటర్లు పెరుగుతున్న కొద్దీ గ్రామాల్లో భయానక వాతారణం నెలకొంటోంది. మావోయిస్టుల జాడ చెప్పాలంటూ పోలీసులు, పోలీసులకు దళాల సమాచారాన్ని చేరవేయవద్దంటూ మావోయిస్టుల చేస్తున్న హెచ్చరికలతో అడకత్తెరలో పోకచెక్కలా గిరిజనుల పరిస్థితి తయారైంది.

**ఏజెన్సీలో హై అలెర్ట్ ...** 30 మంది మావోయిస్టులు హతమైన భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఏజెన్సీలో హై అలెర్ట్ కొనసాగుతోంది. ఈఏడాదిగా వందల సంఖ్యలో మావోయిస్టులు హతమవుతుండటంతో, ప్రాణాలతో బయటపడ్డవారు తలదాచుకునేందుకు సురక్షిత ప్రాంతాలకు తరిలిపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో జాతీయ రహదారులతోపాటు అటవీ గ్రామాల కచ్చదార్లలో నిఘా పెంచారు. వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ ఒడిస్సాఆంధ్రా,తెలంగాణ సరిహద్దులను పోలీసులు తమ ఆదీనంలోనికి తీసుకున్నారు. ఫెర్రీ పాయింట్ల వద్ద నిఘా పెంచి నిశితంగా పరిశీలిస్తున్నారు. వరుస వైఫల్యాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మావోయిస్టు పార్టీ ప్రతీకార చర్యలకుపూనుకునే అవకాశం అవకాశం ఉండటంతో అన్ని ప్రాంతాల్లో కట్టుదిట్టమైన నిఘాను పెంచారు.

## ఆడుకోవడానికి వెళ్లి మృత్యు ఒడికి

(మొదటి పేజీ తరువాయి)

ఉండటంతో చెరువు ప్రాంతానికి ఆడుకోవడానికి వెళ్లారు. చెరువు అంచు వద్ద ఆడుకుంటు ఉండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయి ఉండవచ్చని పోలీసులు బావిస్తున్నారు. చేపలు పట్టడానికి వెళ్లిన వారి గాలలకు ఎదో చిక్కుకోవడంతో పైకి లేపి చూడగా చిన్నారులు విగత జీవులుగా కనిపించారు. దీంతో ముగ్గురు కలిసివచ్చారని చూసిన వారు చెప్పగా చెరువులో వెతకడంతో మరో మృతదేహం లభించింది. ఈ హృదయ విధారక సంఘటనను చూడటానికి ప్రజలు పెద్ద ఎత్తున చెరువు వద్దకు తరలివచ్చారు. తల్లిదండ్రులు బోరున విలపించడంతో వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ఈ ఘటన వద్దకు వచ్చిన గ్రామస్థులు చిన్నారుల మృత దేహాలను చూసి కన్నీటి పర్వంతమయ్యారు. శవపంచనామ నిమిత్తం మృత దేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించామని, కుటుంబీకుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

**చెరువులో ప్రమాదకరంగా గుంతలు...**కాగా కొల్తూర్ చెరువులో ప్రమాదకరంగా పెద్దపెద్ద గుంతలు ఉన్నాయని అక్టోబర్ 2న జరిగిన గ్రామసభలో గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. చెరువు చుట్టు చెత్త చెదారం వేస్తున్నారని చెత్తతో నిండిపోయి ఉన్న పలువురు ప్రమాదాల భారిన పడుతున్నారని గ్రామస్థులు సభలో మొరపెట్టుకున్న సంబంధిత అధికారులు, ప్రత్యేకాధికారి పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. చెరువు వద్ద కంచె లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

## నూతన క్రీడా విధానం

(మొదటి పేజీ తరువాయి)

కె.కేశవరావు, జితేందర్‌రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, క్రీడలు, యువజన అభ్యున్నతి శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, సిఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సిఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ముసాయిదాకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు మార్పులు చేర్పులను సూచించారు. వివిధ ఆటలల్లో ప్రతిభ ఉన్న యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంగా ఎంచుకుందని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అనుసరించాల్సిన అత్యుత్తమ విధానాలను క్రీడా పాలసీలో పొందుపరచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని సూచించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాలని తెలిపారు. దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణంలో ఇప్పటికే వివిధ క్రీడలకు రెడిమేడ్ సదుపాయాలు ఉన్నాయని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాటిని అధునాతనంగా ఆధునీకరించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆయా స్థాయి పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు ఎంత ప్రోత్సాహకాన్ని అందించాలి?,ఎవరికి ఉద్యోగం ఇవ్వాలి?, అనే అంశాలపైన మార్గదర్శకాలను ఖరారు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు.

### స్పోర్ట్స్ హబ్ పరిధిలోనికి క్రీడా మైదానాలు .. స్టేడియాలు

హైదరాబాద్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రముఖ క్రీడా మైదానాలు, స్టేడియంలు అన్నింటినీ స్పోర్ట్స్ హబ్ పరిధిలోకి తీసుకురావాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌బి స్టేడియం, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి, ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ సైక్లింగ్ వెలోడ్రమ్ లాంటివన్నింటినీ గుర్తించి,వాటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ క్రీడల్లో ప్రతిభావంతులను గుర్తించడం నుంచి వారి చదువులకు ఆటంకం లేకుండా, అటు జాతీయ,అంతర్జాతీయ స్థాయి పోటీలకు అవసరమైన ప్రావీణ్యం నేర్పించే క్రమంలో ఎదురయ్యే ఆటుపోట్లన్నీ పరిష్కరించేలా కొత్త పాలసీ ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మన రాష్ట్రంలో ఉన్న భౌగోళిక పరిస్థితులతో పాటు మన రాష్ట్ర యువతకు ఆసక్తి ఉన్న క్రీడలకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దేశ విదేశాల్లో ఉన్న కోచ్‌లను రప్పించాలని,అక్కడున్న యూనివర్సిటీల సహకారం తీసుకునేలా ఎంఒయు చేసుకోవాలని సూచించారు.

### 13 కోర్సులు..14 క్రీడలు..

స్పోర్ట్స్ యూనివర్సిటీలో దాదాపు 13 కోర్సులు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, టెన్నిస్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, అక్వాటిక్స్ లాంటి 14 క్రీడలను స్పోర్ట్స్ హబ్ లో పొందుపరిచారు.

## గ్రూప్1 నోటిఫికేషన్‌పై హైకోర్టులో తీర్పు రిజర్వు

(మొదటి పేజీ తరువాయి)

విచారణ చేపట్టారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి, టిజిపిఎస్‌సి తరఫున ఎం.రాంగోపాల్‌రావులు వాదనలు వినిపిస్తూ పరీక్షలు రాసిన 3 లక్షల మంది నుంచి ప్రిలిమ్స్ కీపై భౌతికంగా 721, ఆన్‌లైన్ ద్వారా 6,470 అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. వాటిని నిపుణుల కమిటీ పరిశీలించిందన్నారు. ప్రధానంగా ఉన్నవాటిని పరిగణనలోకి తీసుకుని కమిటీ సిఫారసుల మేరకు రెండు ప్రశ్నలను తొలగించి కీని విడుదల చేశామని వివరించారు. ప్రస్తుతం పిటిషన్ దాఖలు చేసిన ఐదుగురిలో ఒక్కరే కమిషన్‌కు అభ్యంతరాలు తెలియజేశారన్నారు. మిగిలినవారు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా కోర్టును ఆశ్రయించారన్నారు. రెండోసారి నోటిఫికేషన్ జారీని సవాల్ చేసిన అభ్యర్థితో పాటు కీని సవాల్ చేసిన పిటిషనర్లలో ముగ్గురు మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా ఆలోచించి సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని, ఒకరిద్దరికి అర్థం కానంత మాత్రాన అవి తప్పు లైనట్లు కాదన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని, ఈ పిటిషన్‌లను కొట్టివేయాలని కోరారు. వాదనలు పూర్తికాకపోవడంతో తదుపరి విచారణను న్యాయమూర్తి శుక్రవారానికి వాయిదా వేశారు. శుక్రవారం కూడా వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది.

## 'జైకా' వెయ్యి కోట్ల రుణాలు ఏమయ్యాయి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, రాజకీయాలు తగదని బిఆర్‌ఎస్‌కు సూచించారు. అసోచాం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసి నోవాటెల్ లో శుక్రవారం జరిగిన 'అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ 2024' కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ఇప్పటికే బడ్జెట్ లో రూ.10 వేలకోట్లను కేటాయించిందని, అలాగే ప్రపంచంలో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా మార్చడానికి అనేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నదని తెలిపారు. మూసి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, కొత్త విమానాశ్రయాల నిర్మాణం, శాటిలైట్ టౌన్స్ ఏర్పాటు, మెట్రో విస్తరణ, జిహెచ్‌ఎంసి పునర్వవస్థీకరణ , సికింద్రాబాద్ ఇతర నగరాల్లో ఎలివేటెడ్ కారిడార్లు, రీజినల్ రింగ్ రోడ్ , హైకోర్ట్ భవన నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణం వంటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. హైకోర్టు భవనంలో పిపిపి మోడల్ లో పార్కింగ్ ఏర్పాటు చేసే అంశంపై ఆలోచన చేస్తున్నామన్నారు.

**జిహెచ్‌ఎంసిలో 4 మేయర్ స్థానాలను పరిశీలిస్తున్నాం ...** హైదరాబాద్ మహనగర జనాభా కోటిన్నర దాటిన నేపథ్యంలో జిహెచ్‌ఎంసిని ఇక నాలుగు మేయర్ స్థానాలుగా విభజించి, ఎన్నికలకు వెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ మహనగర రూపు రేఖలు మారిపోతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే మూసీ నది ఆక్రమణలపై మార్కింగ్ చేశారని, తాము మరింత ముందుకెళ్తుంటే బిఆర్‌ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం రాద్ధాంతం చేస్తున్నారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. మూసీ సుందరీకరణకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేసిన క్రమంలో రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లావాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోచాం రాష్ట్ర ప్రతినిధి దినేష్ తో పాటు అమెరికన్ కాన్సుల్ జనరల్ (చీఫ్ పొలిటికల్ ఎకానమిక్ సెక్షన్), హైదరాబాద్ ఫ్రాంక్‌పిటల్లూటో, ఫోనిక్స్ గ్రూప్ ఛైర్మన్ సురేష్ చుక్కపల్లి, అలార్డ్ యూనివర్సిటి విసి డాక్టర్ పూనమ్ కశ్యప్, రాంబాబు బూరుగు పాల్గొన్నారు.

## కొత్త 'సిట్' (మొదటి పేజీ తరువాయి)

సంచాలకుడి పర్యవేక్షణలో ఈ దర్యాప్తు కొనసాగుతుందని, ఆ విధంగా దర్యాప్తు కొనసాగడమే సముచితమైన విషయమని ధర్మాసనం మార్గదర్శనం చేసింది. ఇద్దరు సిబిఐ అధికారులు, ఆహార భద్రత–భారత నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ)కు చెందిన సీనియర్ అధికారి ఒకరు, ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగం నుండి ఇద్దరు ఈ స్వతంత్ర దర్యాప్తు బృందంతో సభ్యులుగా ఉంటారు. ఐతే సిబిఐ అధికారుల ఎంపిక బాధ్యతలను ఆ సంస్థ డైరెక్టరే నిర్వహిస్తారు. ఎఫ్ఎస్ఎస్ఎఐ తరపున సీనియర్ అధికారిని ఆ సంస్థ ఛైర్‌పర్సన్ ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్' అధికారుల నిజాయతీపై తమ ఉత్తర్వులు ఎలాంటి ప్రభావం చూపించబోవని కూడా సుప్రీంకోర్టు వివరణ ఇచ్చింది. ''న్యాయస్థానాన్ని రాజకీయ జగడానికి ఒక వేదికగా ఉపయోగించుకునేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోం'' అని ఈసందర్భంగా ధర్మాసనం స్పష్టం చేసింది. ''ఇదంతా రాజకీయ నాటకంగా రూపుదిద్దుకోవాలని మేం కోరుకోవడంలేదు, ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తుల మనోభావాలు, భావోద్వేగాలతో ఈ విషయం ముడిపడి ఉంది, అందుకే స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశాం'' అని విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ జరిగిందన్న ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం 'సిట్'ను సెప్టెంబరు 26న ఏర్పాటు చేసింది. కానీ అత్యున్నత న్యాయస్థానం ఈదర్యాప్తు బృందం చెల్లుబాటును తోసిపుచ్చి ఆస్థానంలో ఒక స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రకటించింది. ''మేం వివరణ ఇస్తున్నాం, న్యాయస్థానాన్ని రాజకీయ రగడకు ఒక వేదికగా ఉపయోగించుకోవడాన్ని మేం అనుమతించబోము, ఐనప్పటికీ కోట్లాదిమంది ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఐదుగురు ఉన్నతాధికారుల భాగస్వామ్యంతో ఒక స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తున్నాం'' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విచారణ సందర్భంగా ధర్మాసనం ఎదుట స్పందిస్తూ, జంతువు కొవ్వును లడ్డూ తయారీలో ఉపయోగిస్తున్నారన్న నిజం బయటపడితే మాత్రం దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు ఈదర్యాప్తును పర్యవేక్షి స్తే బాగుంటుందని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు కొనసాగించాలా? అది సరిపోతుందా? లేక ఒక స్వంత్ర దర్యాప్తు ఏజన్సీ ద్వారా ఈ తంతు జరగాలా? ఆలోచించి సలహా చెప్పాలని గతనెల 30వ తేదీన ఈ కేసు విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీంకోర్టు ధర్మాసనం కోరింది. దేవుణ్ణి రాజకీయాకు దూరంగా ఉంచాలని కూడా వ్యాఖ్యానించింది. లేబొరేటరీ టెస్టు నివేదిక ఇంకా తెలియలేదని, ఐతే తిరస్కరించిన నెయ్యిని పరీక్షించాల్సిన అవసరం ఉందని కూడా ధర్మాసనం పేర్కొంది.

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూ తయారీలో జంతువు కొవ్వును ఉపయోగించారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరోపించడంతో ఈ సమస్య ఒక అతిపెద్ద సామూహిక రాజకీయ వివాదంగా రూపుదాల్చింది. ఐతే రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవడం కోసమే అధికారపార్టీ నాయకుడు చంద్రబాబునాయుడు నీచాతినీచమైన ఆరోపణలు చేస్తున్నారని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. ఐతే ఈ సమస్యపై కోర్టు పర్యవేక్షణలోనే దర్యాప్తు జరగాలని కోరడంతో పాటు అనేకమంది ఈ వివాదంపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈకేసులో ఆంధ్రపదేశ్ ప్రభుత్వంతో సహా వాదులు, ప్రతివాదుల ఆరోపణలు, ప్రత్యారోపణల జోలికి తాము వెళ్ళదలచుకోలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సిట్ దర్యాప్తుకు ఆదేశిస్తూ ఇచ్చిన ఆదేశాల వెనుక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందంలో ఉన్న అధికారుల నిజాయతీపై ప్రభావం చూపించే భాష్యాలేమీ అన్వయించబోవని కూడా సుప్రీంకోర్టు వివరణ ఇచ్చింది.

**సుప్రీం తీర్పును స్వాగతించిన చంద్రబాబు**

**అమరావతి :** తిరుపతిలడ్డూ తయారీలో కల్తీ జరిగిందన్న వివాదంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వాగతించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు ఆయన పోస్టింగ్ పెట్టారు. ''గౌరవనీయ అత్యున్నత న్యాయస్థానం స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను నేను స్వాగతిస్తున్నాను. ఈ బృందంలో సిబిఐ నుండి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఎఐ నుండి ఒకరు, రాష్ట్ర ప్రభుత్వ పోలీసు విభాగం నుండి ఇద్దరు అధికారులు సభ్యులుగా ఉంటారు, లడ్డూ తయారీలో కల్తీ జరిగిందా? లేదా? అనే విషయంపై ఈ బృందం దర్యాప్తు చేస్తుంది'' అని చంద్రబాబు తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా వైఎస్ఆర్‌సిపి నాయకురాలు, మాజీమంత్రి ఆర్.కె.రోజా కూడా ఈ తీర్పును స్వాగతించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వు స్వాగతించదగ్గ పరిణామమన్నారు. శ్రీవారి ప్రసాదం విషయాన్ని రాజకీయం చేయకుండా ఇకమీదట ప్రతి ఒక్కరూ ఈ రాజకీయ వివాదానికి దూరంగా ఉండటం మంచిదని, రాజకీయ గందరగోళం చెలరేగే వ్యాఖ్యలు చేయకూడదని రోజా సోషల్‌మీడియాలో పేర్కొన్నారు. అంతకుముందు టిడిపి అధికార ప్రతినిధి పట్టాభిరామ్ కొమ్మారెడ్డి మాట్లాడుతూ, నిజానిజాలను వెలుగులోకి తీసుకువచ్చి నేరస్థులను శిక్షించడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమన్నారు. తిరుపతి వేంకటేశ్వరస్వామికి ఉన్న కోట్లాది మంది భక్తుల మనోభావాలు, భావోద్వేగాలతో ఆటలాడుకుంటున్న నేరస్థులను శిక్షించడమే తమ ఉద్దేశమన్నారు.''ఈ ఉత్తర్వులను మేం స్వాగతిస్తున్నాం, ఈ విషయంలో మాకు ఎలాంటి విభేదాలు లేవు, కోట్లాదిమంది హిందువులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు, నేరస్థులను శిక్షించాలని వారు కోరుతున్నారు, భక్తుల భావోద్వేగాలతో నేరస్థులు చెలగాటం అడుతున్నారు అన్నారు.

# నేరస్థులపై ఉక్కుపాదమే...

డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలను సమూలంగా రూపుమాపుతాం

అసాంఘిక శక్తులకు ఎవరు సహకరించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవు

'ఫ్రెండ్లీ పోలీసింగ్' బాధితుల కోసం మాత్రమే : 'ప్రజాపక్షం'తో ఐజిపి వి.సత్యనారాయణ



''రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకుంటున్న ఎక్కువగా డ్రగ్స్, గంజాయి, సైబర్ క్రైమ్ నేరాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం. నేరస్థుల పట్ల ఉక్కుపాదంతో కఠినంగానే వ్యవహరిస్తాం. ఫ్రెండ్లీ పోలీసింగ్ కేవలం బాధితులకు మాత్రమే. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికీ న్యాయం జరిగే విధంగా చూడాలని స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌లను ఆదేశించాం. మరోవైపు కేసుల దర్యాప్తుల విషయంలో క్రమశిక్షణ తప్పిన అధికారులపై చర్యలకు కూడా ఉపేక్షించేదిలేదు. బాధితులకు సకాలంలో న్యాయం జరిగితేనే ప్రజల్లో పోలీసుల ప్రతిష్ట రెట్టింపవుతుంది. శాంతిభద్రతల విషయంలో రాజీ సమస్యే లేదు'' అని తెలంగాణ రాష్ట్ర మల్టీ జోన్–2 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) వి.సత్యనారాయణ స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, నేరాలు, ఇతర సంస్యలపై ఐజిపి సత్యనారాయణతో 'ప్రజాపక్షం' ప్రతినిధి ఇంటర్వ్యూ ఈ కింది విధంగా ఉంది.

**ప్రశ్న: అసాంఘిక శక్తులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?**

**సత్యనారాయణ :** శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాలను అరికట్టేందుకు నిరంతరం శ్రమిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. తద్వారా దేశంలోనే తెలంగాణ పోలీస్ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేసేవిధంగా ముందుకెళ్తున్నాం. మల్టీజోన్2 పరిధిలోకి సూర్యాపేట, నల్గొండ,సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలు వస్తాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రౌడీషీటర్లపై నిరంతరం నిఘా పెట్టాం. సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు ఏమైనా పాల్పడుతున్నారా అనే విషయంపై వారి కదలికలపై ఎప్పటికప్పుడు స్థానిక అధికారులు, పోలీసు సిబ్బంది ఆరా తీస్తున్నారు. అరాచకాలకు పాల్పడే రౌడీషీటర్లకు హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నాం.

**ప్రశ్న: డ్రగ్స్, గంజాయి, నకిలీ మద్యాన్ని ఎలా అరికడతారు?**

**సత్యనారాయణ :** డ్రగ్స్, గంజాయి, నకిలీ మద్యం ఇతర మత్తుపదార్థాలను సమూలంగా అరికట్టేందుకు పోలీసు శాఖకు ప్రభుత్వం పూర్తి అధికారాలు ఇస్తూ సంపూర్ణ సహకారాన్ని ఇస్తున్నది. దీంతో తాము డ్రగ్స్‌ను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. కళాశాలలు, ఫంక్షన్‌హాల్స్, పబ్బులు, బార్లపై నిరంతరం నిఘా పెట్టాం. పాత నేరస్థులపై కూడా నిరంతర నిఘా కొనసాగిస్తున్నాం.అలాగే పేకాట స్థావరాలను పూర్తిగా అరికడుతున్నాం.

**ప్రశ్న: పలు జిల్లాల్లో సబ్సిడీ బియ్యం స్మగ్లింగ్ జరుగు–తుందని పెద్దఎత్తున వార్తలొస్తున్నాయి కదా?**

**సత్యనారాయణ :** సబ్సిడీ బియ్యం విషయంలో అక్రమాలు జరిగితే నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చు. అలాగే వివిధ జిల్లాల్లో సబ్సిడీ బియ్యం పక్కదారి పట్టకుండా చూసే బాధ్యత పోలీసులపై ఉంది. తమకు వచ్చిన పలు ఫిర్యాదులపై ఇప్పటికే నిఘావర్గాల ద్వారా విచారణ చేపట్టాం. త్వరలో నివేదిక వస్తుంది. స్మగ్లింగ్‌లో పోలీసుల పాత్ర ఉందని తేలితే వారిపై కూడా వేటు పడటం ఖాయం.

**ప్రశ్న: ఇటీవల ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని, అందులో పోలీసుల హస్తం ఉందని విమర్శలు వస్తు–న్నాయి.. దీనిపై మీ అభిప్రాయం?**

**సత్యనారాయణ :** ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపుతాం. నేరానికి ఎవరు పాల్పడినా చట్టప్రకారం రాజకీయాలకు అతీతంగా కేసులు నమోదు చేస్తున్నాం. ఇసుక అక్రమ వ్యాపారులతో చేతులు కలిపిన నలుగురు ఇన్‌స్పెక్టర్లు, 27 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లపై ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. అసాంఘిక శక్తులకు పత్యక్షంగా, పరోక్షంగా తమ సిబ్బంది ఎవరు సహకరించినట్లు తేలినా ఉపేక్షించే ప్రసక్తేలేదు. సంగారెడ్డి రూరల్, తాండూర్ రూరల్, తాండూరు టౌన్ సిఐలతో పాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), పెన్ పహాడ్, వాడపల్లి, హాలియా, ఎస్ఐలను విఆర్‌లో పెట్టాం. వీరిలో కొందరికి ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్షంగా పరోక్ష సంబంధం ఉండడంతో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుజరిగింది.



**ప్రశ్న: సివిల్ తగాదాలలో పోలీసుల జోక్యం పెరుగుతుందని, పైరవీలు ఎక్కువవుతున్నాయని విమర్శలొస్తున్నాయి కదా?**

**సత్యనారాయణ :** సివిల్ తగాదాలు, కేసులలో పోలీసు స్టేషన్ సిబ్బంది జోక్యం చేసుకోరు. పోలీసు స్టేషన్‌లో పైరవీలు చేయరాదని అన్ని పోలీసు స్టేషన్‌లలో బోర్డులు, వాల్‌పోస్టర్లు పెట్టాం. సివిల్ తగాదాలు, సెటిల్‌మెంట్లు ఠాణాలో చేయబడవు అని గోడలపై కూడా రాసి పెట్టాం. సిబ్బంది అలాంటి చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని సందర్భాల్లో వారిని ఉద్యోగాల నుంచి సస్పెండ్ కూడా చేసిన సంఘటనలు ఉన్నాయి. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులలో బాధితులైన వారికి పోలీసులు అండగా ఉండి చట్టం పరిధిలో మాత్రమే బాధితులకు న్యాయం చేస్తాం. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసుల ద్వారా చట్టప్రకారం న్యాయం లభించకపోతే తనకు లిఖితపూర్వకంగా గానీ నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చు. తమ సిబ్బందిపై వచ్చే ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరుగుతుంది. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.

---

## నేడు 'మూసీ'ప్రక్షాళనపై రైతులతో సమావేశం

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గొప్ప చరిత్ర కలిగిన 'మూసీనది' ప్రస్తుతం మానవ తప్పిదాలతో కలుషితమై పంటలు సక్రమంగా పండడం లేదని, ఆ పంట ఉత్పత్తులను కూడా తినే పరిస్థితి లేదని కాంగ్రెస్ భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన అంశంపైన చర్చించేందుకు హైదరాబాద్, నాగోల్‌లోని శుభం గార్డెన్స్ శుక్రవారం సాయంత్రం 4:00 గంటలకు జరగనున్న 'రైతుల సమావేశాని'కి అందరూ హాజరై, విజయవంతం చేయాలని రైతులను చామల కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు. గత ప్రభుత్వాలు విస్మరించిన మూసీ ప్రక్షాళనను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి చేపడుతున్నారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు, ముఖ్యంగా మూసీ పరివాహక ప్రాంత రైతన్నలు హాజరై మద్దతు ఇవ్వాలని కోరారు. మూసీ జీవనది కింద తరతరాలుగా వ్యవసాయం చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామన్నారు. ఎస్‌టిపిలతో మురికి నీటిని శు ద్ధి చేసి, మూసిలో గోదావరి జలాలను నింపి, రైతులకు మంచినీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. మూసీ నదిని శుద్ధిచేసి, పరివాహక ప్రాంత ప్రజలకు కాలుష్యం నుంచి విముక్తి కలిగించాలనే ఆలోచనతోనే సిఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తుంటే, ప్రతిపక్షాలు కుట్రలు పన్ని, అడ్డుకుంటున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులు మూసి ప్రక్షాళ కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొట్టాలని కోరారు. ఒకప్పుడు నల్లగొండ జిల్లా అంటేనే ఫ్లోరైడ్ గుర్తుకొచ్చేదని,ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్న జనాలు కళ్ళముందు కనపడేవారని, అటువంటి ఫ్లోరైడ్ సమస్యను నివారించుకున్నామని, ప్రస్తుతం మానవ తప్పిదాలతో కాలుష్యమైన మూసీ నదిని శుద్ధి చేసుకోలేమా అని కిరణ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు.

---

నా ఫామ్ హౌస్ ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉంటే ..

## దగ్గరుండి కూల్చివేయిస్తా

* శాసనమండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకే తన ఫామ్ హౌస్ ఉన్నదని, ఒకవేళ ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నట్టుగా నిరూపితమైతే, ఆ ఫామ్ హౌస్‌ను తానే స్వయంగా దగ్గర ఉండి కూల్చివేయిస్తానని శాసన మండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. తన ఫామ్‌హౌజ్ విషయంలో బిఆర్‌ఎస్ నేతలు కెటిఆర్, హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి తదితరులు తరుచూ తనపైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వారు తన ఫామ్‌హౌస్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టుగా నిరూపిస్తే వారి సమక్షంలోనే కూల్చివేయిస్తానన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఎవరికైనా ఒకటేనని, బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్‌లో తనతో పాటు కెటిఆర్, హరీశ్‌రావు ఇలా ఎవరి భవనం ఉన్నప్పటికీ ఆ నిర్మాణాలను కూల్చాల్సిందేనని తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయం మీడియా పాయింట్‌లో శుక్రవారం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ హిమాయత్ సాగర్‌లో ఆక్రమణలు తొలగించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం మంచిదని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాల్సిందేనని అన్నారు. తన ఫామ్ హౌజ్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టు ప్రభుత్వం నుండి తనకు నోటీసు జారీ అయినా, ఆ ఫామ్ హౌస్‌ను కూలగొట్టేస్తానని పట్నం మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. తాను గత కొన్నేళ్లుగా మంత్రిగా పనిచేశానని, ఎవరితో చెప్పించుకోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. తాను గత ఇరవై ఏళ్ల క్రితమే అన్నీ పరిశీలించి, అధికారులతో కూడా చర్చించి ఫామ్ హౌస్ నిర్మించినట్టు వివరించారు. ఇటీవల కూడా మళ్లీ సర్వే చేసి బఫర్ జోన్‌లో లేదని అధికారులు నివేదిక ఇచ్చారని, ఒకవేళ ఆ రిపోర్ట్ అసత్యమైతే ఫామ్ హౌస్‌ను కూల్చడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తన ఫామ్‌హౌస్‌ను దూరం నుంచి చూస్తే నీళ్లల్లో ఉన్నట్లుగానే కనిపిస్తుందని, కానీ, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో లేదని వివరించారు. తన ఫామ్‌హౌస్ పక్కనే సబితా ఇంద్రారెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కూడా స్థలాలు ఉన్నాయని మహేందర్ రెడ్డి తెలిపారు.



---

## ఫామ్‌హౌస్ ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో లేదు

ఉంటే ప్రభుత్వానికి భారం కాకుండా సొంత ఖర్చుతో కూల్చేస్తాం

రేవంత్ రెడ్డికి కెవిపి రామచంద్రరావు బహిరంగ లేఖ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తమ ఫామ్ హౌస్ బఫర్ జోన్ లేదా ఎఫ్‌టిఎల్ పరిధిలో లేదని, అలా ఉంటే ప్రభుత్వానికి భారం కాకుండా 48 గంటల్లో తమ సొంత ఖర్చుతో కూల్చివేయిస్తామని కాంగ్రెస్ మాజీ రాజ్యసభ సభ్యుడు కెవిపి.రామచంద్రరావు స్పష్టం చేశారు. అయితే కూల్చివేతల కోసం మార్కింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలన్నారు. మార్కింగ్ చేసే సమయం, తేదీ ముందే ప్రకటిస్తే తనపై పదేపదే ఆరోపణలు చేసే ప్రతిపక్ష నాయకులు, వారి అనుకూల మీడియా తీరిక చేసుకుని వచ్చి ఈ ప్రక్రియను వీక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కూల్చివేతల విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతగా తనకు ఎలాంటి మినహాయింపులు అవసరంలేదని, సాధారణ పౌరుడి విషయంలో చట్టంలో ఎలా వ్యవహరిస్తుందో అలాగే వ్యవహరిస్తే చాలన్నారు. పేదలకు నష్టం జరగకుండా చేపట్టే కార్యక్రమాలకు తాను మద్దతిస్తానన్నారు. మూసీ విషయంలో ప్రతిపక్షాలది మొసలి కన్నీరేనని, ఈ విషయం ప్రజలకూ తెలుసునన్నారు. రేవంత్‌రెడ్డి ఆశయాలను దెబ్బతీసే కొంతమంది ప్రయత్నాలను తాను ఖండిస్తున్నానన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుపై దృష్టి సారించామని గుర్తు చేశారు. 2005లో 'సేవ్ మూసీ' పేరుతో ఓ పథకాన్ని కూడా వైఎస్ ఆధ్వర్యంలో ప్రారంభించామని ఆయన తెలిపారు. మూసీ ప్రక్షాళనకు భారీగా నిధులు అవసరమని భావించిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై ముందుకు వెళ్లలేకపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం దశాబ్దాల పాటు చిత్తశుద్ధితో పనిచేశానని, ఈ విషయాన్ని నేడు ఓ కాంగ్రెస్ ముఖ్యమంత్రికి చెప్పవలసి రావడం బాధాకరమేనని, కానీ తప్పడం లేదని పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తగా కొనసాగుతున్నానని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే ప్రతి కార్యక్రమాన్ని లేదా పథకాన్ని త్రికరణశుద్ధిగా సమర్థిస్తానని, వాటి అమలుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు.



---

దసరా తర్వాత మాదిగల

## 'అసెంబ్లీ సమ్మేళనాలు'

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జిల్లాల వారీగా ఎస్‌సి వర్గీకరణ చేయాలని దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెలి మల్లికార్జున్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధనలో భాగంగా వంద అసెంబ్లీ నియోజకవర్గాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి, మాదిగల సమ్మేళనాలు నిర్వహించి, సమగ్ర సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు. ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈ అసెంబ్లీ సమ్మేళనాలు నిర్వహిస్తామని తెలిపారు.

**రేవంత్ రెడ్డిపైన కాదు... చంద్రబాబుపై ఉద్యమించు**

**మందకృష్ణ మాదిగకు పిడమర్తి రవి సూచన**

ఎపిలో ఎస్‌సి వర్గీకరణను అమలు చేయాలని ఎపి సిఎం చంద్రబాబును అడగలేని మంద కృష్ణమాదిగ, తెలంగాణ రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు విమర్శిస్తున్నారని ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి మండిపడ్డారు. ఇటీవల ఎపిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మంద కృష్ణమాదిగ టిడిపి అధ్యక్షుడు చంద్రబాబును గెలిపించారని గుర్తుచేశారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ఎస్‌సి వర్గీకరణను ఆపేలా మళ్లీ ఉద్యమాల పేరుతో పబ్బం గడుపుకోవాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి రెండు నెలలు దాటినా ఇంతవరకు చంద్రబాబును మందకృష్ణ ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాదిగ సంఘాల నేతలు వరప్రసాద్, రాపోలు రాములు, మల్లికార్జున్, నరసింహారావు, బోరెల్లి సురేశ్, బొమ్మెర సమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

---

## హుజూరాబాద్‌లో ఒక్క ఇంటిని కూల్చినా అగ్నిగుండమే...

బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ పాడి కౌశిక్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తన హుజూరాబాద్ నియోకవర్గంలో కూడా పేదల ఇళ్లకు రెడ్ మార్క్ చేస్తున్నారని, ఇక్కడ ఒక్క ఇంటిని కూల్చినా హుజూరాబాద్ అగ్ని గుండం అవుతుందని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ పాడికౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. కెసిఆర్ ప్రభుత్వ హయంలోనే రూ.16వేల కోట్లతో 'మూసీ సుందరీకరణ' ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించారన్నారు. సిఎం రేవంత్ తన జేబులు నింపుకునేందుకే మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి మాట్లా డుతూ ఇళ్లు కూల్చివేతల విషయంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించవద్దని, మళ్ళీ వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అని, తప్పు చేసే అధికారులను విడిచి పెట్టబోమని హెచ్చరించారు. హరీష్ రావు ,కెటిఆర్‌ల వీపు చింతపండు అవుతుందని చెబుతున్న సిఎంరేవంత్‌రెడ్డి, ఆయన ఇళ్లు కూలగొడుతున్న ప్రాంతాలకు సెక్యూరిటీ లేకుండా రావాలని, అప్పుడు ఎవరి వీపు చింతపండు అవుతుందో చూద్దామని అన్నారు. చెరువుల ఆక్రమణలు అంటూ ఇళ్ళు కూల్చివేయడం హైకోర్టు గత ఆదేశాలకు విరుద్ధమన్నారు. హైడ్రా, మూసీ రివర్‌ఫ్రంట్‌పైన సిఎం రేవంత్ రెడ్డి బిఆర్‌ఎస్ నాయకులపైన నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, సిఎం రేవంత్ బెదిరింపులకు భయపడే వారు ఎవ్వరూ లేరని చెప్పారు.

**కాంగ్రెస్‌కు భక్తులుగా పోలీసుల అత్యుత్సాహం: బాల్కసుమన్**

రాష్ట్రంలో కొందరు పోలీసులు కాంగ్రెస్ భక్తులుగా మారి అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ బాల్క సుమన్ ఆరోపించారు. ఇడి కేసులో చెన్నూర్ ఎంఎల్‌ఎ వివేక్ జైలుకు వెళ్లడం ఖాయమని, ఆయన ఎంఎల్‌ఎ పదవి పోవడం, చెన్నూరులో ఉపఎన్నిక రావడం ఖాయమని అన్నారు. ఆదాయ పన్ను, ఈడి లోతైన విచారణ చేస్తుంటే, మరోవైపు రాష్ట్ర పోలీసులు వివేక్ కేసును ఎలా మూసేస్తారని,దీనిపైన తాము నాంపల్లి కోర్టులో ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేశామని వివరించారు. ఈ విషయంలో అవసరమైతే తాము హైకోర్టు, సుప్రీం కోర్టు తలుపు కూడా తడతామని బాల్కసుమన్ తెలిపారు.

---

## విద్యావిధానంలో మార్పులు రావాలి

ఎస్‌టియు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆకునూరి మురళి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే రాష్ట్రంలో విద్యా విధానంలో మార్పురావాలని తెలంగాణ రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. హైదరాబాద్, కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో శుక్రవారం జరిగిన ఎస్‌టియు రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి మార్గాలు, పలు అంశాలపైన ఎస్‌టియు రాష్ట్ర, జిల్లా బాధ్యులతో ఆకునూరి మురళి చర్చించారు. అనంతరం ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.సదానందంగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను అమలు చేయాలన్నారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల సప్లమెంటరీ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సర్వీసు రూల్స్ సాధించి, ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డైట్, జూనియర్ లెక్చరర్ పదోన్నతులు ఇప్పించేందుకు రాష్ట్ర సంఘం కృషి చేస్తుందన్నారు. 317 జిఒఅంశంపైన ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం త్వరితగతిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిఎస్‌సి నియామకాలు పూర్తయిన వెంటనే, బదిలీ అయిన ఎస్‌టిసి ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, ఆశ్రమ, కెజిబివిలలో పనిచేస్తున్న సిఆర్‌టి ఉపాధ్యాయులకు అన్ని రకాల సెలవులతో పాటు, మినిమం టైం స్కేల్‌ను మంజూరు చేయాలని తెలిపారు. పిఆర్‌సి గడువు ముగిసి ఏడాది గడిచిందని, పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న నాలుగు డిఎలు, సిపిఎస్ రద్దు కోసం ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకొచ్చి, ఆ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర సంఘం కృషి చేస్తుందని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా ఉన్నతీకరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆటసదయ్య, నాయకులు ఎల్.ఎం.ప్రసాద్, జుట్టు గజేందర్, పోల్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఎం.శంకర్, శీతల్ చౌహాన్, శిరీష, రంగారావు, బి.రవీంద్ర, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

---

## కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ప్రాణం

బిసిల కులగణను రాహుల్‌గాంధీ నెత్తిన పెట్టుకున్నారు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

తల్లిదండ్రులు చేసిన పుణ్యకార్యాలే ఈ స్థాయికి తీసుకొచ్చాయి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** తల్లిదండ్రులు చేసిన పుణ్యకార్యాలే ఈ స్థాయికి తీసుకవచ్చాయని, కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరికీ గుర్తింపు తప్పక లభిస్తుందని పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పిసిసి రాష్ట్ర అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారి నిజామాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగత ర్యాలీ సన్మాన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవాణా శాఖ బిసి సంక్షేమ శాఖాధికారి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, గ్రామీణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సమాచార, ప్రచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హన్మంతురావు విచ్చేయగా ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. తమ తల్లిదండ్రులు చేసిన పుణ్యకార్యాలే తనను ఈ స్థాయికి తీసుకొచ్చాయని, రాజకీయ ప్రయాణంలో తమ తల్లిదండ్రులు నక్సల్ ప్రభావంతో ఎన్నో ఇబ్బందులు పడ్డామని, రాజకీయాల్లో తనకిచ్చిన పదవి కాపాడుకుంటూ పదవికి న్యాయం చేస్తానన్నారు. ఎమ్మెల్యే కావలని కోరిక ఉండేదని, ఏదోక పదవి ఇస్తారని నమ్మకంతో కష్టపడి పని చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి పదవులు తప్పకుండా వస్తాయని చెప్పడానికి నేనే నిదర్శనమన్నారు. 38 ఏళ్లలో లాభాల కంటే, నష్టాలు ఎక్కువ చూశానని, కానీ భగవంతుడు అన్నీ కలిపి వడ్డీతో సహా ఈ రోజు రాష్ట్ర కమిటీ అధ్యక్ష పదవి ఇచ్చాడన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నందుకు తన జీవితం ధన్యమైందన్నారు. జిల్లా ఒకప్పుడు ధనగారం ఈరోజు వెనుకబడ్డ ప్రాంతంగా మారిందని, దీనికి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలే కారణమన్నారు. ఈ జిల్లా పిసిసి అధ్యక్షులు జిల్లా జిల్లా ప్రత్యేక దృష్టి ఉంచాలని మంత్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీలో నాయకత్వం లోపం లేని జిల్లా నిజామాబాద్ అన్నారు. ఎంపిగా గంగారెడ్డి, మధుయాష్కీగౌడ్ ఉన్నప్పుడు పాస్‌పోర్ట్ కేంద్రం తెచ్చుకున్నామని గుర్తుచేశారు. ఇకపై ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిసిసి రాష్ట్ర కార్యవర్గంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఆసియా ఖండంలోని అద్భుతమైన ఫ్యాక్టరీగా ఉండేదని పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు పుష్కలంగా పరిశ్రమలో ఉన్న జిల్లా నిజామాబాద్ అని పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఇకపై నిజామాబాద్ జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడి 300 కోట్లు ఇస్తే 21 ప్యాకేజీ పూర్తి చేసుకుంటామని మంత్రులను కోరారు. విద్యాపరంగా జిల్లాలో ఒక్క మెడికల్ కళాశాల ఉందని, ప్రభుత్వపరంగా ఇంకో మెడికల్ కళాశాల రావాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరి సేవలు పక్కన పెట్టారు, ఎవరి సేవలు ఎక్కడ వాడుకోవాలో కాంగ్రెస్ పార్టీకి తెలుసన్నారు. రాజీవ్‌గాంధీతో చిన్నప్పుడు ఫొటో దిగానని, కానీ ఆ కుటుంబంతో ఇంతటి అనుబంధం ఏర్పడుతుందని ఊహలో కూడా అనుకోలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మినరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, కేశ వేణు, మునిపల్లి సాయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## రైతాంగ సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం

మాజీ మంత్రి హరీష్ రావు



**ప్రజాపక్షం/తొర్రూరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కారం చేయకుండా గాలికి వదిలేశారని, అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా రుణమాఫీపై స్పష్టత లేదని టిఆర్ఎస్ నేత మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమ్మాపురం రోడ్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి రుణమాఫీ చేయాలని కోరుతూ ఎడ్లబండ్ల పై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా 60శాతం రుణ మాఫీ చేయలేదని రైతాంగం ఇబ్బందులు పడుతుంటే ఏమీ పట్టనట్లు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని, అంతకంటే ఎక్కువ ఉంటే రైతులే చెల్లించుకోవాలని ప్రభుత్వం రైతులకు చెప్పడంతో రైతులు అప్పులు చేసి రెండు లక్షల కంటే ఎక్కువ ఉన్న మొత్తాన్ని బ్యాంకులకు చెల్లించాలని తర్వాత రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, శాసన మండల సభ్యులు పోచంపల్లి శ్రీనివాస రెడ్డి, మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**హయత్‌నగర్ సర్కిల్ -3**

**NIT.No. E/5826/15/2024-25/170, తేది: 04.10.2024**

**పని పేరు:** జిహెచ్ఎంసి, హయత్‌నగర్ సర్కిల్-3, వార్డు నెం. 11, 12లో ఉన్న నాగోలు చెరువు, మన్సూరాబాద్ చెరువులో బతుకమ్మ ఉత్సవాలు-2024 ఏర్పాట్ల కోసం (2) పనులు. టెంట్లు, కుర్చీలు వేయడం, నీటిని నింపడం, రోడ్లకు ఇరువైపులా ముగ్గు పోయడం మరియు కార్మికులను నియమించడం. **అంచనా విలువ:** రూ.3.98 లక్షలు, **బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం:** 08.10.2024న ఉ.11.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీమతి డి.ఆశలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హయత్‌నగర్ సర్కిల్-3, జిహెచ్ఎంసి, మొబైల్ నెం: 9963550657. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.eprocurement.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హయత్‌నగర్ సర్కిల్-3, జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 4975-PP/CL/ADVT/1/2024-25 Date: 04-10-2024

**డాక్యుమెంట్స్ పోయినవి**

హన్మకొండ జిల్లా వేలేరు మండలంలోని మద్దెలగూడెం గ్రామానికి చెందిన **మిల్‌కూరి భిక్షపతి, తండ్రి ఆగయ్య** గారికి సంబంధించిన పట్టాపాసు బుక్కు భిక్షపతి మద్దెలగూడెం నుండి హనుమకొండకు బస్‌లో ప్రయాణం చేయుచుండగా భూమికి సంబంధించిన పట్టా పాసు బుక్కు నెంబర్: **T21100031847,** ఖాతా నెంబరు: 60548, గలపాసు బుక్కు గత రెండు నెలల క్రితం అనగా ఆగష్టు నెలలో పోయినది. దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌లో ఇవ్వగలరని మనవి

ఇట్లు:
**మిల్‌కూరి భిక్షపతి,** తండ్రి: ఆగయ్య,
గ్రామం : మద్దెలగూడెం,
మండలం : వేలేరు,
జిల్లా : హనుమకొండ,
పిన్ నెంబర్: 506145
ఫోన్ నంబర్: 7093883418

# ఫోకస్

# విశ్వం పరిశోధనలో తొలి అడుగులు మాత్రమే!



విశ్వం అనంతం... ప్రతిక్షణం విస్తరిస్తూనే ఉంది. విశ్వ రహస్యాలను కనుగొనడానికి మనిషి శతాబ్దాలుగా ప్రయత్నిస్తునే ఉన్నాడు. కోటాను కోట్ల నక్షత్ర సమూహాలు.. వాటి చుట్టూ ఉండే గ్రహాలు.. ఉపగ్రహాలు.. లెక్కించడానికే సాధ్యంకావడం లేదు.. ఇక వాటిపై సంపూర్ణ అధ్యయనం ఎక్కడ? నిజానికి అంతరిక్ష పరిశోధనలో మనిషి ఎంతో ప్రగతి సాధించాడు. కానీ, సాధించాల్సి ఇంకా ఎంతో ఉంది. ఊహకు అందనంత త్వరగా రూపురేఖలు మారుతున్నాయి. నిన్నటి సిద్ధాంతం నేటికి పాతపడుతున్నది. కొత్తకొత్త అధ్యయనాలు వెలుగు చూస్తున్నాయి. ఈ నిరంతర అన్వేషణలో మానవుడు అంతులేని ప్రగతి సాధించాడనడంలో అనుమానం లేదు. కానీ, మొత్తం విశ్వాన్ని ఒక యూనిట్‌గా భావిస్తే, మనం ఇంకా తొలి అడుగులు మాత్రమే వేస్తున్నాం. కృష్ణ బిలాలు (బ్లాక్‌హోల్స్) నుంచి విరుద్ధ పదార్థం (యాంటీమేటర్) వరకూ ఎన్నో అంశాలు మనిషి మెదళ్లకు సవాళ్లు విసురుతునే ఉన్నాయి.1957 అక్టోబర్ 4న మొదటి వ్యోమనౌకను రష్యా విజయవంతంగా ప్రయోగించిన నేపథ్యంలో, ఏటా అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకూ వారోత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా విస్తున్నది. ఈ సందర్భంగా ఇప్పటి వరకూ సాధించిన ప్రగతిని ఒకసారి సింహావలోకనం చేసుకుందాం. ప్రపంచదేశాల్లో శాస్త్రసాంకేతిక డిజిటల్ యుగపు నవవిప్లవ ఫలాలు సగటు మానవుని జీవితంతో ఊహించలేనంతగా మార్పును తెచ్చాయి. విశ్వమానవాళి సంక్షేమానికి, సులభతర జీవన విధానానికి శాస్త్ర పరిశోధనలు ఊతం ఇస్తూనే ఉన్నాయి. అరచేతిలో స్మార్ట్ ఫోన్ వైకుంఠం వెలసి, విశ్వాన్ని కుగ్రామం చేసింది. ప్రయోగశాల నుండి ఖగోళం దాకా, వంటింటి నుంచి నక్షత్ర, గ్రహాల దాకా మానవుడు సృజించని తావు లేదు, అర్థ చేసుకోని అంశం లేదు. భూగ్రహాన్ని అర్థం చేసుకోవడానికి అంతరిక్ష పరిశోధనలు కావాలి. అనంత అంతరిక్షంలో లెక్కకు మించిన నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, గ్రహశకలాలు లాంటి అతిభారీ ఆకారాలు ఉన్నాయి. అంతరిక్షంలోని పాలపుంతలోని సూర్యమండలంలో భానుడు కేంద్రంగా ధరణితో కూడిన నవ గ్రహాలు, చందమామ లాంటి సహజ ఉపగ్రహాలు ఉన్నాయి. అనేక గ్రహాల్లో భూగ్రహం మాత్రమే జీవ మనుగడకు అనుకూలంగా ఉందని మన నమ్మకం. అంతరిక్షంలో విహరించి గ్రహాలను, ఉపగ్రహాలను శోధించేందుకు, గ్రహ ఉపగ్రహాలలో దాగిన మూలకాలు/రసాయన పదార్థాల విశ్లేషణ, అంతరిక్ష గ్రహ రహస్యాల గుట్టు విప్పేందుకు ఆధునిక అంతరిక్ష ప్రయోగాలు ముమ్మరంగా జరుతూనే ఉన్నాయి. నాసా 2016లో ప్రయోగించిన ఓసిరిస్‌రెక్స్ స్పేస్ క్రాఫ్ట్ బెన్నెటా అనే భారీ గ్రహశకలం చేరి, ఏడేళ్లుగా తర్వాత అక్కడ లభించిన గులకరాళ్లు, ధూళి కణాల సాంపుల్స్ తీసుకొని వచ్చి ఇటీవలే ఎంపిక భూఉపరితల ప్రాంతానికి చేరడం ఓ అద్భుత ప్రయోగంగా నిలుస్తున్నది. అదే కాకుండా గతంలో భూగ్రహాన్ని ఢీ కొట్టే అవకాశం ఉన్న గ్రహశకలాలను ధ్వంసం లేదా దారి మళ్లించడానికి కూడా అమెరికన్ నాసా సంస్థ చేసిన డార్ట్ (డబుల్ ఆస్టరాయిడ్ రీడైరెక్షన్ టెస్ట్) ప్రయోగాలు సఫలం కావడం ప్రపంచ మానవాళికి శుభవార్తగా వ్యాపించింది. 24 నవంబర్ 2021న ప్రయోగించిన డార్ట్ స్పేస్‌క్రాఫ్ట్ 11 మిలియన్ కిమీ దూరంలో 526 అడు గుల వ్యాస పరిమాణం ఉన్న 'డైమార్ఫోస్' గ్రహశకలాన్ని 26 సెప్టెంబర్ 2022న ఢీ కొట్టడంతో గ్రహశకలం ముక్కలు కావడం, దారి మళ్లడం జరిగింది. ఇలాంటి అద్భుత అంతరిక్ష ప్రయోగాలతో విశ్వ మానవాళి మనుగడ (శాస్త్రసాంకేతిక ప్రగతితో) సుగమం అవుతున్నది. డార్ట్ ప్రయోగం విజయవంతం కావడంతో భవిష్యత్తులో భూమిని ఢీ కొట్టే అవకాశం కలిగిన గ్రహశకలాల దారిని మళ్లించడానికి మార్గం సుగమమైంది. 'అంతరిక్షం.. వాతావరణ మార్పులు' అనే నినాదంతో ఈఏడాది ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు జరుగుతున్నా యి. వాతావరణ మార్పులపై అందరి దృష్టిని ఆకర్షించే ప్రయత్నం హర్షణీయం. అంతరిక్ష పరిశోధనలు క్రీస్తు పూర్వమే ప్రారంభమైనప్పటికీ, ఆధునిక ప్రపంచ అంతరిక్ష చరిత్ర విషయానికి వస్తే, 1957 అక్టోబర్ 4న ప్రథమ మానవ నిర్మిత భూ ఉపగ్రహం (ఎర్త్ శాటలైట్), స్పుత్నిక్1ను అంతరిక్షంలోకి ప్రయోగించగా, 10 అక్టోబర్ 1967న బాహ్య అంతరిక్ష ఒప్పందం(అవుటర్ స్పేస్ ట్రీటీ)లో సంతకాలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ వారోత్సవాలలో ఐరాస సభ్యదేశాలకు చెందిన విద్యాలయాలు, ప్రభుత్వ వేదికలు, అంతరిక్ష సంస్థలు, ప్రదర్శనశాలలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, సామాన్యులకు అంతరిక్ష పరిశోధనలు మరియు రహస్యాలను వివరించే ప్రయత్నాలు చేస్తున్నారు. సామాన్య ప్రజానీకంలో అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంచడం, అంతరిక్షశాస్త్రం పట్ల ఆసక్తిని కలిగించడం, అంతరిక్ష పరిశోధనలతో మానవాళి సుస్థిరాభివృద్ధి, అంతరిక్ష శాస్త్రజ్ఞుల సేవలు గుర్తించడం, యువతను వైజ్ఞానిక, సాంకేతిక, ఇంజనీరింగ్ మరియు గణితశాస్త్రాల వైపు దృష్టి మరల్చడం మరియు అంతరిక్ష పరిశోధనలలో ప్రపంచదేశాలను సమన్వయ పరచడం లాంటి అంశాలను చేపడతారు. గత ఆరు దశాబ్దాలుగా పలు అంతరిక్ష సంస్థలు కృత్రిమ ఉపగ్రహాలను ప్రయోగిస్తూ, పరిశోధిస్తూ, సాంకేతిక ఫలాలను సకల మానవాళి సౌభాగ్య సన్నిధికి చేర్చడంలో అనేక మైలు రాళ్ళు దాటుతూ వస్తున్నది. మన అంతరిక్ష పరిశోధనల పుణ్యాన వాతావరణ హెచ్చరికలు, టివిలో ప్రత్యక్ష ప్రసారాలు, స్మార్ట్ ఫోన్ విప్లవాలు, జిపియస్ టెక్నాలజీ లాంటి అద్భుతాలు సుసాధ్యం అయ్యాయి. నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ మొదటిసారి (20 జూలై 1969న) ఇంద్రమండలంపై అడుగిడి అర్థశతాబ్దం దాటింది. సూక్ష్మ, చిన్న మరియు 10 సెంటీమీటర్ల ఘనాకారం ఉపగ్రహాలను చవకగా ప్రయోగించే స్థాయికి చేరాం. రిమోట్ సెన్సింగ్, గురుత్వాకర్షణ, పర్యావరణ పరిజ్ఞానం, అంతరిక్ష శాస్త్రం, గ్రహవ్యవస్థ, ఆస్ట్రానమీ, మెటీరియల్ సైన్స్, జీవశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతికశాస్త్ర రంగాల్లో విప్లవాత్మక అంతరిక్ష పరిశోధనలు జరుగుతు న్నాయి. ఐఓటి మరియు ఎంబెడెడ్ వెబ్ టెక్నాలజీ, కెమెరా సెన్సార్స్, జిపియస్, కమ్యూనికేషన్ మరియు ఇంటర్నెట్ లాంటి ఆధునిక విప్లవానికి అంతరిక్ష పరిశోధనలే పునాదులు వేశాయి. అనంత అంతరిక్షంలో దాగి ఉన్న విశ్వాంతరాల రహస్యాలను బయటకు తీసి, ప్రపంచ మానవాళి సుఖ జీవనయానాలకు, సౌభాగ్యాలకు పూల బాటలు వేయాలనే అంతరిక్ష సంస్థల ఆశలు సఫలం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.




## అంతరిక్షంలో భారతం





ఇండియా అంతరిక్ష చరిత్రలో 1969లో తొలి అడుగుగా స్వయంప్రతిపత్తి గల భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, ఇస్రోను నెలకొల్పడం జరిగింది. ప్రతిష్టాత్మక ఇస్రో నేతృత్వంలో ఉపగ్రహాల రూపకల్పన, అభివృద్ధి, అసెంబ్లింగ్ మరియు ప్రయోగించడం జరుగుతోంది. అంతరిక్ష ఉపగ్రహ ప్రయోగ వాహనాలను తయారుచేయడం, శ్రీహరికోట ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుండి అంతరిక్ష కక్ష్యలోకి చేర్చడం తేలికైంది. ఇస్రో ప్రధాన కార్యాలయం బెంగళూరులో, అంతరిక్ష ఉనువర్తన కేంద్రం అహమ్మదాబాద్, విక్రం సారాబాయ్ అంతరిక్ష కేంద్రం తిరువనంతపురం, సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం శ్రీరరికోట, మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ హసన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ హైదరాబాద్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత అంతరిక్ష పరిశోధనా కేంద్రాలు ఇస్రో సొంతం కావడం మనందరికీ గర్వకారణం. 1975లో రష్యా నుండి ఇస్రో ప్రయోగించిన మొదటి భారత ఉపగ్రహం ఆర్యభట్టా, 1980 భారత్ స్వతంత్రంగా ప్రయోగించిన రోహిణి, ఇన్సాట్, జీసాట్, పియస్‌యల్‌వి, జియస్‌యల్‌వి, చంద్రయాన్, గగన్‌యాన్ వరకు అనేక మైలు రాళ్ళు విజయవంతంగా దాటుతూ వస్తోంది.

### చంద్రయాన్‌-3, ఆదిత్య L1 మిషన్లు ఇస్రో ప్రతిభకు నిదర్శనం..

భారత ప్రతిష్టాత్మక ఇస్రో సంస్థ ప్రయోగించిన చంద్రయాన్3 విక్రమ్ లాండర్ విజయవంతంగా చందమామ ఉపరితలంపై వాలడం, ప్రజ్ఞా రోవ ర్లు ఉపరితలం మీద పరిశోధిస్తూ కదలడం లాంటి అసాధారణ ఫలితాలు దేశ ప్రజలను విస్మయ పరిచింది. అదే విధంగా ఇస్రో ప్ర యాగించిన ఆదిత్య ఎల్1 మిషన్ విజయవంతంగా దూసుకుపోతూ 9.2 లక్షల కిమీ దాటి గురుత్వాకర్షణ పరిధి వదిలి భానుడి గుట్టు విప్పేందుకు ముందుకు సాగుతోంది. అంతరిక్ష అంతు చూడడం, మానవాళి జీవనశైలిలో సకారాత్మక మార్పులు తేవడానికి ప్రపంచ దేశాలు అంతరిక్ష ప్రయోగాలకు అతి ప్రాధాన్యతలను ఇస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రతి ఏటా అక్టోబర్ 04 నుండి 10 వరకు విశ్వవ్యాప్తంగా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 06 డిసెంబర్ 1999న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను సభ్యదేశాలు నిర్వహిస్తున్నాయి.

## మహిళల ముందంజ..



విశ్వ అంతరిక్ష పరిశ్రమలో మహిళల వాటా దాదాపు 22 శాతం. అంతరిక్షంలో మహిళలు దూసుకుపోవడానికి ఐక్యరాజ్య సమితి 'స్పేస్4వూమెన్' అనే నినాదంతో అంతరిక్ష వైజ్ఞానికశాస్త్రం, టెక్నాలజీ, ఇన్నొవేషన్, ఎక్స్‌ప్లొరేషన్ రంగాల్లో పలు ప్రణాళికలు చేస్తున్నది. 1963లో వాలెంటీనా తెరిస్కోవా అంతరిక్షయానం చేసిన తొలి మహిళగా చరిత్రకు ఎక్కారు. నాటి నుండి నేటి వరకు 65 మంది మహిళలు అంతరిక్ష నౌకలో ప్రయాణించి పరిశోధనలు చేశారు. భారత సంతతికి చెందిన కల్పనా చావ్లా, సునితా విలియమ్స్, రాకేష్ శర్మ, శిరీష బండ్లలు వ్యోమగాములుగా అంతరిక్షయానం చేశారు. ప్రస్తుతం సునితా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్/ ఐఎస్‌ఎస్)లోనే చిక్కుబడి వున్న విషయం తెలిసిందే. కేవలం ఎనిమిది రోజులు ఐఎస్‌ఎస్‌లో ఉండేందుకు బోయింగ్‌కు చెందిన స్టార్ లైనర్‌లో, ఈ ఏడాది జూన్ 5న ఐఎస్‌ఎస్‌కు చేరుకున్న సునీత, వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. మరమ్మతులు పూర్తి చేసుకొని స్టార్‌లైనర్ సెప్టెంబర్ 24న తిరిగి భూమికి చేరుకుంది. కానీ, భద్రతా అంశాలను దృష్టిలో ఉంచుకొని, వ్యోమగాములు లేకుండానే స్టార్‌లైనర్‌కు వెనక్కు తెచ్చారు. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ అంతరిక్ష యాత్రను 'క్రూ9' పేరుతో ఇప్పటికే ప్రారంభించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో, స్పేస్‌ఎక్స్ వ్యోమనౌకలో సునీత, ఆమెతోకలిసి ఐఎస్‌ఎస్‌కు వెళ్లిన బుచ్ విల్మోర్‌ను కూడా భూమికి చేరుస్తుంది. అంతరిక్ష పరిశోధనల్లోనేకాదు... సవాళ్లను ఎదుర్కోవడంలోనూ మహిళలు ముందంజలో ఉన్నారని చెప్పడానికి సునీత ఉదంతమే నిదర్శనం.



## పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- ఉత్తరం నుంచి దక్షిణం వరకు భారతదేశపు పొడవు ఎంత?
  3214కి.మీ.
- గురుశిఖర శిఖరం ఏ రాష్ట్రంలో ఉంది?
  రాజస్థాన్
- మొక్కల్లోని ఏ భాగంలో కణవిభజన చురుకుగా జరుగుతుంది?
  వేళ్లు
- మద్రాసు ప్రెసిడెన్సీ మొదటి గవర్నరు ఎవరు?
  థామస్ పిట్
- భారతదేశం స్పేస్ కమిషన్, డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ ను ఎప్పుడు ఏర్పాటు చేసింది?
  1972
- మద్రాసులో సెయింట్ జార్జి కోటను నిర్మించిన ఆంగ్లేయుడు ఎవరు?
  ఫ్రాన్సిస్ డే
- భారత్‌చైనా మధ్య ఉన్న సరిహద్దు రేఖను ఏమంటారు?
  మెక్ మోహన్ రేఖ
- భారతదేశంలో డచ్చివారి మొదటి శాశ్వత వర్తక స్థావరం ఏది?
  మచిలీపట్నం
- అన్నివైపులా నీటితో ఆవరించి ఉన్న భూభాగం ఏది?
  ద్వీపం
- పోర్చుగల్ దేశం స్పెయిన్ వశమైన సంవత్సరం?
  1580
- క్రయోజెనిక్ ఇంజిన్లో ఏ వాయువును ఇంధనంగా వాడతారు?
  ద్రవ హైడ్రోజన్
- మొదటి బహదూర్ అసలు పేరు?
  మువజ్జం
- శ్రీలంక తన పేరును 'సిలోన్' నుంచి ఏ సంవత్సరంలో మార్చుకుంది?
  1972
- భారతదేశంలో సముద్ర తీరం ఉన్న రాష్ట్రాలు ఎన్ని?
  9
- ప్రపంచంలో ఎత్తయిన విమానాశ్రయం ఉన్న ప్రదేశం?
  బంగ్డా, తూర్పు టిబెట్
- వాస్కోడిగామా రెండోసారి భారతదేశానికి వచ్చిన సంవత్సరం?
  1502
- అత్యంత పొడవైన పోస్టల్ నెట్ వర్క్ ఉన్న దేశమేది?
  భారతదేశం
- భారత న్యాయవ్యవస్థ ఏ దేశ న్యాయవ్యవస్థను పోలి ఉంది?
  గ్రేట్ బ్రిటన్
- సాంఘిక దురాచారాలు ప్రబలిన కాలం ఎవరిది?
  కాకతీయులు
- రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల సహాయంతో ఇస్రో తీసిన భూమి ఛాయాచిత్రాలను ఏమని పిలుస్తారు?
  భువన్
- దాదాభాయ్ నౌరోజీ జాతీయ ఆదాయం లెక్కించిన సంవత్సరం?
  1868
- 1970లో అణ్వాయుధ పరీక్షలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం ఏది?
  గ్రీన్‌పీస్
- గురు నానక్ వారసుడు ఎవరు?
  గురుఅంగద్
- ఐక్యరాజ్యసమితిలోని ఏ అంగాన్ని ప్రపంచ పార్లమెంట్ అని పిలుస్తారు?
  జనరల్ అసెంబ్లీ

## పెంచిన రేట్లపై ఆనందం వ్యక్తపర్చిన హమాలీలు



**ప్రజాపక్షం/ నర్సంపేట :** ప్రతి రెండు సంవత్సరాలకోకసారి రేట్లు పెంచే అనవాయితీ ప్రకారం రేట్లు పెంచడంతో హామీలు శుక్రవారం ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం నర్సంపేట సివిల్ సప్లయి గోదాం ప్రాంగణంలో హామాలీలు సంబరాలు నిర్వహించుకున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హామాలీ సంఘం రాష్ట్ర గుంపెల్లి మునీశ్వర్ పాల్గొని ప్రసంగించారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ బాలరాజ్ ఆధ్వర్యంలో ప్రతి రెండు సంవత్సరాలకోక్కసారి రేట్లు పెంచే అనవాయితీ ఉందని, గత ప్రభుత్వం రేట్ల అగ్రిమెంట్ అయిపోయిన తర్వాత ఒక సంవత్సరం అమలు చేయడం జరిగిందని, ఈ ప్రభుత్వం అగ్రిమెంట్ 2023తో ముగిసిందని, రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో పోరాటాలు, ధర్నాలు చేసిన కూడా 9నెలల వరకు రేట్లు పెంచకుండా కాలయాపన చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 3న సివిల్ సప్లయి కమిషనర్ ఆధ్వర్యంలో జెఎసి ద్వారా రేట్ల ఒప్పందం చేసుకోవడం జరిగిందని, జనవరి 01, 2024 అమలులో ఉంటాయని, అదేవిధంగా ఒక క్వింటాకు ఎగుమతి, దిగుమతి రూ.29, బోనస్ రూ. 7500 అమలు చేయగా స్వీట్ బాక్స్, 900 బట్టల కుట్టకూలీ, రూ. 1600 ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని, 350 కిలోల బేలు, రూ.200 రేట్లు పెంచినట్లు ప్రకటించారు. పెరిగిన రేట్లపై హామాలీ కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నర్సింగం, మహేందర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బస్తా రేట్లు పెంపు సంతోషదాయకం



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** సివిల్ సప్లయి హమాలీల బస్తా రేట్లు పెంపు సంతోషమని సివిల్ సప్లయి కార్పొరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య అన్నారు. శుక్రవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సివిల్ సప్లయి కార్పొరేషన్‌లో పని చేస్తున్న హమాలీలు, స్వీపర్ల నూతన రేట్లు, వేతనాలు ఈ సంవత్సరం జనవరి 1 నుంచి పెంచి అమలు చేయాలని, అనేకసార్లు ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన, పోరాట కార్యక్రమాలు నిర్వహించిన నేపథ్యంలో రాష్ట్ర కమిషనర్ చౌహాన్ యూనియన్ నాయకత్వానికి చర్చలకు ఆహ్వానించామన్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన చర్చలో హమాలీలతో పాటు స్వీపర్ల వేతనాలు పెంచటం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.దేవేందర్, కోశాధికారి భాజన్న, నాయకులు తదితరుల పాల్గొన్నారు.

## ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు భారీగా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యవసర వస్తువులను దళారులు, వ్యాపారులు గోదాములకు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. వీరిపై రాష్ట్ర రెవెన్యూ, సివిల్ సప్లయి, ఫుడ్ సెఫ్టీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, జిల్లా రైతు సంఘం మాజీ ఉపాధ్యక్షులు నంద్యాల రాంరెడ్డి, ఎఐటియుసి ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో బహుళ ప్రయోజనాలు

పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు





**ప్రజాపక్షం/భద్రాచలం/సుజాతనగర్:** ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో బహుళ ప్రయోజనాలు చేకూరతాయని కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పాల్వంచ పట్టణ పరిధిలోని బొల్లోరు గూడెం 10వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చి డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వేను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలును సులభతరం చేసేందుకు డిజిటల్ కార్డు దోహదపడుతుందన్నారు. సర్వే సమయంలో ఇళ్ల వద్ద లేనివారి కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకు ఈ కా ర్డును ప్రభుత్వం జారీ చేసేందుకు సిద్ధమైందన్నారు. వన్ స్టేట్, వన్ కార్డు ఆలోచనతో ప్రారంభించిన ఈ బహుళ ప్రయోజనాలు కార్డుల జారీ ప్రక్రియను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, రైతుబీమా, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ, ఆసరా ఫించన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాల వివరాలు 30 శాఖలు, 30 రకాలుగా సమాచారం సేకరించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని, ఇలా కాకుండా అర్హులైన వారంతా ఒకే కార్డు ద్వారా ఈ సేవలను పొందడానికి వీలుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డిఓ డి.మధు, తహశిల్దార్ వివేక్, పుల్లయ్య, ఎంపిడిఓలు, , పట్టణ ఎస్‌ఐ సుమన్, రెవెన్యూ సిబ్బంది, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వానాథం సిపిఐ పట్టణ కార్యదర్శి సాయిబాబా, పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, సుధాకర్, శ్రీనివాసరావు, జకరయ్య, లాల్‌పాషా, ఆదినారాయణ, కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

### సింగభూపాలెం చెరువు అభివృద్ధికి కృషి చేస్తా

సింగభూపాలెం చెరువు అభివృద్ధికి సుందరీకరణ కోసం 8.50 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని కూనంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువులో ప్రభుత్వం నుండి 100% ఉచితంగా ఒక లక్ష చేప పిల్లలను వారి చేతుల మీదుగా వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ సింగభూపాలెం చెరువు కాకతీయుల నాటి పురాతనమైన చెరువు దీని మీద ఆధారపడి చాలా కుటుంబాలు ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. సీతారామ సాగర్ నీటి ద్వారా ఈ ప్రాంతంలో 2000 ఎకరాలకు నియోజవర్గం మొత్తం 25 వేల ఎకరాల సాగునీరు అదనంగా అందించడం కోసం కృషి జరుగుతుందన్నారు. రైతులకు నీటి వసతి చాలా ప్రధానమైందని రెండు పంటలకు నీరు అందించడం కోసం ముఖ్యమంత్రి నీటిపారుదల శాఖ మంత్రులతో మాట్లాడి నియోజవర్గం మొత్తం నీటి సమస్యలు లేకుండా చెరువులు కాలువల అభివృద్ధి కోసం నిధులు మంజూరుకు కృషి చేస్తున్నామని, కాలువలు అభివృద్ధి కోసం సుమారు 100 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే టెండర్లను పిలవడం జరుగుతుందన్నారు.

సుజాతనగర్ మండలంలోని సుజాతనగర్, నాయకుల గూడెం, కోమటిపల్లి, నిమ్మల గూడెం, మంగపేట, లక్ష్మీదేవి పల్లి గ్రామపంచాయతీలను కార్పొరేషన్ గా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాషా, టిపిసిసి సభ్యులు నాగ సీతారాము లు, పిఎసిఎస్ చైర్మన్ మండే హనుమంతరావు, మత్స్యశాఖ అధికారి డిడి ఖదీర్ అహ్మద్, మత్స్య శాఖ జిల్లా అధికారి ఇంతియాజ్, జిల్లా అధ్యక్షులు బుచ్చన్న, ఇరిగేషన్ ఈ ఈ అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను తప్పదోవ పట్టిస్తున్న కార్మిక సంఘాలు : సీతారామయ్య

**ప్రజాపక్షం/కాసిపేట :** సింగరేణిలో లాభాల్లో ప్రకటన విషయంలో కొన్ని కార్మిక సంఘాలు వాట్సాప్‌లో మెసేజ్‌లు పెడుతూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట 1 ఇంక్లైన్‌లో ఎఐటియుసి ఆధ్వర్యంలో ద్వార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాల్లో వాటా 33శాతం పంపిణి విషయంలో ఎఐటియుసి అన్ని బొగ్గు బావుల మీద చార్ట్ ద్వారా తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. కొన్ని కార్మిక సంఘాలు కార్మికులను తప్పుదారి పట్టించడానికి వచ్చిన లాభాం 4700 కోట్లు అయితే 2412 కోట్లు కార్మికులకు ఇస్తున్నారు. కార్మికులకు అన్యాయం చేశారని వాట్సాప్‌లలో మెసేజ్‌లు పెట్టారని మండిపడ్డారు. వచ్చిన లాభాలలో స్థూల లాభం ఎంత, ఇన్వెస్ట్మెంట్ పోను నికర లాబం ఎంత, పర్సెంట్ ఇచ్చారు, అని వాల్‌పోస్టర్‌లు వేసిన తరువాత కార్మికులకు అందరికి అర్థమైందని అన్నారు. ఈ రోజు దీపావళి బోనస్ రూ.93750లు, లాభాల్లో వాట ఒక్కో కార్మికునికి సుమారుగా 1,80,000 ఇప్పించిన ఘటన ఎఐటియుసిదే అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఎఐటియుసి పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఎఐటియూసి నాయకులు చిప్ప నర్సయ్య, ఫిట్ సెక్రటరీ మినుగు లక్ష్మి నారాయణ, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూములు కాపాడి పేదలకు పంచాలి

కలెక్టర్‌కు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** బడా బాబుల, కబ్జాకోరుల మధ్య అన్యాక్రాంతమైన, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను పేద ప్రజల ఇండ్ల స్థలాలకు ఇవ్వాలని, అదేవిధంగా కబ్జా కోరులపై, వారికి సహకరించిన సంబధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్రె బిక్షపతి మాట్లాడుతూ హనుమకొండలోని హంటర్ రోడ్ సైన్స్ సెం టర్ ప్రాంతంలోని సర్వే నెంబర్ 964, 966 లో ఉన్న 49 ఎకరాల ప్రభుత్వ భూమిలో 10 ఎకరాలకు పైగా కబ్జాకోరులు అన్యాక్రాంతం చేశారని, బడా నేతల కనుసన్నలోనే ఈ భూమి కబ్జాకు గురై నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, సంబంధిత రెవెన్యూ, ము న్సిపాలిటీ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఈ భూ కబ్జాలు జరిపి నిర్మాణాలు జ రిగాయని కలెక్టర్‌కు తెలిపారు.అన్యాక్రాంతమైన భూమిలో నిర్మాణాలు చేసినటువంటి భూమితో పాటు మిగులు ఖాళీగా ఉన్న సుమారుగా 49 ఎకరాల భూమిని ఇండ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా పంచి ఇవ్వాలని, అదేవిధంగా కబ్జా కోరులపై, నిర్లక్ష్యం గా వ్యహరించిన అధికారులు ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కో రారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి అట్టి భూమిని గుర్తించి అన్యాక్రాంతం కా కుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహయ కార్యదర్శి మద్దె ల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు నద్దునూరి అశోక్ స్టాలిన్, హనుమకొండ మండల కా ర్యదర్శి ఏశబోయిన శ్రీనివాస్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, సిపిఐ జిల్లా నాయకులు మునిగాల భిక్షపతి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

పాల్గొన్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, నేదునూరి జ్యోతి

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ సాంస్కృతి సాంప్రదాయాలు బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలయం అని అన్నారు. రకరకాల పూలతో బతుకమ్మను తమ సుఖ దుఃఖాలను పంచుకుంటూ చేసుకునే వేడుకే బతుకమ్మ పండుగ అని అన్నారు. ఆటపాటలతో పాటు మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న వివక్షతలపై అణచివేతలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్ష పతి, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంద సదాలక్ష్మి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాసవల్ల దీనా, మంచాల రమాదేవి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మహిళా సమాఖ్య నాయకులు గడ్డం లలిత,తిరుమల, మంగ, స్వరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# త్వరలో ప్రధాని మోదీ 'చక్రవ్యూహం' బద్దలు

## బిజెపి నిరుద్యోగ రోగం వ్యాప్తితో పెను ప్రమాదంలో హర్యానా యువత భవిష్యత్తు : రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** హర్యానా ఆర్థిక వ్యవస్థలో బిజెపి విఫలమైందని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాల 'చక్రవ్యూహాన్ని' త్వరలోనే రాష్ట్ర ప్రజలు బద్దలుకొడతారన్నారు. 'నిరుద్యోగ రోగం'ను బిజెపి వ్యాప్తి చేసి రాష్ట్ర యువత భవిష్యత్తును పెను ప్రమాదంలో పడేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత ఉపాధిని తిరిగి తీసుకువస్తామని, ప్రతి కుటుంబం సుభిక్షం చేస్తామని హామీనిచ్చారు. తాను ఇటీవల చేసిన విజయం సంకల్ప్ యాత్ర సందర్భంగా మహిళా సంఘాలతో ముఖాముఖి అయిన వీడియోను రాహుల్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. దాంతో పాటు బిజెపి నిరుద్యోగ రోగాన్ని వ్యాప్తి చేసి హర్యానా మూలాలను, యువత భవిష్యత్తును, రాష్ట్ర భద్రతను పెను ప్రమాదంలో పడేసిందని పోస్టు చేశారు. విజయ్ సంకల్ప్ యాత్ర సందర్భంగా కొంతమంది అక్కా చెల్లెళ్లు తనకు ఆశ్రయం కల్పించారని, ప్రేమతో ఇంట్లో వండిన రోటీలు ఇచ్చారన్నారు. అదే విధంగా రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట సమస్యలను వివరించారని రాహుల్ తెలిపారు. నేడు హర్యానా దేశంలోనే అత్యధిక నిరుద్యోగరేటును కలిగి ఉందన్నారు. దీనికి కారణం దశాబ్దకాలంలో రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించే ప్రతి వ్యవస్థ వెన్నెముకను బిజెపి విరవడమేనని ఆయన ఆరోపించారు. లోపభూయిష్టమైన జిఎస్‌టి, నోట్ల రద్దుతో చిన్న వ్యాపారాల వెన్ను విరిచిందని రాహుల్ మండిపడ్డారు. అగ్నివీర్‌తో సైన్యానికి సిద్ధమవుతున్న యువత స్ఫూర్తిని బద్దలు కొట్టిందన్నారు. నల్ల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయ వ్యాపారం చేస్తున్న వారి ధైర్యాన్ని బిజెపి విచ్ఛిన్నం చేసిందని, వారి మద్దతును లాక్కోవడం ద్వారా క్రీడాకారుల కలలను భగ్నం చేసిందని గాంధీ ఆరోపించారు. 'పరివార్ పెహచాన్ పత్ర'తో ప్రభుత్వ రిక్రూట్‌మెంట్‌ను నిలిపివేయడం ద్వారా కుటుంబాలను విచ్ఛిన్నం చేశారన్నారు. దీని ఫలితంగా డ్రగ్స్ బారిన పడి యువత ప్రతిభ వృథా అవుతోందని, నిరాశ చెందిన యువత నేరాల బాట పడుతోందని, డుంకీ వంటి ప్రమాదాల ప్రయాణంతో కుటుంబాలు నాశనమవుతున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల పర్మినెంట్ ఉద్యోగాలు కల్పిస్తుందని, హర్యానాను డ్రగ్స్ ఫ్రీగా మారుస్తామని హామీనిచ్చారు. ఈ వినాశనాన్ని ఆపుతానని, వారి పిల్లలను రక్షిస్తానని ఉపాధి తిరిగి వస్తుందని, ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉంటుందని భరోసానిస్తున్నానన్నారు. తాను ఇటీవల గోహనాలో రుచికరమైన జిలేబీలపై, వాటిని మరింత విస్తృతంగా విక్రయించే అవకాశం గురించి మాట్లాడానని మరొక పోస్టులో రాహుల్ గుర్తుచేశారు. భారతదేశంలో ఇలాంటి చిన్న ఉత్పత్తిదారులకు సంబంధించి 5,500 క్లస్టర్లు ఉన్నాయని, వారికి సరైన మద్దతు ఇస్తే ప్రపంచానికి తమ ఉత్పత్తులను మార్కెట్ చేయగలరని ఆయన అన్నారు. వారికి ఆర్థిక, సాంకేతికత, నెట్‌వర్క్‌లు, బ్రాండింగ్ మెరుగైన సంస్థను అందించడానికి విధానాలు అవసరమని గాంధీ నొక్కి చెప్పారు. ఈ మద్దతుతో మిథాయ్‌ను మాత్రమే కాకుండా సోపోర్ నుండి ఆపిల్‌లను, బళ్లారి నుండి జీన్స్, కొల్హాపురి చప్పల్స్, మేఘాలయ నుండి పైనాపిల్స్, బీహార్ నుండి మఖానా, మొరాదాబాద్ నుండి బ్రాస్‌వేర్‌తో ప్రపంచం ఆనందిస్తుందన్నారు. భారతదేశానికి ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే వేగవంతమైన ఆర్థిక వృద్ధి అవసరమని, ప్రపంచ వేదికపై పోటీపడే మరింత ఉత్పాదక ఆర్థిక వ్యవస్థ అవసరమని గాంధీ అన్నారు. మోదీజీ చేసినటువంటి కొన్ని కుటిల కంపెనీలపై దృష్టి పెట్టడం కంటే మన చిన్న వ్యాపారాలకు సాధికారత కల్పించడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది అని ఆయన అన్నారు. భారతదేశానికి అవసరమైన కోట్లాది అధికారిక ఉద్యోగాలను సృష్టించడానికి సమ్మిళిత వృద్ధి ఏకైక మార్గం అని ఆయన అన్నారు.





## పశ్చిమాసియా యుద్ధంలో 15 వేలమంది భారత కార్మికుల నియామకం

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా యుద్ధంలో ఇజ్రాయెల్‌లో దాదాపు 15,000 మంది భారతీయ కార్మికులను నియామకం చేసుకోవడానికి మోదీ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సహకారం సులభతరం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం ఆరోపించారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి వెళ్లినందుకు దేశంలోని యువకులు అనుమానాస్పద ఏజెంట్లతో మోసగించబడ్డారని, చాలా మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ యువ వ్యతిరేక విధానాల ద్వారా ప్రేరేపించబడిన నిరుద్యోగం గురించి చాలా గొప్పుగా చెబుతున్నారని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. నైపుణ్యం లేని, సెమీ స్కిల్డ్, విద్యావంతులైన యువతీ యువకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి, అధిక జీతాలతో యుద్ధంలో ఉన్న థియేటర్లలో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారనే వాస్తవమన్నారు. ఈ సంఘర్షణ ప్రాంతాలలో ఉద్యోగాల కోసం ఒత్తిడికి గురవుతున్న హర్యానా యువత రేపు బిజెపికి తగిన గుణపాఠం చెబుతారని ఖర్గే తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంలో ఇజ్రాయెల్‌లో దాదాపు 15,000 మంది భారతీయ ఉద్యోగుల నియామకానికి మోదీ ప్రభుత్వ జాతీయ నైపుణ్యాభివృద్ధి సహకారం ఏదీ తక్కువ కాదు'' అని ఆయన ఆరోపించారు.

## దేశంలో అసమానతలు తగ్గాయ్ జీవన ప్రమాణాలు దూసుకుపోతాయ్

### కౌటిల్య ఆర్థిక సదస్సులో నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ :** దేశంలో సామాన్యప్రజల జీవనప్రమాణాలు రాబోయే దశాబ్దాలలో నిటారుగా పైకి దూసుకుపోతాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశంలో అసమానతలు తగ్గిపోయాయన్నారు. అదేవిధంగా దేశంలో తలసరి ఆదాయాలు కూడా కొద్ది సంవత్సరాల్లోనే రెట్టింపు ఐపోతాయని ఆశల నిచ్చెనలు పరిచారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కౌటిల్య మూడవ ఆర్థిక సదస్సులో నిర్మలాసీతారామన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి, తీసుకుంటున్న చొరవల కారణంగా ప్రభుత్వం మద్దతుతో సామాన్య మానవుడి జీవన ప్రమాణాలు ఊహించనంగా పైకి దూసుకుపోవడాన్ని అందరూ చూస్తారన్నారు. దేశంలో సంపద అసమానతలు, ఆదాయ అసమానతలు, వినియోగ అసమానతలకు గణాంక కొలమానంగా ఉపయోగించే జీనీ రేషియో (జీనీ కోఎఫిషియంట్) ప్రకారం దేశంలో అసమానతలు తగ్గాయని, ఈ విషయంలో ఎంతో మెరుగుదల కనిపించిందని, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అసమానతలు తగ్గిపోయాయనీ అన్నారు. ''గడచిన పది సంవత్సరాలుగా మా ప్రభుత్వం తీసుకున్న ఆర్థిక, నిర్మాణాత్మక, వ్యవస్థీకృత సంస్కరణలవల్ల సాధించిన ఈ మెరుగుదలలు ఇంకా ముందుకు కొనసాగుతాయి, కరోనా మహమ్మారి వల్ల దేశానికి తగిలిన ఆర్థిక గాయాలు కనుమరుగైపోతాయి'' అన్నారు. రాబోయే దశాబ్దాలలో దేశంలో సామాన్య మానవుడి జీవన ప్రమాణాలు నిటారుగా పైకి దూసుకుపోవడాన్ని మనం చూస్తాం, ఒక భారతీయుడి జీవనాన్ని నిజమైన శకంగా నిర్వచించేవిధంగా ఈ కాలాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. దేశంలో తలసరి ఆదాయాలు 2,730 డాలర్లకు చేరుకోవడానికి 75 సంవత్సరాలు పడితే, తమ ప్రభుత్వం కృషి ఫలితంగా రాబోయే ఐదు సంవత్సరాల కాలంలోనే తలసరి ఆదాయాలు మరో 2,000 డాలర్లకు పెరుగుతాయని జోస్యం చెప్పారు. రాబోయే దశాబ్దాలలో సామాన్య మానవుడి జీవన ప్రమాణాలు నిటారుగా పైకి దూసుకుపోతాయన్నారు. ప్రపంచ జనాభాలో 18 శాతంగా ఉన్న భారతీయ జనాభా (140 కోట్లు) తలసరి ఆదాయాలను కూడా రెట్టింపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రాదేశిక భౌగోళిక రాజకీయ సవాళ్ళు తీవ్రంగా బెదిరిస్తున్నప్పటికీ కూడా వాటితో సంబంధం లేకుండా భారత ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకుని ముందుకు వెళుతుందన్నారు. 2047 నాటికి భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించుకుని 100 సంవత్సరాలు పూర్తి అవుతాయని, ఈ కొత్త శకంలో అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా దేశం రూపుదాలుస్తుందనిఇ నిర్మలా సీతారామన్ చెప్పారు. వికసిత్ భారత్ ద్వారా కేవలం భారతీయులకే కాకుండా యావత్ ప్రపంచానికి కూడా ఆలోచనల్లో, సాంకేతికతలో, సంస్కృతిలో బలమైన భావాలను ఇచ్చిపుచ్చుకోవడంలో మనదేశం ఒక కేంద్రకంగా రూపుదాలుస్తుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ గురించి ఆర్థికమంత్రి ప్రస్తావిస్తూ, ఆస్తుల నాణ్యత మెరుగుదల, రుణాల ఎగవేతలను అరికట్టడం, సంపూర్ణ మూలధన స్థిరత్వం వంటి వాటిపై దృష్టి పెట్టే స్థిరమైన విధానాలు అమలు చేయడంద్వారా బ్యాంకింగ్ రంగం బలం పుంజుకుని పరిపుష్టంగా తయారయ్యేట్టు చేస్తామన్నారు. బ్యాంకుల్లో నిరర్థక ఆస్తుల విలువ కూడా గడచిన సంవత్సరాలతో పోలిస్తే చాలా కనిష్టస్థాయికి చేరుకున్నాయని, రుణాలను తిరిగి రాబట్టడంలో యంత్రాంగం ఎంతో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తోందని ఆమె అన్నారు. దేశంలో 43 శాతం భారతీయులు 24 ఏళ్ళ వయసుకంటే చిన్న వయస్కులనీ, వారు తమ వినియోగ వ్యయాల మార్గాలను ఇంకా వెతుక్కునే పనిలోనే ఉన్నారనీ, అందువల్ల దేశీయ వినియోగం రాబోయే దశాబ్దంలో భారీగా పెరుగుతుందన్నారు. సేంద్రీయ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. విదేశీ పెట్టుబడుల కారణంగా దేశంలో మధ్యతరగతి వర్గం చేసే వినియోగాల పెరుగుదలకు మార్గం ఏర్పడుతుందనీ, మార్కెట్ ప్రదేశాలు ఆర్థికంగా కళకళలాడిపోతాయన్నారు.

## ప్రభుత్వాన్ని విమర్శించినంత మాత్రాన.. జర్నలిస్టులపై క్రిమినల్ కేసు పెట్టొద్దు

**న్యూఢిల్లీ :** ప్రభుత్వంపై విమర్శనాత్మక కథనాలు రాసినంత మాత్రన జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టడం సరికాదని భారత సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. అలా చేస్తే భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగించినట్లే అవుతుందని స్పష్టం చేసింది. తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఓ జర్నలిస్టు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా మధ్యంతర రక్షణ కల్పించింది. ప్రభుత్వ పాలనా విభాగంలో కుల సమీకరణాలకు సంబంధించి ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అభిషేక్ ఉపాధ్యాయ్ ఓ కథనం రాశారు. దీనిపై యూపీ పోలీసులతో పాటు వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. దీనిని కొట్టివేయాలని కోరుతూ అభిషేక్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ప్రజాస్వామ్య దేశాల్లో భావవ్యక్తీకరణ స్వేచ్ఛను గౌరవించాలి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం జర్నలిస్టుల హక్కులకు రక్షణ ఉంటుంది. కేవలం జర్నలిస్టులు రాసిన కథనాలను విమర్శలుగా భావించి, వారిపై క్రిమినల్ కేసులు పెట్టకూడదు' అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం.. తదుపరి విచారణ నవంబర్ 5కు వాయిదా వేసింది.

## యుపిలో ఘోర రోడ్డు ప్రమాదం

### 10మంది కూలీలు మృతి

**మీర్జాపూర్ (యుపి) :** కూలీలను తీసుకెళుతున్న ట్రాక్టర్ ట్రాలీని ఒక ట్రక్కు ఢీకొట్టిన రోడ్డు ప్రమాదంలో 10మంది మరణించారు. ముగ్గురు క్షతగాత్రులయ్యారు. ఈ ఘోర సంఘటన గురువారం అర్ధరాత్రి దాటాక శుక్రవారం ఒంటిగంట సమయంలో మీర్జాపూర్‌వారణాసి సరిహద్దులోని కచ్చావన్ మిర్జామురాద్ మధ్య గ్రాండ్ ట్రంక్ రోడ్డుపై చోటుచేసుకుంది. బదోహి జిల్లాలో నిర్మాణ పనుల నిమిత్తం వెళ్లిన 13మంది కూలీలు తిరిగి ట్రాక్టర్ ట్రాలీలో ఇంటిముఖం పట్టారు. అతివేగంగా ట్రక్‌ను నడుపుతున్న డ్రైవర్ తన చేతిలోని స్టీరింగ్‌ను నియంత్రించలేక పోవడంతో అదుపుతప్పి వెనకనుంచి ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టిందని మీర్జాపూర్ ఎస్‌పి అభినందన్ చెప్పారు. ఈ సంఘటనలో గాయపడ్డ 13మందిని ఐఐటిబిహెచ్‌యులోని హాస్పిటల్ కు తరలించగా 10మంది మరణించారు. క్షతగాత్రులు ముగ్గురి పరిస్థితి నిలకడగానే ఉందని ఎస్‌పి వివరించారు. ఈ రోడ్డు ప్రమాదంలో కూలీలు మృతిచెందడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున, గాయపడ్డవారికి ఒక్కొక్కరికీ రూ.50వేల చొప్పున పరిహారాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు.క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో తన విచారం వ్యక్తం చేశారు. కాగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా మృతుల కుటుంబాలకు ఇంతే మొత్తంలో పరిహారం ప్రకటించారు. ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ మీర్జాపూర్ జిల్లా యంత్రాంగానికి జారీచేసిన ఆదేశాలలో క్షతగాత్రులకు తగిన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతిచెందినవారు, క్షతగాత్రులు అందరూ వారణాసి జిల్లాకు చెందిన వారని పోలీసులు తెలియజేశారు.

## ఈ హడావుడి ఎన్నికేంటి? ఈ జోక్యమేంటి?

### ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను నిలదీసిన 'సుప్రీం'



**న్యూఢిల్లీ :** ఢిల్లీ నగరపాలక సంస్థ (ఎంసిడి)లో స్థాయీ సంఘం ఎన్నికలను ఎందుకు అంత ఆదరాబాదరాగా నిర్వహిస్తున్నారని ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ జనరల్ వి.కె.సక్సేనాను సుప్రీంకోర్టు నిలదీసింది. ఆరుగురు సభ్యులుగల ఢిల్లీ నగర పాలక సంస్థ స్థాయీ సంఘం ఎన్నికలను ఎందుకంత హడావుడిగా చేస్తున్నారు? ఎన్నికల ప్రక్రియలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారు? అని జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడా ధర్మాసనం శుక్రవారంనాడు ప్రశ్నించింది. దీనిపై రెండు వారాల్లో సమాధానం చెప్పాలని లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయాన్ని ఆదేశించింది. సెప్టెంబరు 27న జరిగిన ఎన్నికల తంతుపై ఎంసిడి మేయర్ షెల్లీ ఓబ్రాయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వివరణ కోరింది. మేయర్ లేకుండా డిఎంసి చట్టంలోని 487 సెక్షన్ కింద అధికారాలు ఉపయోగించి ఎన్నిక జరపడం తప్పు అని ధర్మాసనం స్పష్టం చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా తరపున సీనియర్ అడ్వకేట్ సంజయ్ జైన్ కోర్టు విచారణకు హాజరయ్యారు. ''దీన్ని మేం చాలా సీరియస్‌గా తీసుకుంటాం, మీరు గనుక ఎంసిడి స్థాయీ సంఘం ఛైర్మన్ పదవికి గనుక ఎన్నిక నిర్వహిస్తే తీవ్రంగా పరిగణించి పరిశీలిస్తాం'' అని ధర్మాసనం హెచ్చరించింది. ఫిరాయింపుల నేపథ్యంలో ఎంసిడి స్థాయీ సంఘం ఛైర్మన్ పదవికి ఎన్నికలు నిర్వహించేందుకు లెఫ్టినెంట్ గవర్నర్ హడావుడి పడుతున్నారు. సెప్టెంబరు 27న స్థాయీ సంఘం సభ్యుడి ఎన్నిక పోలింగ్‌కు ఢిల్లీ నగర పాలక సంస్థ చట్టంలోని సెక్షన్ 487 కింద ఉన్న అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్ ఉపయోగించడంపట్ల సుప్రీంకోర్టు నిశితంగా విమర్శించింది. ''సెక్షన్ 487 అనేది కార్యనిర్వాహక అధికారం. మీకు (లెఫ్టినెంట్ గవర్నర్) ఆ అధికారం ఎక్కడినుండి వచ్చింది? శాసనసభా పనితీరులో జోక్యం చేసుకోవడానికి ఆ అధికారాన్ని నిర్దేశించలేదు, ఇది ఒక సభ్యుడిని ఎన్నుకునే ప్రక్రియ. ఈ విధంగా మీరు ఈ విధంగా జోక్యం చేసుకుంటూ ఉన్నట్లయితే ఇక ప్రజాస్వామ్యంలో ఏం జరుగుతున్నట్టు? దీనివల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నగరపాలక సంస్థ పనితీరులో జోక్యం చేసుకునేందుకు ఎంసిడి చట్టంలోని 487వ నిబంధన అనుమతిస్తున్నది. ఐతే ఈ విషయంలో సుప్రీం వ్యాఖ్యల అనంతరం తమకు రెండు వారాల్లో దీనిపై సమాధానం చెప్పాలని కూడా ధర్మాసనం ఆదేశించింది. మొదట మేం ఈ కేసు విచారణకు సంబంధించిన పిటిషన్‌ను తీసుకోవడానికి ఇష్టపడలేదు, ఎందుకంటే ప్రతిఒక్కరూ సుప్రీంకోర్టుకు వచ్చేస్తున్నారు, కానీ ఇక్కడ సమస్య ఏమిటంటే ఎంసిడి చట్టంలోని 487 సెక్షన్ కింద ఉన్న అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్ ఉపయోగించిన దృష్ట్యా ప్రత్యేకించి దాన్ని ఆధారం చేసుకునే ఈ పిటిషన్‌ను స్వీకరించి నోటీసు జారీ చేశాం'' అని ధర్మాసనం వివరణ ఇచ్చింది. అదేవిధంగా మేయర్ తీసుకోవాల్సిన నిర్ణయాలకు సంబంధించిన ఇతర సమస్యలు కూడా చాలా ఉన్నాయనీ, వాటిని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందనీ ధర్మాసనం పేర్కొంది. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం తరపున హాజరైన న్యాయవాది సంజయ్ జైన్ మాట్లాడుతూ, ఇప్పటికే ఎన్నిక జరిగిందనీ, వారు దీనిని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసే అధికారం తప్ప ఇంకేమీ లేదని ఇదే విషయాన్ని తాను ప్రాథమికంగా కోర్టుకు అభ్యంతరం తెలియజేశాననీ అన్నారు. ఐతే తాము దీనిలోని అంతరార్థాన్ని పరిశీలించామనీ, ఇందులో రాజకీయాలేమీ లేవని ధర్మాసనం స్పష్టం చేసింది. ఢిల్లీ మేయర్ ఓబ్రాయ్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలకు హాజరయ్యారు.

## హర్యానా పోలింగ్‌కు సర్వం సిద్ధం

**చండీగఢ్ :** హర్యానా శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఓటింగ్ జరగనుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉండగా 1031 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో 101 మంది మహిళలు ఉన్నారు. హర్యానా సిఎం సైనీలాడ్వా నుంచి పోటీచేస్తుండగా ప్రతిపక్ష నేత భూపిందర్‌సింగ్ హుడాగర్హి సంప్లాకిలోయి స్థానం నుంచి బరిలో ఉన్నారు. ఎల్లెనాబాద్ నుంచి ఐఎన్ఎల్‌డి అధినేత అభయ్‌సింగ్ చౌతాలా, ఉచనా కలాన్‌లో జెజెపి చీఫ్ దుష్యంత్ చౌతాలా, జులానాలో మాజీ రెజ్లర్, కాంగ్రెస్ అభ్యర్థి వినేశ్ ఫొగట్ పోటీ చేస్తున్నారు. రెండు కోట్లకు పైగా ఓటర్లు ఉండగా, వారి కోసం 20629 పోలింగ్ కేంద్రాలను ఇసి ఏర్పాటు చేసింది. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా బలగాలను మోహరించారు. ఒకేవిడతలో పోలింగ్ జరగనుండగా ఈనెల 8న ఓట్ల లెక్కింపు జరగనుంది. 2019 శాసనసభ ఎన్నికల్లో బిజెపి 40 స్థానాలు, కాంగ్రెస్ 31 సీట్లు గెలుపొందాయి. అయితే జెజెపి మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బిజెపికి దాదాపు స్వతంత్రులందరూ మద్దతు తెలిపారు.

## స్నేహితుడిని కొట్టి.. యువతిపై సామూహిక అత్యాచారం

పుణె: యువతిపై ముగ్గురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన మహారాష్ట్రలోని పుణెలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుణెకు చెందిన యువతి గురువారం అర్ధ రాత్రి తన స్నేహితుడితో బోప్‌దేవ్ ఘర్ ప్రాంతానికి వెళ్లింది. వీరిని గమనించిన ముగ్గురు దుండగులు యువకుడిపై దాడిచేసి.. ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం వారు అక్కడినుంచి పరారయ్యారు. దీంతో ఆ జంట పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘాతుకానికి పాల్పడిన వారి ఆచూకీ కోసం 10 పోలీసు బృందాలను ఏర్పాటుచేశామని, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు శుక్రవారం ఉదయం పేర్కొన్నారు. అది నిర్మానుష్య ప్రాంతం కావడంతో నిందితుల ఆచూకీ తెలుసుకోవడం కష్టతరంగా మారిందన్నారు. కాగా మరో ఘటనలో పుణెలోని ఇద్దరు ఆరేళ్ల బాలికలపై వ్యాన్ డ్రైవర్ సంజయ్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇద్దరు చిన్నారులు పాఠశాలకు వెళ్లి తిరిగొస్తుండగా నిందితుడు తమతో అసభ్యంగా ప్రవర్తించినట్లుగా కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## పరిస్థితులు కొనసాగుతున్నా భారత్ 7 శాతం వృద్ధిని నమోదు



**న్యూఢిల్లీ :** ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నా భారత్ 7 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్‌లో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని పెట్టుబడిదారులు భావిస్తున్నారని చెప్పారు. ఈ అనిశ్చితి వేళ పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా మారిందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథాన్ని కొనసాగించే దిశగా పరివర్తన మార్పులు కొనసాగుతున్నాయని చెప్పారు. కౌటిల్య ఆర్థిక సదస్సులో ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వ్యవస్థీకృత సంస్కరణలు అవసరం అని అభిప్రాయపడ్డారు. మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ఉద్యోగాలు, నైపుణ్యం, సుస్థిరాభివృద్ధి, వేగవంతమైన విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. భౌగోళిక అత్యవసర పరిస్థితులు నెలకొన్న వేళ ప్రపంచమంతా భారత్ గురించి మాట్లాడుతుందంటే.. ఆయా దేశాలకు మన దేశం పట్ల ఉన్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. గడిచిన పదేళ్లలో చేపట్టిన సంస్కరణలే అందుకు కారణమన్నారు. ప్రపంచంలోనే భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉందని, ప్రస్తుతం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నామన్నారు. అత్యధికంగా ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు తయారయ్యే దేశం మనదేనని ప్రధాని మోదీ అన్నారు. మొబైల్ ఫోన్ల తయారీలో రెండో స్థానంలో ఉన్నామన్నారు. సంస్కరించు, పనితీరు మెరుగుపరుచు, రూపాంతరం చెందు అనేది తమ ప్రభుత్వం నిత్యం పటించే మంత్రమని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసమే మన బలమని పేర్కొన్నారు. భారత అభివృద్ధి కోసం మరిన్ని నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావడానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. గడిచిన పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం; జీఎస్టీని తీసుకురావడం; దివాలా స్మృతి; గనులు, రక్షణ రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహం; ఎఫ్‌డీఐ నిబంధనలు సరళీకరించడం వంటివి తమ ప్రభుత్వ విజయాలుగా ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## భారతీయ మత్స్యకారులను విడుదల చేసిన శ్రీలంక ప్రభుత్వం

### విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయశంకర్ కొలంబో సందర్శన నేపథ్యంలో తాజా పరిణామం

**కొలంబో :** శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేసిన 50 మంది భారతీయ మత్స్యకారులను శుక్రవారం శ్రీలంక ప్రభుత్వం విడుదల చేసింది. ఆ దేశ ద్వీప జలాలలో వేటాడారన్నఅభియోగంపై శ్రీలంక నావికాదళం మత్స్యకారులను అరెస్ట్ చేసిందని ఇక్కడి భారతీయ మిషన్ వెల్లడించింది. నిషేధాజ్ఞలు అమలులో ఉన్న ఆయా దేశాల జలాలలోకి ఇరుదేశాల మత్స్యకారులు పొరపాటున లోపలికి ప్రవేశించిన సమయంలో తరచుగా అరెస్టులు జరుగుతూనే ఉంటాయి. మయిలాదుతురాయి, పుదుకొట్టాయి, నాగపట్టినం నుంచి 50మంది భారతీయ మత్స్యకారులు శుక్రవారం నాడు విడుదలై ఇంటికి తిరుగుముఖం పట్టారు. 'విడుదలైన భారతీయ మత్స్యకారులు అందరినీ ఈ వారంలో శ్రీలంక నుండి తమిళనాడు మీదుగా స్వదేశం భారత్‌లోకి పంపిస్తారు' అని కొలంబోలోని భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈ విషయాన్ని పోస్ట్ చేసింది. విడుదలైన మత్స్యకారుల ఫోటోలతో పాటు ఈ సమాచారాన్ని పోస్ట్ చేశారు .భారతదేశ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కొలంబోను సందర్శన నేపథ్యంలో మున్ముందు భారతశ్రీలంక సంబంధాలు మరింత బలోపేతం చేసుకునేందుకు ఇరుదేశాలు అంగీకరించిన క్రమంలో భారతీయ మత్స్యకారుల విడుదలకు మార్గం సుగమమైంది. భారత్, శ్రీలంక మధ్య సంబంధాలలో మత్స్యకారుల సమస్య ఎంతో వివాదాస్పదమైనది. శ్రీలంక నావికాదళ సిబ్బంది పాక్ జలసంధిలో భారతీయ మత్స్యకారులపై కాల్పులు జరిపారు. శ్రీలంక ప్రాదేశిక జలాలలోకి భారతీయ మత్స్యకారులు అక్రమంగా ప్రవేశించారని ఆరోపణలు చోటుచేసుకున్న సంఘటనలలో వారి పడవలను శ్రీలంక నావికాదళ సిబ్బంది స్వాధీనం చేసుకున్నది. . గతనెల శ్రీలంక నిషేధిత ప్రాంత జలాలలోకి ప్రవేశించిన ఏడుగురు భారతీయ మత్స్యకారులను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. వారిని భారతదేశానికి తిప్పి పంపించింది. అదే సమయంలో ఆగస్టులో శ్రీలంకకు చెందిన 30మంది మత్స్యకారులు భారతదేశ జలాలలోకి ప్రవేశించగా భారత్ కూడా వారిని అదే తరహాలో శ్రీలంకకు పంపించేస్తోంది.

## రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయండి

### కేంద్రానికి శరద్ పవార్ సూచన



**సంగ్లి :** విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచేందుకు రాజ్యాంగ సవరణ తీసుకురావాలని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ బిజెపి నేతృత్వంలోని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పవార్ సంగ్లిలో విలేకరులతో మాట్లాడారు. కోటా కోసం ఉద్యమిస్తున్న మరాఠాలకు రిజర్వేషన్లు మంజూరు చేసేటప్పుడు, ఇతర వర్గాలకు ఉద్దేశించిన పరిమితులకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఉంది. తమిళనాడులో 78 శాతం (వివిధ వర్గాలకు కోటా) ఉంటే, మహారాష్ట్రలో 75 శాతం రిజర్వేషన్లు ఎందుకు కల్పించలేరని ప్రశ్నించారు. కోటా పరిమితిని పెంచేందుకు కేంద్రం నాయకత్వం వహించి రాజ్యాంగ సవరణ తీసుకురావాలని, దానికి తాము మద్దతు ఇస్తామన్నారు. ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) నేతల మధ్య సీట్ల పంపకంపై వచ్చే వారం చర్చలు కొనసాగుతాయని పవార్ చెప్పారు. మార్పు కోసం చూస్తున్న ప్రజల్లోకి వెళ్లేందుకు వీలుగా చర్చలను వీలైనంత త్వరగా ముగించాలని మాత్రమే నేతలకు సలహా ఇస్తానన్నారు. ఎన్‌సిపి (ఎస్‌పి), ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి), కాంగ్రెస్‌తో కూడిన ఎంవిఎ ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ఐక్యంగా పోరాడి రాష్ట్రంలోని 48 స్థానాలకు గాను 30 స్థానాలను గెలుచుకుని అద్భుతమైన పనితీరును కనబరిచాయి. నవంబర్‌లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రభుత్వంలో మార్పు తీసుకురావడానికి ప్రజలు సానుకూలంగా ఉన్నారని, ఎంవిఎ వారి మనోభావాలను గౌరవించాలని పవార్ అన్నారు. మరాఠీకి 'క్లాసికల్ లాంగ్వేజ్ ట్యాగ్'ని ఇవ్వాలనే నిర్ణయాన్ని పవార్ స్వాగతించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని అభినందించారు. అయితే, మరాఠీ నేర్చుకోవడానికి ఇష్టపడే విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం, రాష్ట్రంలో మరాఠీ భాషా పాఠశాలలు మూసివేయడంపై మహారాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేయాలన్నారు. ఈ అంశాలపై చర్చలు అవసరమని, సమస్యను పరిష్కరించడానికి ఒక మార్గాన్ని కనుగొనాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాకర్షక పథకాలతో వరాల జల్లు కురిపిస్తూనే ఇతర కార్యక్రమాలకు రావాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. సాంగ్లీ క్యాన్సర్ ఆసుపత్రికి చెల్లించాల్సిన బకాయిలు 4 కోట్ల రూపాయలకు పైగా ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా కేన్సర్ ఆసుపత్రులకు రూ.700 కోట్ల బకాయిలు ఉన్నాయి. విపక్షాలు చాలాసార్లు తనకు ప్రధానమంత్రి కుర్చీని ఆఫర్ చేశాయని నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలను పవార్ కొట్టిపడేశారు. తాము అలాంటి ఆఫర్లేమీ చేయలేదని.. పార్టీలో అవసరమైనంతమంది ఎమ్మెల్యేలే లేనప్పుడు అలాంటి ఆఫర్ ఎలా చేస్తామని ప్రశ్నించారు. అయితే కాంగ్రెస్ ఇప్పటికే సార్వత్రిక సమరం కోసం భారీ హామీలతో మ్యానిఫెస్టో విడుదల చేసింది. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లపై ప్రస్తుతం అమల్లో ఉన్న 50 శాతం పరిమితిని పెంచేలా రాజ్యాంగ సవరణ చేపడతామని హామీ ఇచ్చింది. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) అందించే 10% కోటాను అన్ని కులాలు, వర్గాల వారికి ఎలాంటి వివక్ష లేకుండా అమలుచేస్తామని తెలిపింది.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శనివారం, అక్టోబరు 05

# జైలుకు కాదు, కాటికి పోయినా వెన్నంటివచ్చే కులవ్యవస్థ

దేశమంతటా జైళ్లలో ఏ విధమైన కుల వివక్ష ఉండరాదని, అటువంటి వీలు కల్పిస్తూ జైలు మాన్యువల్‌లో ప్రస్తుతం ఉన్న నిబంధనలన్నిటినీ తొలగించాలని ఆదేశించిన సుప్రీంకోర్టు ధర్మాసనానికి జేజేలు చెబుదాం. ఖైదీ కులాన్ని బట్టి జైల్లో పనులు అప్పగించే వివక్షను సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చిన సుకన్య శాంత (మహారాష్ట్ర) కూడా అభినందనలకు పాత్రురాలు. ఈ పిటిషన్‌ను సుమోటోగా విచారణకు తీసుకున్న ధర్మాసనం సభ్యులు ఛీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్‌లు జెబి పార్దీవాలా, మనోజ్ మిశ్రా. 77 సంవత్సరాల స్వాతంత్ర్యం తదుపరి కూడా సామాజిక జీవనంలోనే కాదు, జైళ్లలో కూడా కుల వివక్ష ఉందని వినటానికే సిగ్గుగా ఉంది. 2047 నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకెళతామని జబ్బలుచరిచి పదేపదే చెబుతున్న మన పాలకమన్యులకు, ఏడున్నర దశాబ్దాలకు పైన దేశాన్ని ఏలిన రాజకీయ పార్టీలకు, కించిత్తైనా మానవత్వముంటే ఈ దేశంలో కులవివక్ష ఇనుపసంకెళ్లు ఏనాడో ఛేదించబడేవి. నిచ్చెన దొంతర్ల చాతుర్వర్ణ వ్యవస్థను తలకెక్కించింది ఈనాడు పునరుజ్జీవం పొందుతున్న సనాతన ధర్మం, దాన్ని సామాజిక ధర్మంగా అమలు చేసింది మనువు రచించిన హైందవ ధర్మశాస్త్రం. వాటిని ఇప్పటికీ నెత్తికెక్కించుకుని, దేశ ప్రజల నెత్తిన బలవంతంగా రుద్దాలని చూస్తున్నవారు ఈనాడు మన పాలకులు కావటం ఈ దేశ తిరోగమనానికి నిదర్శనం. రోదసీ రహస్యాలను ఛేదించేందుకు నిర్విరామ కృషి చేస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు సైతం తమ రాకెట్ నమూనాలను వారు నమ్మే హిందూ దేవుడి పాదాల వద్ద ఉంచి పూజలు చేస్తున్నారంటే అది వారి తప్పుకాదు. ఈ దేశంలో నరనరాన జీర్ణించుకుపోయిన దైవభీతి ఫలితం.

బ్రిటీష్ పాలనకాలంలో, స్వాతంత్ర్య పోరాట కాలంలో, స్వాతంత్ర్య సముపార్జన తదుపరి కొద్ది దశాబ్దాల పాటు సంఘ సంస్కరణకై చాందసభావాల నిర్మూలనకై సంస్కరణోద్యమాలు పెద్ద ఎత్తున జరిగాయి. ముఖ్యంగా కమ్యూనిస్టులు అంటరానితనం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఎంతో కృషి చేశారు. ఆంధ్రప్రాంతంలో వారు తొలుత ప్రారంభించిన సంఘాలు పాకీ పనివారల సంఘాలు. ఆ వృత్తి చేసేవారంతా ఎస్‌సిలు, రెల్లి కులస్థులని వేరుగా చెప్పనవసరం లేదు. తెలంగాణ ప్రాంతంలో తొలుత వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సంఘాలు నిర్మించారు. ఎస్‌సి, ఎస్‌టిలు సహా గ్రామీణ బడుగు బలహీన వర్గాల వారందరూ సంఘాల్లో చేరి చైతన్యవంతులై చివరకు నైజాం జమీందారీ జాగీర్దారీ ఫ్యూడల్ దొరల అణచివేతకు వ్యతిరేకంగా ఉగ్రనరసింహులై ఉద్యమించారు. కారణాలేమైతేనేం, కాలక్రమంలో కమ్యూనిస్టు ఉద్యమం ముక్కచెక్కలై పలచబడింది. భూస్వామ్య, కులోన్మాద, మతోన్మాద శక్తులు రాజకీయ ప్రయోజనాలకోసం ఎస్‌సిలు, ఎస్‌టి(దళితుల), బిసిల ఉద్ధారకులుగా తీయని కబుర్లతో, కన్నీరుతుడిచే ఆకర్షణీయ పథకాలతో వారిని బుజ్జగించారు. ఈ తరగతుల్లో వృద్ధిలోకి వచ్చిన నాయకులను పదవులు, ఇతర ప్రలోభాలతో వశపరుచుకున్నారు. దాంతో కుల వివక్ష వ్యతిరేక పోరాటాలు సన్నగిల్లాయి. అగ్రవర్ణ అణచివేత, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎక్కడైనా తిరుగుబాటు జరిగినా వారికి చేదోడువాదోడు పత్రికా ప్రకటనలకు పరిమితమైంది. కొందరు నిజాయితీపరులున్నా వారు తమ పోరాటాలను ఆర్థిక ప్రయోజనాలసాధనకు పరిమితం చేశారు. దాంతో కులవివక్ష ప్రతిఘటనలేని సాధారణ వ్యవహారంగా కొనసాగుతోంది.

మన పట్టణాలు, నగరాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజి మురుగు, సెప్టిక్ ట్యాంక్‌లు శుభ్రంచేసే పనులు చేసే వారిలో 68.9 శాతం ఎస్‌సిలు, 8.3శాతం ఎస్‌టిలు, 14.7 బిసి కులాలవారు, 8శాతం జనరల్ కేటగిరీ కులాలకు చెందినవారని ఇటీవల ప్రభుత్వ నివేదిక ఒకటి వెల్లడించింది. 29 రాష్ట్రాలు, యుటిల్లో 3000 పట్టణ స్థానిక సంస్థలనుండి 38వేలమంది కార్మికుల సమాచారాన్ని ప్రభుత్వం తొలిసారి సేకరించింది. ఈ ప్రయత్నం చేయటమేకాదు, ఆ సమాచా రం బహిర్గతం చేసినందుకు ప్రభుత్వాన్ని అభినందించాలి. 2019–2023 మధ్యకాలంలో మురుగు శుద్ధి వంటి ప్రమాదకరమైన పనుల్లో పాల్గొన్నవారిలో కనీసం 377మంది చనిపోయా రు. పారిశుద్ధ్య కార్మికుల్లో అత్యధిక మెజారిటీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలవారే. వారు ఓ వారం రోజులు సమ్మె చేస్తే పట్టణ జనావాసాలు కంపుఎత్తుతాయి. సకాలంలో మురుగు, చెత్తాచెదారం శుభ్రం చేసి, ప్రజల ఆరోగ్యానికి తొలి సంరక్షకులుగా ఉన్న ఆ అట్టడుగు శ్రమజీవులకు స్థానిక సంస్థలు చెల్లించే జీతాలు అట్టడుగునే ఉంటాయి. ఇటీవల కాలంలో కాంట్రాక్టు, పొరుగుసేవల విధానం మరీ వారి కడుపుకొడుతోంది.

కాబట్టి కులవ్యవస్థ భారతీయ సమాజంపై రాచపుండు లాంటిది. నరనరాన జీర్ణించుకుని ఉన్న ఈ దొంతర్ల వ్యవస్థను సంస్కరించటం సాధ్యపడే విషయం కాదు. నిలకడైన దీర్ఘకాల పోరాటం సమాంతరంగా జరగాలి. రాజకీయ వ్యవస్థను నిలదీసి సామాజిక న్యాయం సాధించాలి. రెండోవైపున సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో రకరకాల స్వాములోర్లు ప్రజల తలల్లోకి ఎక్కిస్తున్న విషానికి విరుగుడుగా సంస్కరణోద్యమం ఉవ్వెత్తున రావాలి. అణచివేత, వివక్ష భరించలేనివిగా తయారైనప్పుడు ఏదోక ఉద్యమం దానికదిగా బద్దలవుతుంది. నాయకులకోసం ఎదురుచూడదు. అది సమాజ పరిణామ లక్షణం.

# అభివృద్ధికి మార్గదర్శకులు ఉపాధ్యాయులు

ప్రపంచంలో గురువులేని వ్యక్తి ఉండరు. నిరక్షరాస్యుడి జీవితంలో కూడా తను నమ్మిన గురువు చూపిన మార్గంలో అడుగులు వేస్తారు. నేటి బాలలను రేపటి బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దే నిస్వార్థ జీవులే గురువులు. అన్ని వృత్తులలోకెల్లా ఉపాధ్యాయవృత్తి అత్యంత గౌరవం కలిగినది. యువత సన్మార్గంలో నడవడానికి పునాదులు వేసే బాధ్యత తల్లితండ్రుల తరువాత ఉపాధ్యాయుడి మీదనే అధికంగా ఉంటుంది. 1994 నుండి ప్రతియేటా 05 అక్టోబర్ రోజున ప్రపంచ/అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పాటించడం జరుగుతుంది. శిశు తరగతి నుండి ఉన్నత విద్య వరకు అధ్యాపకుడి భూమిక ప్రతి దశలో ఉంటుంది. ఉపాధ్యాయుల బోధనాపద్ధతిలో వచ్చిన ఆధునిక అనివార్య మార్పులను సవాలుగా తీసుకొని చక్కని బోధనలు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. కొన్ని సందర్భాలలో తల్లితండ్రులు చెప్పే విషయాలను కూడా నమ్మని పిల్లలు గురువుల బోధనలను తూచాతప్పక గుడ్డిగా నమ్ముతారనేది వాస్తవం.

యువతలో విద్యాప్రమాణాలు పెరగాలన్నా, నాణ్యమైన బోధనలు జరగాలన్నా ఉపాధ్యాయులకు ఉన్నత స్థాయి శిక్షణలు తప్పనిసరి యని దేశాలన్నీ గుర్తించాయి. స్థానిక విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడంతో మాత్రమే మన రేపటి యువత అంతర్జాతీయ వేదికల్లో రాణించగలుగుతారు. వైజ్ఞానిక విప్లవ విస్ఫోటనానికి అనుగుణంగా ఉపాధ్యాయులు నవీన కొత్త పోకడలను అవగాహన చేసుకొని, తరగతి గదిని ఆటపాటల వేదికగా, ఆసక్తికర బోధనా పద్ధతులను ఆశ్రయించాల్సి ఉన్నది. ఆన్లైన్/ఆఫ్లైన్ బోధనలకు అలవాటు పడుతూ, విద్యార్థులను ఆకర్షించాల్సిన బాధ్యత గురువుల మీదనే ఉంది. ఉపాధ్యాయులు నిర్వహించే బాధ్యతలలో ఒకటి పాఠ్యాంశాల బోధన మాత్రమే కాదు. దీనికి తోడుగా గురువు మంచి స్నేహితుడిగా, మూడో తల్లి/తండ్రిగా, మోధావిగా, మార్గదర్శిగా, ప్రేరకుడుగా, తప్పదుగులను సవరించే హితుడిగా, సరైన జీవనశైలిని నేర్పే అన్నగా, ఆటపాటల్లో తమ్ముడిగా, పరిపాలనాదక్షుడిగా, సన్మార్గాన్ని చూపే ఆదర్శమూర్తిగా, జీవన తత్వాన్ని రుచిచూపే తత్వవేత్తగా అనేక పాత్రలను ఏకకాలంలో నిర్వర్తించాలి. సుఖ జీవనానికి తగు జీతాన్ని, జీవించే కళను నేర్పడమే ఉపాధ్యాయుల బాధ్యత అని అర్థం చేసుకోవాలి. సమాజానికి అన్ని వృత్తుల వారిని తయారు చేసే మేధో వితరణ మనోబల యంత్రమే ఉపాధ్యాయుడని మనకు తెలుసు.

**ఉపాధ్యాయుల ఉన్నత లక్షణాలు:** తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించే వారు సాధారణ ఉపాధ్యాయులుగా, స్పష్టతతో వివరించే వారు మంచి ఉపాధ్యాయులుగా, నేర్చుకుంటూ ఎదగాలనే ప్రేరణ కలిగించే వారు ఉత్తమ ఉపాధ్యాయులుగా సమాజంలో పేరు తెచ్చుకుంటారు. విద్యార్థుల్లో నిగూఢంగా దాగివున్న అభిరుచులు, ఆసక్తులను సున్నితంగా విశ్లేషించి, వారి ఎదుగుదలకు నిచ్చెనలా నిలబడగలిగిన వ్యక్తి గురువు ఒక్కరే. ఉపాధ్యాయుడిలో క్రమశిక్షణ, జ్ఞాన సంపన్నత, మార్గనిర్దేశనం, నిర్వాహక యుక్తి, అంకితభావం, కరు ణ, బోధనాభిరుచి, అవగాహనా సామర్థ్యం, ఓపిక, ఆదర్శంగా నిలవడం, నియంత్రణాశక్తి, శ్రమించే తత్వం, సంభాషణా చాతుర్యం, జ్ఞాన వితరణలో ఆసక్తి లాంటి ఉన్నత లక్షణాలు ఉండడం తప్పనిసరి అని గురువు నమ్ముతాడు. ఉపాధ్యాయులు వృత్తిలో అలసత్వం వహిస్తే, రాబోయే తరాల పునాదులు కదిలి, బలహీనపడి, సమాజం అల్లకల్లోలం అవుతుందని మరువరాదు. నేటి ఆధునిక వేగవంతమైన డిజిటల్ ప్రపంచంలో ఉపాధ్యాయులు తమ విధులను విస్మరించక, విలువల బీజాలను నాటి, మేధో మహా వృక్షాలుగా ఎదిగేలా సాధన చేసి, విశ్వశాంతికి, నవ్య ప్రగతికి బాటలు వేయాలని ఆశిద్దాం.

## గమనిక

అక్టోబర్ 4వ తేదీ శుక్రవారం 'ప్రజాపక్షం' 6వ పేజీలో "మావోయిస్టులు ఈ దేశ పౌరులు కాదా?" అనే శీర్షికతో ప్రచురించిన వ్యాసంలో కొన్ని అచ్చుతప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్ది ఆ వాక్యాలను ఇక్కడ ప్రచురిస్తున్నాం గమనించ గలరు.

1. శ్రీశ్రీ 'నవ కవిత'లోని పాదం :
సింధూరం, రక్తచందనం,
బంధూకం, సంధ్యారాగం,
పులిచంపిన లేడినెత్తురూ,
ఎగరేసిన ఎర్రనిజెండా
రుద్రాలిక నయనజ్వాలిక,
కలకత్తా కాళిక నాలిక
కావాలోయ్ నవకవనానికి.

2. మూడవ కాలంలో తొలిపేరాలో – హిట్లర్, ముసోలియన్ కాదు, హిట్లర్ ముసోలినీ అని గ్రహించాలి.

తప్పులు దొర్లినందుకు విచారం వ్యక్తం చేస్తున్నాం
– సంపాదకుడు.

# మోదీ 'మేక్ ఇన్ ఇండియా' పై అల్ప సంతోషం

సుబ్రతా మజుందర్

పదేళ్ళక్రితం నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రారంభించిన "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం విజయవంతమైందని వాణిజ్యం, పరిశ్రమల శాఖామంత్రి పీయుష్ గోయల్ ప్రకటించారు. కానీ పొరుగున ఉన్న పెద్ద దేశం అనుసరించిన చైనా ప్లస్–1 వ్యూహం (అంతరాయాలు లేని సత్వర అనుసంధాన సరఫరా వ్యవస్థ) కంటే మించిన స్థాయిలో పోటీపడేవిధంగా 'మేక్ ఇన్ ఇండియా' విజయం సాధించిందని అన్నారు. "భారతదేశం పోటీపడే దేశమేగానీ, చైనా ప్లస్–1 వ్యూహంపై ఆధారపడే దేశం కాదు, దేశంలో వ్యాపార వాణిజ్య కార్యకలాపాల అధికార ప్రక్రియ చాలా సులభంగా, సంక్షిప్త పద్ధతులలో పూర్తి చేయడం ద్వారా ప్రపంచబ్యాంకు నిర్దేశించిన ఉత్తమశ్రేణి ర్యాంకింగ్‌ను భారత్ మెరుగుపరచుకోవడంపైనే దృష్టి సారించింది" అని చెప్పుకున్నారు. కానీ అకస్మాత్తుగా వాణిజ్యమంత్రి చేసిన ప్రకటన మితిమీరిన ఉద్ఘాటనగా మారిపోయింది. 'చైనా ప్లస్–1 వ్యూహం' అమలు చేయడంతో విదేశీ పెట్టుబడిదారులకు ఆగ్నేయ ఆసియా మరింత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా రూపుదిద్దుకుంది. ఆగ్నేయ ఆసియాలో ఉన్న దేశాల (ఏసియన్ –10)లో విదేశీ పెట్టుబడులు భారీగా పెరిగాయి. చైనా నుండి భారీ పెట్టుబడుల వాటా తరలివెళ్ళడమే దీనికి కారణం. దీనికి విరుద్ధంగా భారతదేశంలో మాత్రం విదేశీ పెట్టుబడులు గణనీయంగా క్షీణించాయి. 'మేక్ ఇన్ ఇండియా' తన సత్తాను కోల్పోయింది. దీనివల్ల ఉత్పత్తి వృద్ధి పాతాళం స్థాయికి దిగజారింది.

'ఏసియన్' (ఆర్థిక సహకారానికి ఉద్దేశించిన పది దేశాల ప్రాంతీయ గ్రూపు) దేశాల ఎగుమతులు రెండంకెల స్థాయిలో వృద్ధి చెందాయి. అదేసమయంలో భారతదేశ ఎగుమతులు ప్రత్యేకంగా నొక్కిచెప్పేస్థాయిలో అనిశ్చిత–అపసవ్య ధోరణిలో సాగాయి. నిరుద్యోగంలో భారత్ అగ్రస్థానంలో ఉంది. అదేసమయంలో 'ఏసియన్' దేశాల్లో మాత్రం నిరుద్యోగం కనిష్టస్థాయికి చేరింది. 'చైనా ప్లస్–1' అనేది ఎగుమతులకు ఉద్దేశించినది. ఎలాంటి ఆటంకాలు లేకుండా సత్వరం సరఫరాలు కొనసాగించే అనుసంధా న వ్యవస్థ. విదేశీ పెట్టుబడిదారులతో తన వ్యాపార వాణిజ్యాలను కొనసాగించేందుకు ఉద్దేశించిన వ్యూహం. 2014–2015 మధ్యకాలంలో ఈ చైనా ప్లస్–1 వ్యూహం ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించిం ది. దేశాల మద్దతు కూడగట్టుకుంది. చైనా నుండి బహుముఖీనంగా సరఫరా రాకపోకలకు ఒక ఊపును తెచ్చిపెట్టింది. ఐతే చైనాలో పెరుగుతున్న కార్మిక వ్యయాల కారణంగా చైనా నుండి సరుకు సరఫరాలను కుదించుకుని ఇతర ఆసియా దేశాలలో ఇతర వనరులపై ఆధారపడే ప్రత్యామ్నాయం పెరిగింది. సరుకుల సరఫరాకోసం కేవలం ఒకేఒక్క దేశంపై మాత్రమే ఆధారపడితే సమస్యలు ఎదురవుతాయి. ఈ అపాయం నుండి తప్పించుకోవలనేదే 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఇప్పటికి పది సంవత్సరాలు పూర్తయింది. కరోనా మహమ్మారి ప్రభావం కారణంగా వచ్చిన భౌగోళిక సమస్యల నుండి ఊపిరి పీల్చుకుని చైనా ప్లస్–1 వ్యూహం ఇప్పుడు సమస్యల నుండి బయటపడి పునరుజ్జీవనం పొందుతున్నది. చైనా ప్లస్–1 వ్యూహం ప్రకారం విదేశీ పెట్టుబడిదారులు చైనాతో తమ వ్యాపార వాణిజ్యాలను కొనసాగించేందుకు అనుమతించడంతో పాటు అదేసమయంలో అనేక దేశాలకు దానిని విస్తరిస్తారు. కానీ ఇక్కడ అయ్యో! అని బాధపడేంత దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, దీనివల్ల 'మేక్ ఇన్ ఇండియా ' విజయగాథ విచ్ఛిన్నమైపోయింది. 'మేక్ ఇన్ ఇండియా' తన లక్ష్యాన్ని, సత్తాను కోల్పోయింది. భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో తయారీరంగం వాటాను ఎనిమిదేళ్ళకాలంలో 22 శాతానికి పెంచాలి. 2014లో జిడిపిలో తయారీరంగం వాటా 17–18 శాతం గా ఉండేది. దీనిని 2022 నాటికి 22 శాతానికి పెంచాలనేది 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యం. కానీ అంతా దీనికి విరుద్ధంగా జరిగింది. దశాబ్దకాలంలో ఈ వాటా గణనీయంగా క్షీణించిపోయింది. 2015 – 16 ఆర్థిక సంవత్సరంలో 18.2 శాతంగా ఉన్న ఈ వాటా 2023– 24 ఆర్థిక సంవత్సరంలో 17.3 శాతానికి తగ్గిపోయింది. మేక్ ఇన్ ఇండియా పదేళ్ళకాలంలో ఎగుమతులు క్షీణించాయి. జిడిపిలో 2014–15 ఆర్థిక సంవత్సరంలో 15.2 శాతంగా ఉన్న ఎగుమతుల వాటా 2023–24 ఆర్థిక సంవత్సరం నాటికి 12.2 శాతానికి తగ్గిపోయింది.

### దక్షిణ–ఆగ్నేయాసియా దేశాల నిరుద్యోగంలో భారత్ టాప్

భారత్‌లో విదేశీ పెట్టుబడులు కూడా బాగా తగ్గిపోయాయి. విచిత్రం ఏమిటంటే, ప్రపంచంలో అత్యధికంగా ఆర్థిక వృద్ధి సాధించిన కొన్ని దేశాలలో భారత్ చోటు సంపాదించుకున్నప్పటికీ కూడా విదేశీ పెట్టుబడులు క్షీణించిపోయాయి. 2021 నుండి 2023 ఆర్థిక




దక్షిణాసియాలో, ఆగ్నేయ ఆసియా దేశాలలో ఉన్న నిరుద్యోగంలో భారతదేశమే అగ్రస్థానంలో ఉంది. 2016–17 నుండి 2023–24 ఆర్థిక సంవత్సరం వరకూ నిరుద్యోగం దేశంలో 7–8 శాతం మధ్యనే తిరుగాడుతున్నది. ఇలాంటి దశలో కేంద్ర మంత్రి 'మేక్ ఇన్ ఇండియా' ఘన విజయం సాధించిందని ప్రకటించుకున్నారు.

సంవత్సరం వరకూ మూడేళ్ళకాలంలో స్థూల జాతీయోత్పత్తిలో విదేశీ పెట్టుబడుల వాటా 19.5 శాతానికి తగ్గిపోయింది. చిట్టచివరకు దీనివల్ల నిరుద్యోగం ఆకాశాన్ని అంటింది. దక్షిణాసియాలో, ఆగ్నేయ ఆసియా దేశాలలో ఉన్న నిరుద్యోగంలో భారతదేశమే అగ్రస్థానంలో ఉంది. 2016–17 నుండి 2023–24 ఆర్థిక సంవత్సరం వరకూ నిరుద్యోగం దేశంలో 7–8 శాతం మధ్యనే తిరుగాడుతున్నది. ఇలాంటి దశలో కేంద్రమంత్రి 'మేక్ ఇన్ ఇండియా' ఘన విజయం సాధించిందని ప్రకటించుకున్నారు. దీనికి విరుద్ధంగా 'ఏసియన్' దేశాలలో నిరుద్యోగా చాలా కనిష్ఠస్థాయిలో ఉంది. థాయ్‌లాండ్‌లో నిరుద్యోగం 0.98 శాతంగా ఉంటే వియత్నాంలో 1.6 శాతం, చైనాలో 5.2 శాతంగా నమోదైంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నిరుద్యోగమే ప్రధాన సమస్యగా తెరమీదకు వచ్చింది. మోదీ తన సమ్మోహన శక్తినీ, జనాకర్షణనూ కోల్పోవడానికి ఈ సమస్య కూడా ప్రధాన కారణమనే వాదన బలంగా వ్యాప్తిలో ఉంది. దీనివల్ల లోక్‌సభలో బిజెపి తన బలాన్ని కోల్పోయింది. మేక్ ఇన్ ఇండియా వైఫల్యంతో మోదీ ప్రభుత్వానికి ప్రమాద ఘంటికలు మోగాయి. చివరకు 2024–25 బడ్జెట్‌లో ప్రోత్సాహకాలకు ఇది దారితీసింది. ఉద్యోగావకాశాలు విస్తరించడానికి వీలుగా యాజమాన్యాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే, తయారీ, ఉత్పత్తిరంగాల్లో విస్తరణ లేకుండా యజమానులు ఎలా ఉద్యోగాలివ్వగలరు? ప్రపంచంలో ఈ విధంగా ప్రోత్సాహకాలిచ్చిన మొదటిదేశం భారతదేశమే! కానీ 'ఏసియన్' దేశాలలో గత ఏడాదిలో విదేశీ పెట్టుబడులు 10.7శాతం పెరిగాయి. చైనా ప్లస్–1 వ్యూహానికి అనుగుణంగా భారీవాటా ఈ దేశాలకు తరలివెళ్ళింది. కరోనా మహమ్మారి సమయంలో కూడా 'ఏసియన్' దేశాల నుండి ఎగుమతులు బ్రహ్మాండంగా జరిగాయి. ఈ దేశాల ఎగుమతులు 2022లో 14.9 శాతానికి పెరిగాయి. అమెరికా తర్వాత, యూరోపియన్ యూనియన్ ఎగుమతులకు ప్రధాన గమ్యస్థానాలయ్యాయి. అలాంటప్పుడు చైనా ప్లస్–1 వ్యూహం ద్వారా భారతదేశం ఎందుకు ప్రయోజనం పొందడంలో విఫలమైంది? ఎందుకంటే ఆగ్నేయ ఆసియాలో ఉన్న దేశాలతో పోటీ పడటంలో భారత్ విఫలమైపోయింది. కారణం ఏమిటంటే చైనా పెట్టుబడులపై భారత్ నిషేధం విధించింది. గత పదేళ్ళలో సరఫరా వ్యవస్థ అత్యంత కీలకంగా మారింది. ప్రపంచవాణిజ్యంలో దీని వాటా 40 శాతంగా ఉంది. ఈ వస్తు సరఫరాల విషయంలో చైనా రారాజుగా వెలుగొందుతున్నది. కరోనా సమయంలో మోదీ ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియాపై కేవలం దేశీయ ఉత్పత్తులపైనే దృష్టి పెట్టింది. ఆనాటి ప్రపంచ వాణిజ్య అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తుల సరఫరాపై దృష్టిపెట్టలేదు. పైగా చైనా పెట్టుబడులపై నిషేధం మనదేశానికి ప్రధాన ఆటంకంగా మారింది. దీనివల్ల మనదేశంలో అమెరికా పెట్టుబడుల్లో ఆకస్మిక క్షీణత వచ్చింది.మ మరోవైపు చైనాలో ఉన్న అమెరికా బహుళజాతి కంపెనీలు భారత్‌కు వచ్చేందుకు ఇష్టపడలేదు. ఎందుకంటే చైనా కర్మాగారాల్లో జరిగిన అమెరికా ఉత్పత్తులను మోదీ ప్రభుత్వం అనుమతించలేదు. కానీ దీనికి విరుద్ధమైన విషయం ఏమిటంటే, చైనా కంటే భారతదేశమే తయారీరంగ కర్మాగారాలకు అత్యుత్తమ గమ్యస్థానమని అమెరికా పెట్టుబడిదారుల ఉద్దేశం. అత్యంత సంక్లిష్టమైన కర్మాగార విడిభాగాల ఉత్పత్తిలో చైనా కంటే భారత్ వెనుకబడినప్పటికీ దీర్ఘకాల ప్రయోజనాలదృష్ట్యా భారతదేశమే మేలైన గమ్యస్థానమని అమెరికా పెట్టుబడిదారుల ఉద్దేశం. ఈ పరిస్థితుల్లో చైనా పెట్టుబడుల విషయంలో భారత్ తెల్లమొహం వేసింది. కానీ గత ఆర్థిక సంవత్సరం ఎకనామిక్ సర్వే నివేదికలో చైనా పెట్టుబడులను రప్పించడంపైనే దృష్టిపెట్టాలన్న సలహాలకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మద్దతు ఇచ్చారు. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ పారిశ్రామిక ఉత్పత్తిలో భారత్ వృద్ధి సాధించినప్పటికీ కూడా చైనా నుండి దిగుమతులపైనే ఈ వృద్ధి ఎక్కువగా ఆధారపడి జరిగింది. ఈ రంగంలో తక్కువ దిగుమతులతో భారతదేశం విదేశీ పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానమయ్యే అవకాశాలున్నాయి. భద్రతాపరమైన సమస్యలు పరిష్కరించుకుని, చైనా పెట్టుబడులను గనుక మోదీ ప్రభుత్వం అనుమతిస్తే 'మేక్ ఇన్ ఇండియా'కు పెద్ద ప్రోత్సాహం లభిస్తుంది.

(ఐపిఎ సర్వీస్)

# మార్కెట్ శక్తుల మోసాలే ధరల పెరుగుదలకు కారణం



వి.యస్.బోస్
సిపిఐ తెలంగాణ కార్యదర్శివర్గ సభ్యులు
9391356527

నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకి పెరిగి సామాన్య ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ధరలు అసంబద్ధంగా, అన్యాయంగా పెరగటం వెనుక మార్కెట్ శక్తుల మోసాలే ప్రధాన కారణం కాగా, నియంత్రించటంలో ప్రభుత్వాల వైఫల్యాలు మరో కారణం. నిత్యావసర వస్తువుల్లో క్రయ విక్రయాలలో లాభపడితే కష్టపడిన రైతు లేక కష్టార్జితాన్ని ఖర్చుచేసి కొనుగో లు చేస్తున్న కొనుగోలుదారుడు లాభపడాలి. కానీ దీనికి విరుద్ధం గా మోసాల మీద బ్రతికే దళారులు లాభపడటం విడ్డూరం. ఇది మన సమాజంలోని రాజకీయ దుర్మార్గం. రైతు తన సరుకులు అమ్మేటప్పుడు ధరలు పాతాళంలో ఉంటాయి. కొనుగోలుదారు డు సరుకులు కొనేటప్పుడు ధరలు ఆకాశంలో ఉంటాయి. ఏమీటి ఈ మాయా.. ? అని ఆలోచిస్తే మార్కెట్ గొలుసు క్రమంలో ఎలాంటి కష్టం పడని దళారులు లాభాలు పోగుచేసుకుంటున్నారు. ఇది పెట్టుబడిదారీ సమాజ ధర్మంగా చలామణి అవుతుంది. దళారుల వద్ద పని చేసే హమాలీ కార్మికులకు శ్రమ తప్ప లాభాల లో వాటారాదు. వీరి జీవితాలు గొర్రెతోక బెత్తెడే అన్న చందాన వారి జీవితాలు తరతరాలుగా ఎలాంటి మార్పు లేకుండా గడిచిపోతున్నాయి. ఒక్కొక్కసారి రైతు తాను పండించిన పంటలకు సరైన ధర లేక తగలబెట్టటం, రోడ్లపై పారబోసి అప్పులపాలు కావటం నిత్యజీవితంలో పరిపాటైపోయింది. తట్టుకోగల్గిన రైతు అప్పుల జీవితంలో కొట్టుమిట్టాడుతున్నారు. బాధలు తట్టుకోలేని రైతు హత్మఆత్యకు పాల్పడుతున్నాడు.

మార్కెట్‌లో టోకు ధరలు 40శాతం, రిటైల్ ధరలు 50 శాతం పెరిగితే కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష జోక్యం ద్వారా ధరలు అదుపులోకి తేవాలి. సరుకుల అక్రమ నిల్వలపై దాడులు చేయ టం, బ్లాక్ మార్కెట్‌ను నిషేధించటం లాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వం యంత్రాంగం ద్వారా చేయాలి. దీని కొరకు 1980లో బ్లాక్ మార్కెట్ నియంత్రణ చట్టం తీసుకురావటం జరిగింది. ఈ చట్టం ఉన్న వారికి చుట్టంగా అక్రమార్కులకు ఆత్మబంధువుగా ఉండటం మన సమాజంలోనే చెల్లుబాటు అవుతుంది. ఇది పూర్తిగా పాలకులు,ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వ బాధ్యతారాహితమే అని చెప్పా లి.

మన దేశంలో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గినప్పుడు విదేశాల నుండి దిగుమతులు చేసుకోవటం, ఉత్పత్తులు పెరిగినప్పుడు విదేశాలకు ఎగుమతులపై కేంద్రీకరించటం కేంద్ర ప్రభుత్వ విధానం గా ఉండాలి. కానీ దీనికి విరుద్ధంగా విదేశీ వ్యాపారుల, గుత్త పెట్టుబడిదారి సంస్థల ఒత్తిడితో ఎగుమతులు, దిగుమతులు ప్రభుత్వం చేయటం మూలంగా వ్యాపారులకు కనకవర్షం, వినియోగదారులకు కన్నీరు నిరంతర ప్రక్రియగా మారింది. టోకు వ్యాపారంలో విదేశీ శక్తులను, రిటైల్ వ్యాపారంలో స్వదేశీ కార్పొరేట్ సంస్థలను నిషేధించాలని భారత కమ్యూనిస్టు పార్టీ, ఇతర ప్రజాస్వామిక వాదులు ఎన్ని పోరాటాలు చేసినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టటం మూలంగా నిత్యావసర వస్తువులలో ధరల పెరుగుదలకు కారణం. ప్రజాస్వామ్య శక్తులు పోరాటాలకు కేంద్ర ప్రభుత్వం సంకెళ్ళువేసి, ప్రపంచ బ్యాంకు ఆరాటాలకు రెడ్ కార్పెట్ వేసే విధానాలతో ప్రజలు బాధపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యాపార దొంగలకు ఫ్యూచర్ ట్రేడింగ్ అనే వజ్రాయుధం లాంటి ఆయుధం అందించి వారి దోపిడికి మేలు చేసింది. అమాయకులు, ఫ్యూచర్ ధరలను ఊహించలేని అమాయకపు రైతులు వారి దోపిడీలో కొట్టుకుపోతున్నారు. చిన్న వ్యవసాయాలకు, కో ఆపరేటివ్ వ్యవసాయాలకు ప్రభుత్వాలు మంగళంపాడి కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేస్తున్నారు. బ్రతుకుదెరువు కోసం పంటలు అమ్ముకొనే రైతు మూలంగా ధరలు మామూలుగా ఉంటాయి. ప్రజలకు మేలు జరుగుతుంది. లాభాలు, అధిక లాభాలే తమ పరమావధిగా భావించే కార్పొరేట్ సంస్థల కుట్రల తో ధరలు అదుపులేని పరిస్థితి ఏర్పడుతుంది. కనీస మద్దతు ధర ఇచ్చి అటు రైతులను, సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులు ప్రజలకు అందించి అటు రైతులను, ఇటు ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం "వ్యాపారం నా బాధ్యత కాదు పాలన మాత్రమే నా బాధ్యత అని" చెపుతూ ప్రజలను మోసం చేస్తున్నారు.

నిత్యావసర వస్తువుల సేకరణ, నిలువ, పంపిణీ చేసేలా 1955 నాటి చట్టం, 1966లో తెచ్చిన సీడ్ యాక్ట్, 1980లో తెచ్చిన బ్లాక్ మార్కెట్ నియంత్రణ యాక్ట్, 1990లో తెచ్చిన ఔషధాల ధరల నియంత్రణ యాక్ట్‌లు పరిపాలనకు సంబంధం లేనివిగా భావించటం తగదు. ఈ చట్టాలు వ్యాపారుల అక్రమాలను, అవినీతిని నియంత్రించటానికి ప్రభుత్వం తెచ్చిన చట్టాలు. వాటిని అమలు చేయకపోతే చట్టాలు తేవటం ఎందుకు అలాంటి ప్రభుత్వాలు ఎందుకు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అబద్ధాలతో ప్రజల చెవిలో పూలు పెడుతున్నదనేది వాస్తవం. ప్రభుత్వం ఆహార ధాన్యాలు, ఇంధనం, ఔషధాలు, బొగ్గు మరియు ఇనుము నిత్యావసరాలుగా ప్రకటించింది. వాటిని ప్రజలకు సరసమైన ధరలతో ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. కానీ విదేశీ, స్వదేశీ వ్యాపారస్తుల కు పూర్తిగా లొంగిపోయిన ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పించుకోవటం ప్రజాస్వామ్య ద్రోహం.

రైతు 2020లో జరిగిన ఉద్యమంలో తమ పంటలకు కనీస మద్దతు ధర కావాలని కోరుతూ సుమారు 170 మంది రైతులు ప్రాణాలు బలిదానం చేశారు. వారి ఉద్యమానికి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం 3 రైతు చట్టాలను రద్దు చేస్తామని అంగీకరించి ఇప్పటి వరకు ఆ వాగ్ధానంపై ఎలాంటి అనుకూల చర్యలు చేపట్టలేదు. ఈ 3 చట్టాల్లో ఒక చట్టం నిత్యావసర వస్తువుల ధరలకు సంబంధించింది కావటం ముఖ్యంగా ప్రజలు గమనించాలి. ఆ ప్రాముఖ్యతను గమనించని ప్రజలు రైతు ఉద్యమానికి అందించవల్సిన స్థాయిలో సహకారాన్ని అందించకపోవటం దురదృష్టకరం. ఈ చట్టం ద్వారా ప్రస్తుతం ఉన్న ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనే ప్రభుత్వ సంస్థను పూర్తిగా మూసివేసి, వ్యవసాయ సరుకుల సేకరణ, నిలువ మరియు పంపిణీని కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయటానికి పూనుకున్నారు. దీనితో ప్రభుత్వం పూర్తిగా ధరల నియంత్రణకు తప్పుకోవటానికి వారి అనుంగ మిత్రులైన కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చటానికి చేస్తున్న కుట్రలో భాగమే 3 రైతు చట్టాలు. ఒకవేళ ఈ చట్టాలు అమలు జరిగితే రేపటి ధరల పరిస్థితి ఊహించటం కష్టం. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం తన 10 సంవత్సరాల పాలనలో 40శాతం ప్రజలను పేదరికం నుండి బయటకు తెచ్చామని ఒక ప్రక్క ప్రకటిస్తే మరో ప్రక్క దేశంలో 90 కోట్ల మంది ప్రజలకు ఉచిత బియ్యం సరఫరా చేస్తున్నదని చెప్పటంలో ఎంత మోసం ఉందో గమనించాలి. ఒక దానికి మరొకటికి విరుద్ధమైన ప్రకటనలు చేయటం మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వానికి అలవాటుగా మారింది.

దేశంలో డీజిల్ ధరలు పెరగటం మూలంగా ఆ ప్రభావం నిత్యావసర వస్తువుల రవాణాపై ప్రభావం పడి సరుకుల ధరలు పెరిగే అవకాశం ఉంది. బిజెపి పాలనలో ప్రపంచ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా మన వద్ద డీజిల్ ధరలు పెరగటం ప్రపంచ వింతల్లో ఒకటిగా నిలిచిపోతున్నది. 1914లో క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 107 డాలర్లు ఉంటే మన దేశంలో డీజిల్ ధర లీటర్‌కు రూ.52.28 ఉంది. 2024లో ప్రపంచ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 72డాలర్లు ఉంటే మన దేశంలో డీజిల్ ధర రూ.95.62లుగా ఉంది. ఈ ధరల విధానాన్ని పరిశీలి స్తే కేంద్ర ప్రభుత్వం ప్రజా పాలనకు బదులు కార్పొరేట్స్ పాలన చేస్తున్నదనేది అర్థమవుతుంది.

రిటైల్ మరియు టోకు వ్యాపారంలో విదేశీ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటివి, స్వదేశీ సంస్థలైన మోర్, క్రోమ, ఉషోదయ, రత్నదీప్, డీమార్ట్, బజాజ్ ఎలాక్ట్రానిక్ లాంటి అనేక సంస్థ లు వ్యాపారం చేస్తున్నా సరుకుల ధరలు ఎందుకు తగ్గటంలేదో ప్రభుత్వం చెప్పాలి. వ్యాపారంలో పోటీతత్వం పెరిగితే ప్రజలకు సరుకులు తక్కువ ధరల్లో దొరుకుతాయని ప్రభుత్వం చెప్పటంలో ఉన్న డొల్లతనం వీటి ద్వారా అర్థమవుతున్నది. కారులు, సెల్‌ఫోన్లు, ఎలాక్ట్రానిక్ వస్తువులు, పండ్లు లాంటి వ్యాపారాల్లో విదేశీ, స్వదేశీ గుత్త సంస్థలు ప్రవాహంలో చొరబడినప్పటికి వాటి ధరలు పెరగటమే గాని తరగటం లేదు ఎందుకు?

ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తృతం చేయాలి. ఎక్కువ సరుకులు వాటిద్వారా పంపిణీ చేయాలి. ఈ ప్రక్రియలో మూడంచెల వ్యవస్థల విధానాన్ని ప్రవేశపెట్టాలి. 1) ప్రజా పంపిణీ వ్యవస్థ 2) సామాజిక పంపిణీ వ్యవస్థ 3) మార్కెట్ వ్యవస్థ. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సబ్సిడీ ధరలకు సరుకులు అందజేయాలి. ప్రభుత్వ పథకాల ద్వారా అందించే ఉచిత సరుకులు కూడా ఈ పథకం ద్వారా ప్రజలకు అందించాలి. సామాజిక వ్యవస్థ ద్వారా లాభాలు లేక నష్టాలతో ప్రమేయం లేకుండా (నో లాస్ నో ప్రాఫిట్) విధానంలో ప్రజలకు అందించాలి. మార్కెట్ పంపిణీ ద్వారా 5–10 శాతం లాభాలతో ప్రజలకు సరుకులు అందించాలి. ఈ మూడు వ్యవస్థల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించటం ద్వారా వారిని ఉపయోగించుకోవాలి. ఈ విధానాలు తు.చ.తప్పకుండా అమలు చేస్తే మార్కెట్ శక్తుల మోసాలను, లాభాల ఆపేక్షను నియంత్రించటానికి అవకాశం ఏర్పడుతుంది.

ధరలు తగ్గాలంటే కేంద్ర ప్రభుత్వం తన శకుని పాత్రను వదిలిపెట్టాలి. కార్పొరేట్ సంస్థలను, విదేశీ సంస్థలను నిత్యావసర వస్తువుల వ్యాపారం నుండి నిషేధించాలి. బ్లాక్ మార్కెట్ నిషేధ చట్టాన్ని పకడ్బందిగా అమలు చేయాలి. టోకు, రిటైల్ వ్యాపారాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకోవాలి. వాటిపి చదువుకున్న నిరుద్యోగులకు బ్యాంకుల ద్వారా రుణాల సౌకర్యం కలుగజేసి వారిని ప్రోత్సహించాలి. నిత్యావసర వస్తువుల వ్యాపారం లాభాల కోసం కాకుండా సమాజసేవగా భావించాలి. దీనితో చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి కల్గటంతో పాటు లాభాల ప్రసక్తి లేకపోవటంతో సరసమైన ధరలకు సరుకులు ప్రజలకు అందటంద్వారా వారికి ఊరట లభిస్తుంది. ప్రభుత్వాలు వారి విధానాలను మార్చుకోవాలి. లేకపోతే ప్రజలే ప్రభుత్వాలను మార్చాలి.

## లేఖ

### దసరాకు ప్రత్యేక బస్సులు నడపాలి

దసరా పండుగకు ఊర్లకు వెళ్ళే వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలి. తెలంగాణ ప్రజలకు ముఖ్యమైన పండుగ దసరా కావున ఎక్కువ మంది సొంతూర్లకు వెళ్తారు. అదే విధంగా స్కూల్, కాలేజీ పిల్లలకు సెలవులు ప్రకటించడంతో ఊరి బాట పడుతున్నారు. దీంతో ఎటు చూసిన బస్ స్టాండ్‌లు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. వారి ప్రయాణం సురక్షితంగా, క్షేమంగా గమ్య స్థానాలకు చేరాలంటే సరిపడా బస్సులు నడపాలి. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండ చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉంది.

మిద్దె సురేష్

## హస్మత్‌పేట కూలీలకు ఇచ్చిన కూల్చివేత నోటీసులు రద్దు

### హైకోర్టు ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం హస్మత్‌పేట హరిజన బస్తీ వాసులకు తహసిల్దార్ జారీ చేసిన కూల్చివేత నోటీసులను హైకోర్టు రద్దు చేసింది. పూర్తి వివరాలతో, బస్తీవాసుల వాదన విని చట్టప్రకారం ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని తహసిల్దార్‌ను ఆదేశించింది. ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలున్నాయని, వాటిని తొలగించాలంటూ ఆగస్టు 21న తహసిల్దార్ జారీ చేసిన నోటీసులను రద్దు చేయాలని, కూల్చివేతలు చేపట్టకుండా హైడ్రాకు ఆదేశాలు జారీ చేయాలంటూ హస్మత్‌పేట హరిజన బస్తీకి చెందిన ఎస్. మల్లయ్య మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. తహసీల్దార్ జారీ చేసిన నోటీసులో సర్వే నెంబరు, ఆక్రమణల విస్తీర్ణాలను పేర్కొనలేదని, వివరాల్లేకుండా ఇచ్చిన లోపభూయిష్టమని నోటీసులు చెల్లవని పేర్కొన్నారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో ఆక్రమణలున్నాయంటూ తహసిల్దార్ తుది ఉత్తర్వులు జారీ చేశారని, ఈ ఉత్తర్వులు జారీ చేసేముందు కనీసం పిటిషనర్లకు సమాచారం ఇవ్వకపోవడం, వారి వాదన వినకపోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. అందువల్ల తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను రద్దు చేస్తూ, చట్ట నిబంధనల ప్రకారంతాజాగా చర్యలు చేపట్టవచ్చంటూ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

## పర్యావరణంపై.. షార్ట్ ఫిల్మ్ విడుదల చేసిన కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో భాగంగా స్వచ్ఛ భారత్ దివస్ సందర్భంగా స్ఫూర్తి థియా వేదుల రచన, దర్శకత్వం వహించిన "టుమారో విల్ నాట్ టేక్ కేర్ ఇట్ సెల్ఫ్" అనే ఆలోచనాత్మక షార్ట్ ఫిల్మ్ ను కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే సామాజిక బాధ్యతను షార్ట్ ఫిల్మ్ ద్వారా ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. డైలాగ్ లేకుండా ఒక గొప్ప సందేశాన్ని అందించారన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ స్పృహ కలిగి ఉంటే.. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలు అవసరం లేదన్న విషయాన్ని ఈ చిత్రం మనకు గుర్తు చేస్తుందన్నారు. కాలుష్యం ప్రపంచ సవాలుగా మారిందన్నారు. జమ్మూ కాశ్మీర్ ఎన్నికల ప్రచారంలో ఉన్న సమయంలో పచ్చని కొండలు, ఆ నిర్మలమైన అందాలు స్వర్గధామంలా నన్ను ముగ్ధులను చేసిందన్నారు. అక్కడ నుంచి బయటికి వస్తే ప్లాస్టిక్ వ్యర్థాలు, హానికరమైన పదార్థాలు కలవరపెట్టే విధంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా స్ఫూర్తి మాట్లాడుతూ ఈరోజు 155వ గాంధీ జయంతి, స్వచ్ఛ భారత్ పదో వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా పర్యావరణంపై నా షార్ట్ ఫిలింను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు.

## రూ.4 కోట్ల గంజాయి దగ్ధం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం రూ.4 కోట్ల విలువైన 1065 కిలోల గంజాయిని దగ్ధం చేశారు. భద్రాది కొత్తగూడెం పరిధిలోని పాల్వంచ, అశ్వరావుపేట, మణుగూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 22 కేసుల్లో పట్టుకున్న గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం డిప్యూటి కమిషనర్ జనార్థన్‌రెడ్డి పర్యవేక్షణలో అసిస్టెంట్ కమిషనర్ గణేష్ గంజాయిని దగ్ధం చేయించారు. ప్రభుత్వ ఆమోదిత డిస్పోయిడ్ కన్సలింగ్ ఖమ్మంలోని టిఎన్‌టియుసి ఎడబ్ల్యూఎస్ కంపెనీ లో గంజాయిని దగ్ధం చేయించారు. దహనం చేయబ డిన గంజాయి విలువ రూ.4 కోట్ల మేర ఉంటుంది. పాల్వంచ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 కేసుల్లో 1036.43 కిలోల గంజాయి, ఆశ్వరావుపేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసులో 2.8 కిలోల గంజాయి, మణుగూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 4 కేసుల్లో 25.9 కిలోల గంజాయిని దగ్ధం చేయించారు. మొత్తం 22 కేసుల్లో 1065.13 కిలోల గంజాయి గతంలో పట్టుబడింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు ఎక్సైజ్ సూపరింటెంట్ జానయ్య, సిఐలు, ఎస్‌ఐలు పాల్గన్నారు. నాలుగు రోజుల క్రితమే రూ. 2.80 కోట్ల విలువ చేసే 1120 కిలో గంజాయిని కూడ దగ్ధం చేయించారు. మొత్తంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ.6.80 కోట్ల విలువ చేసే 2185 కిలోల గంజాయి దాహనం చేశారు. రంగారెడ్డి జిల్లాలో రూ.1.87 కోట్ల విలువ చేసే అక్రమ మద్యాన్ని సైతం అధికారులు ధ్వంసం చేశారు.

## ప్రజావాణిలో 338 దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 338 దరఖాస్తులు అందాయి. గృహనిర్మాణ శాఖకు సంబంధించి 79, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 52, పంచాయతి రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 35, విద్యుత్ శాఖ కు సంబంధించి 35, ఎస్‌సి సంక్షేమ శాఖ కు సంబంధించి 29, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 4, ఇతర శాఖలకు సంబంధించి 104 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సింగిల్ జడ్జి తీర్పు రద్దు చేయండి

### అసెంబ్లీ సెక్రటరీ అప్పీల్ దాఖలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ నుంచి ఎన్నికై కాంగ్రెస్ తీర్థం తీసుకున్న ఎమ్మెల్యేలపై దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై గత నెల 9న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును నిలిపివేయాలని కోరుతూ అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. అనర్హత పిటిషన్లపై విచారణ నిమిత్తం షెడ్యూలు ఖరారు నిమిత్తం పిటిషన్లను స్పీకర్ ముందుంచాలని, అనంతరం నిర్ణయించిన షెడ్యూలును హైకోర్టుకు నివేదించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వేర్వేరుగా రెండు అప్పీళ్లు దాఖలు చేశారు. పార్టీలు ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోలేదంటూ ఊహాజనిత అంశాలతో కౌశిక్రెడ్డి, కె.పి. వివేకానంద, ఎ.మహేశ్వర్రెడ్డిలు కోర్టును ఆశ్రయించారు. స్పీకర్ తప్పుడు ఆరోపణలు చేశారు. స్పీకర్ వాడిన భాష కూడా హుందాగా లేదు. స్పీకర్ హోదాకు కూడా గౌరవం ఇవ్వలేదు. రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోపణలు చేశారు. అనర్హత పిటిషన్లను సమర్పించిన వెంటనే స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు కూడా గడువు ఇవ్వకుండా హై కోర్టుకు వచ్చారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ప్రకారం స్పీకర్ ఓవిధానం ప్రకారం నిర్ణయం తీసుకుంటారు. సుప్రీం కోర్టు తీర్పుల ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే కోర్టులు జోక్యానికి ఆస్కారం లేదు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్న గత 10 ఏళ్లలో అనుసరించినట్లే ఇప్పుడు కూడా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోరని భావించి పిటిషన్లు వేశారు. అనర్హత పిటిషన్లలో తమ వాదనలను పరిగణలోకి తీసుకోకుండా సింగిల్ జడ్జి ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేయండి.. అని అప్పీల్ పిటిషన్లల్లో అసెంబ్లీ సెక్రటరీ పేర్కొన్నారు. అప్పీళ్లపై విచారణ పూర్తయ్యేదాకా సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలిపివేయాలని కోరారు. లేని పక్షంలో స్పీకర్ రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా విధులను నిర్వహించే అవకాశం ఉండదన్నారు. వీటిపై అత్యవసరంగా విచారించి తేల్చాలని అభ్యర్థించారు. వాదనలను విన్న ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేస్తూ పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై దాఖలైన అనర్హత పిటిషన్లపై విచారణ షెడ్యూలును నిర్ణయించడానికి ఫైళ్లను స్పీకర్ ముందుంచాలని అసెంబ్లీ కార్యదర్శికి సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారంది. అనంతరం నిర్ణయించిన షెడ్యూలును కోర్టుకు సమర్పించాలని ఆదేశించారంది. కేశం మెగాచంద్ర సింగ్ వర్సెస్ మణిపూర్ స్పీకర్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకుని సింగిల్ జడ్జి ఈ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొంది. ప్రస్తుత అప్పీళ్లలో నిర్ణీత కాలవ్యవధిలో అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్‌కు ఆదేశాలిచ్చే పరిధి ఈ కోర్టుకు ఉందా? లేదా అన్న వివాదంపై తేల్చాల్సి ఉందని పేర్కొంది. వీటిపై ఈనెల 24న తుది విచారణ చేపడతామని, ఈలోగా ఏవైనా చర్యలు తీసుకుంటున్నట్లయితే కోర్టును ఆశ్రయించవచ్చుంది. చర్యలు చేపట్టినట్లయితే ధర్మాసనం ముందు ప్రస్తావించే అవకాశాన్ని ఇస్తున్నామంది. ఇందులో ప్రతివాదులైన పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద, ఎ.మహేశ్వర్‌రెడ్డిలతోపాటు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 24కు వాయిదా వేసింది.



# హైడ్రా కూల్చివేతలపై స్టేకు హైకోర్టు నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా కూల్చివేత చర్యలు వివక్షతో ఉన్నాయంటూ కేఏ పాల్ వ్యక్తిగత హోదాలో వేసిన పిల్‌ను శుక్రవారం హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బెంచ్ విచారించింది. పేదల ఇండ్లను కూల్చేస్తున్న ప్రభుత్వం సిఎం సోదరుడి ఇంటికి నోటీసు ఇచ్చి నెల రోజులైనప్పటికీ కూల్చివేయలేదంటూ పాల్ పిల్ వేశారు. ప్రభుత్వ స్థలాలు, చెరువుల బఫర్‌జోన్స్, ఎఫ్‌టిఎల్ ప్రాంతాల్లో ఆక్రమణ లు, అక్రమ నిర్మాణాల కూల్చివేత చర్యలను నిలిపివేయాలని పాల్ వాదించారు. చెరువుల రక్షణ చర్యలు సముచితమే అయినప్పటికీ కూల్చివేత చర్యలు చట్ట ప్రకారం లేనందున స్టే ఇవ్వాలని కోరారు. సర్వే చేశాక చర్యలు తీసుకోవాలని, కూల్చివేసే ముందు 30 రోజుల గ డువు ఇవ్వాలని, పేదలకు పరిహారంతోపాటు పునరావాసం కల్పించేలా ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. హైడ్రా కూల్చివేత చర్యలపై స్టే ఇవ్వాలన్నారు. వాదనల తర్వాత ధర్మాస నం, కూల్చివేతల్లో వివక్షత గురించి వివరాలు ఇవ్వకుండా ఏసమాచారం లేకుండా స్టే ఇవ్వలేమని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనల తర్వాత మధ్యంతర ఉత్తర్వుల అంశాన్ని పరిశీలన చేస్తామంది. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. .

### హైడ్రా కేసులో ముందస్తు బెయిల్

నిజాంపేట ప్రగతినగర్‌లోని ఎర్రకుంట చెరువు బఫర్జోన్, ఎఫ్‌టిఎల్ల్ ఆక్రమ నిర్మాణాలకు పర్మిషన్లు ఇచ్చారని హైడ్రా అభియోగాలకు అనుగుణంగా పోలీసులు నమోదు చేసిన కేసులో హెచ్ఎండిఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్ కుమార్‌కు ముందస్తు బెయిల్ మంజూరైంది. ఈ మేరకు జస్టిస్ శ్రీదేవి పలు షరతులతో ముందస్తు బెయిల్ ఇచ్చారు. ఇదే తరహాలో ముందస్తు బెయిల్ కావాలంటూ పిటిషన్ వేసిన జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ వేసిన పిటిషన్‌కు దసరా సెలవుల తర్వాత విచారణ జరగనుంది.

# ముగిసిన భట్టి విదేశీ పర్యటన





**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, అధికారుల బృందం అమెరికా, జపాన్ పర్యటన విజయవంతంగా ముగిసింది. సెప్టెంబర్ 24వ తేదీన విదేశాల పర్యటనకు వెళ్ళిన భట్టి విక్రమార్క బృందం శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఎంఎల్‌ఏలు, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు శంషాబాద్ విమానాశ్రయానికి తరలివచ్చి అభిమాన నేత డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు ఘనంగా స్వాగతం పలికారు. మొత్తం 13 రోజుల పాటు కొనసాగిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క విదేశీ పర్యటనలో భాగంగా అమెరికాలో జరిగిన అంతర్జాతీయ మైనింగ్ ఎగ్జిబిషన్ మైనెక్స్2024లో కోమత్సు, హిట్యాచి, క్యాటర్ పిల్లర్ వంటి ప్రముఖ కంపెనీలు ఉత్పత్తి చేసిన అత్యాధునిక షావెల్స్, డంపర్లు, కంటిన్యూయస్ మైనర్ యంత్రాలు, గనిలో ప్రమాదాలు జరగకుండా చూసే రక్షణ వ్యవస్థలను పరిశీలించారు. ఆధునిక గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పద్ధతులు, బొగ్గు ఉత్పత్తిలో భద్రత, ఆధునిక సాంకేతికతలు పరిశీలించారు. అంతర్జాతీయంగా ఉనికిలోకి వచ్చిన అత్యాధునిక గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీలు, ఆధునిక మైనింగ్ విధానంలో అధికోత్పత్తిని సాధించే భారీ యంత్రాలు, వర్చువల్ రియాలిటీతో రక్షణ చర్యలు మొదలైనవి పరిశీలించారు. భూగర్భ గనుల్లో వర్చువల్ రియాలిటీ ద్వారా గని వెలుపలే ఉండి లోపల బొగ్గును తవ్వే సాంకేతికత ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అమెరికాలో అతిపెద్ద హూవర్ జల విద్యుత్ డ్యామ్‌ను సందర్శించి జల విద్యుత్ ఉత్పత్తి విధానాలు, రక్షణ చర్యలు తెలుసుకున్నారు. జపాన్ పర్యటనలో యమనాషీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కేంద్రంలో గ్రీన్ హైడ్రోజన్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడానికి వినియోగించే సాంకేతికతను, సోలార్ విద్యుత్తును నిలువ ఉంచే ఫ్యూయల్ సెల్స్ టెక్నాలజీని తెలుసుకున్నారు. తోషిబా పరిశ్రమలను సందర్శించి అక్కడ ఉత్పత్తి అవుతున్న అత్యాధునిక ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ టెక్నాలజీని పరిశీలించారు. రోహ్మీ సెమీ కండక్టర్ల పరిశ్రమను సందర్శించి అక్కడ జరుగుతున్న పలు రకాల సెమీకండక్టర్లు, హైఎఫిషియన్సీ బ్యాటరీలు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ సెమీకండక్టర్లు వంటివి పరిశీలించారు. జపాన్ రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న బుల్లెట్ ట్రైన్‌లో ఆయన స్వయంగా ప్రయాణించారని డిప్యూటీ సిఎం కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వివరించింది.



# హైడ్రాపై డ్రామాలు ఆపాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న పేదలకు ఏలాంటి పరిస్థితిలో అన్యాయం చేయమని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రక్క చెపుతున్నప్పటికి మరో ప్రక్క రాజకీయ నాయకులు పేదలకు అన్యాయం చేస్తే ఊరుకోమని, అడ్డుకుంటామని అవసరమైతే న్యాయస్థానంలో పోరాటం చేస్తామని పదే పదే చెప్పటంలో అర్థంలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.బోస్ పేర్కొన్నారు. అన్యాయం జరిగిన పేదవారిని తీసుకొచ్చి వారి పేర్లతో సహా ప్రభుత్వం ముందించితే పేద వారికి లాభం జరుగుతుందని, కానీ రెచ్చగొట్టే ప్రకటనలతో లాభం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో దురాక్రమణకు గురైన చెరువులను, నాళాలను, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు హైడ్రాను ఏర్పాటు చేసినట్లుగా పదే పదే ప్రకటించి, మూసీ సుందరీకరణకు హైడ్రాకు ఏలాంటి సంబంధంలేదని అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు హైడ్రా కమిషనర్ ప్రకటనలు చేస్తూనే ఉన్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.బోస్ అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న పేదవారికి డబుల్‌బెడ్ రూంలు ఇస్తే కొంతమంది అంగీకరించి వారి నివాసాలను మార్చుకుంటున్నట్లుగా ప్రచార మాధ్యమాల్లో వార్తలు వస్తూనే ఉన్నాయని అన్నారు. ఒక ప్రక్క కొంత మంది ప్రజలు అక్రమ కట్టడాలను కూల్చాలని హైడ్రాకు విజ్ఞప్తుల పరంపర కొనసాగుతుంటే దానికి విరుద్ధంగా కొంత మంది రాజకీయ నాయకులు హైడ్రాకు వ్యతిరేకంగా ప్రకటనలు చేయటం విడ్డూరంగా ఉందని ఆయన వాపోయారు. మూసీలో మురుగునీటి ప్రవాహంతో నల్గొండ ప్రజలతో పాటు వాటితో పండించిన కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు లాంటి పదార్థాలు పండించటం మూలంగా వాటిని తింటున్న హైదరాబాద్ నగర ప్రజలు తీవ్రమైనటువంటి అనారోగ్యానికి గురవుతున్నారు. కొంతమంది ప్రజల మూలంగా (మల మూత్రాలు) ఏర్పడిన మురుగుతో, మరికొంత మంది ప్రజలపై చెడు ప్రభావం చూపటం మానవ ధర్మం కాదని, దీనికి ఖచ్చితంగా సరైన మార్గం ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. గత 10 సంవత్సరాల్లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం మూసీ రివర్ అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సమయంలో ఏలాంటి తీర్మానాలు చేసింది, ఏలాంటి చర్యలు తీసుకున్నది, ఎంత బడ్జెట్ ఖర్చు చేసింది, ఆ చర్య ద్వారా ఏలాంటి పనులు జరిగాయో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెపుతున్నట్లుగా పేదలకు అన్యాయం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి న్యాయం చేయాలి.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల ద్వారా మోసపోయిన మధ్య తరగతి ప్రజలను ఆదుకొని మోసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి వారి ఆస్తులు స్వాధీనం చేసుకొని మోసపోయి న మధ్యతరగతి ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి జాయింట్ వెంచర్‌ను వ్యతిరేకిస్తూ టిజి పిఇ జెఎసి ధర్నా







### హైదరాబాద్ మింగ్ కాంపౌండ్, విద్యుత్ సౌధ సహా పాల్వంచలో విద్యుత్ ఉద్యోగుల ఆందోళనలు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రామగుండం థర్మల్ ప్లాంట్ జెన్ కో ద్వారానే నిర్మించాలని ఇందులో సింగరేణి భాగస్వామ్యం ఒప్పుకోబోమంటూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి (టిజి పిఈజెఎసి) శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించింది. రామగుండం థర్మల్ స్టేషన్ సింగరేణి, జెన్ కో జాయింట్ వెంచర్‌గా నిర్మించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తునానమని వారు నినాదాలు చేశారు. ఈ మేరకు టిజి పిఈ జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రంలో, కార్పొరేట్ ఆఫీసులు, అన్ని జనరేటింగ్ స్టేషన్‌లో నల్లబ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లో జరిగిన ఈ ధర్నాలో జెఎసి నేతలు కన్వీనర్ రత్నాకర్ రావు, కో కన్వీనర్ బిసి రెడ్డి, జనప్రియ, వేణు, యుగంధర్, శ్రీనివాస్, మనోరంజన్ రెడ్డి, చలపతి రావు, కైలాస్, ఈశ్వర్ దాస్, జైహింద్ తదితరులు పాల్గొనగా, విద్యుత్ సౌధలో పి. సదానందం తదితరుల ఆందోళనలోనూ, అలాగే ఖమ్మం జిల్లా పాల్వంచ లోనూ పెద్ద సంఖ్యలో ధర్నా నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా రత్నాకర్ రావు తదితరులు మాట్లాడుతూ పాత రామగుండం థర్మల్ స్టేషన్ (ఆర్‌టిఎస్) స్థానంలో జెన్‌కో ద్వారానే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యం ఒప్పుకునేదే లేదని తెలిపారు. అపార అనుభవం ఉన్న జెన్‌కో ద్వారానే నిర్మించడానికి ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏమిటో తెలియడం లేదన్నారు, ఎట్టి పరిస్థితుల్లో జెన్ కో , సింగరేణి జాయింట్ వెంచర్స్ ఒప్పకోబోమని , ప్రాజెక్టుకు కావలసిన ఈక్విటి జెన్‌కో దగ్గర ఉన్నాయని మూడు సంవత్సరాల నుండి జెన్ కో లాభాల్లో ఉన్నాయని స్పష్టం చేశారు. 20202021కి గాను 168 కోట్లు, 20212022 కు గాను 394.46 కోట్లు , 20222023కు గాను రూ. 472.94 కోట్లు లాభాలు ఆర్జించిందని గుర్తు చేశారు. ఉద్యోగుల మనోభావాలను, ప్రభుత్వ రంగ సంస్థ బలోపేతానికి కృషి చేయాలని ప్రభుత్వానికి టిజి పిఈ జెఎసిగా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. సింగరేణి భాగస్వామ్యం అంటే ప్రైవేటీకరణ చేయడం అని జెఎసి అభిప్రాయపడుతోందని, అందుకే రామగుండం థర్మల్ ప్లాంట్ జెన్ కో ద్వారానే నిర్మించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 26 నుండి తమ ఆందోళనలు కొనసాగిస్తూ నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలియజేస్తుమని వెల్లడించారు. ఇప్పటి కైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని జెన్ కో ద్వారానే 1X 800 ఎం డబ్ల్యూ రామగుండం థర్మల్ స్టేషన్ నిర్మించడానికి ఆదేశాలు జారీ చేయాలని జెఎసిగా కోరుతున్నామని రత్నాకర్ రావు తదితరులు పేర్కొన్నారు.

## తొలగనున్న హైటెక్ సిటీ ట్రాఫిక్ కష్టాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగించేందుకు 3 శాఖల ఆధ్వర్యంలో సంయుక్త కార్యాచరణ చేపట్టనున్నారు. ఇక్కడి ప్రాంత నివాసులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించేందుకు జలమండలి, జిహెచ్ఎంసి, పోలీసు శాఖలు దీన్ని చేపట్టనున్నాయి. ఈ మేరకు ట్రిడెంట్ హోటల్ నుంచి యశోదా ఆస్పత్రి వరకు ఉన్న 5 కిలోమీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి, సైబరాబాద్ జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిలతో కలిసి పర్యటించారు. లెమన్ ట్రీ హోటల్ నుంచి ట్రిడెంట్ హోటల్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో అక్కడున్న ఎయిర్ వాల్వ్‌లను సమీపానికి తరలించడానికి జోయల్ డేవీస్‌తో చర్చించారు. అవి తరలిస్తే రోడ్డు విస్తరణ పనులు చేపడతామని జాయింట్ కమిషనర్ అన్నారు. రోడ్డు విస్తరణ పనులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా తరలింపు ప్రక్రియను చేపడతామని తెలిపారు. అక్కడ నుంచి మాదాపూర్ యశోదా ఆస్పత్రి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో ధ్వంసమైన సీవరేజ్ పైపులైన్‌లను పరిశీలించారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరిస్తామన్నారు. అనంతరం వారు పర్వతా నగర్‌లో పర్యటించారు. పర్వత నగర్ చౌరస్తా దగ్గర రోడ్డుకు ఇరువైపులా ఉన్న రెండు మ్యాన్ హోళ్ల నుంచి మురుగు పొంగడం, ప్రతిరోజూ ఒక ఎయిర్‌టెక్ మిషన్, ఆ సమస్యను పరిష్కరించడానికి పనిచేయడం, ట్రాఫిక్ మళ్లింపు కోసం ఓ కానిస్టేబుల్ విధులు నిర్వర్తించడం నిత్యకృత్యమైంది. ఈ ప్రాంతాన్ని చౌరస్తా నుంచి సున్నం చెరువు వరకు పర్యటించారు. అక్కడున్న ఔట్ లెట్‌ను ప్రైవేట్ వ్యక్తులు ధ్వంసం చేసినట్లు గుర్తించారు. దీనివల్లే ప్రతి రోజూ ఈ రహదారిపై మురుగు పొంగి సీవరేజ్ ఫిర్యాదులు రావడంతో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పర్వత నగర్ సిగ్నల్ నుంచి రోడ్ నంబర్ 45 వరకు కొత్త సీవరేజ్ పైపు లైన్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఎం.డి. సూచించారు. ఇక్కడ ఉత్పన్నమయ్యే మురుగు నీటిని సున్నం చెరువులోకి చేరకుండా మళ్లించి, దుర్గం చెరువు ఎస్‌టిపి ద్వారా శుద్ధి చేయనున్నారు. ఈ రెండు కార్యక్రమాలను 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చేపట్టి పూర్తి చేస్తామని అశోక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్2 స్వామి, జిఎం, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. ఒక్కసారి ఇక్కడి పనులు పూర్తయితే మాదాపూర్, మైండ్ స్పేస్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇక్కట్లు కొంత వరకు తొలగిపోనున్నాయి.

## బిగ్ 'సి'లో దసరా ధమాకా ఆఫర్స్



దసరా ధమాకా ఆఫర్లను ఆవిష్కరిస్తున్న బిగ్ 'సి' సంస్థ ఫౌండర్ మరియు సి.యం.డి. శ్రీ యం. బాలు చౌదరి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నెంబర్ 1 మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ 'సి' దసరా పండుగ సందర్భంగా ధమాకా ఆఫర్లను ప్రకటించింది. సంస్థ ఫౌండర్, సిఎండి. ఎం. బాలు చౌదరి ఈ ఆఫర్ల వివరాలను శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దసరా పండుగ సందర్భంగా బిగ్ సి లో మొబైల్ కొనుగోలుపై నాలుగు ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నామన్నారు. ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10వేల విలువ గల మొబైల్ ప్రొటెక్షన్ ఉచితంగా ఇస్తున్నామని, ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10 వేల వర కు తక్షణ క్యాష్ బ్యాక్‌ను, అలాగే ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ. 5,999 వరకు విలువ గల ఒక ఖచ్చితమైన బహుమతిని కూడా అందిస్తామని ఆయన తెలిపారు. ఎటువంటి డౌన్ పేమెంట్ లేకుండానే మొ బైల్ కొనుగోలు చేసే ఆకర్షణీయమైన సదుపాయాన్ని అందజేస్తున్నామని వివరించారు. ప్రతి ఒప్పో మొబైల్ కొనుగోలుపై లక్కీ డ్రా ద్వా రా రూ.10 లక్షలు నగదు, ప్రతి వీఓ మొబైల్ కొనుగోలుపై లక్కీ డ్రా ద్వారా బైక్స్, మొబైల్స్ మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం ఇస్తున్నామన్నారు. ప్రతి రియల్ మీ మొబైల్ కొనుగోలుపై లక్కీ డ్రా ద్వారా కార్లు, బైక్స్,మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం ఉందని, అలాగే ప్రతి ఎంఐ మొబైల్ కొనుగోలుపై లక్కీ డ్రా ద్వారా కార్లు, బైక్స్ మరెన్నో బహుమతులు గెలుచుకోవచ్చని వివరించారు. ఎ.టి.యం కార్డుపై ఎటువంటి డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టివి ల్యాప్ స్టాప్, ఎయిర్ కండీషనర్‌లు కొనుగోలు చేసే సదుపాయాన్ని అందజేస్తున్నామని, ఎం. బాలు చౌదరి సూచించారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నాంపల్లి కోర్టు ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిభిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్ పాల్, అభినంద్‌కుమార్ షావిలితో పాటు తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ. నరసింహా రెడ్డి, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ. రవీందర్ రెడ్డి, ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ కుమార్ సహాయ్ ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. హైకోర్టుకు న్యాయవాదులు, సిబ్బంది చేసిన రక్తదానం ఇతరుల ప్రాణాలను కాపాడుతుందని రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. రక్తదానం ద్వార సేకరించిన ఈ రక్తాన్ని అత్యవసర చికిత్స నిమిత్తం ఉస్మానియాకు వచ్చే బాధితులకు అందిస్తామని సూపరింటెండెంట్ రాకేష్ తెలిపారు.

## రాజాస్థాన్‌లో ఎంసిపిఐ(యు)సదస్సు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యూనైటెడ్) పోలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ సమావేశాలు ఈనెల 3,4,5 తేదీలలో రాజస్తాన్ కోటాలో జరుగుతున్నాయి. పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు అనుభవ్ దాస్ శాస్త్రి అధ్యక్షతన వర్తమాన రాజకీయాలు, వామపక్ష కమ్యూనిస్టు, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత అనే అంశంపై జరిగిన సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో ప్రధాన ఉపన్యాసకులుగా ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ మాట్లాడారు. ఈ సెమినార్‌లో యంసిపిఐయు పోలిబ్‌బ్యూరో సభ్యులు కిరణ్ జిత్ సింగ్, షేఖాన్, సిపిఐ రాజస్తాన్ రాష్ట్ర కార్యదర్శి తారాసింహ సింద్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దూలిచంద్ బోర్డా, సిపిఐఎంయల్ లిబరేషన్ రాజస్తాన్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ లాల్ చౌదరి, లోక్ తాంత్రిక్ బచావో ఆందోళన్ రాజస్థాన్ రాష్ట్ర అధ్యక్షులు అజయ్ చతుర్వేది, కిసాన్ సర్వోదయ్ మండలి రాజస్తాన్ రాష్ట్ర నాయకులు పతేహ చంద్ బాగ్లా, రాజస్తాన్ రాష్ట్ర కార్యదర్శి హేందర్ నేహా, ఎంసిపిఐయు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు వస్కుల మట్టయ్య, గోనె కుమారస్వామి, కుంభం సుకన్య, ఎం.డి. ఖాదర్ బాషా, బీహార్ రాష్ట్ర కార్యదర్శి చంద్ర మోహన్ ప్రసాద్, పంజాబ్ రాష్ట్ర కార్యదర్శి మంగత్ రాంలాంగో వాల్, కేరళ రాష్ట్ర కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్యాయంతో కూడిన సమాన వేతనం అమలు చేయాలి

### ఆర్‌టిసి మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ రంగ సంస్థలైన ఎలక్ట్రిసిటీ, ఆర్‌టిసిలలో సమన్యాయంతో కూడిన సమాన వేతనం అమలు చేయాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రోజు 8 గంటల విధి నిర్వహణతో, అత్యవసర సర్వీసులుగా పరిగణించబడే నాలుగు సంవత్సరాలకు ఒక వేతన సవరణ జరిగే భారీ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఈ రెండు సంస్థల్లో సమాన వేతనం అమలు చేయాలన్నారు.



## నత్త నడకన అభివృద్ధి పనులు

**ప్రజాపక్షం / ఉండవెల్లి :** మండలంలోని అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతున్నాయి. నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందనంగా ఉంది. భారీ వర్షాలు వల్ల రోడ్లు బ్రిడ్జిలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అట్టి వాటిని పనిచేయడానికి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించిన పన్నుల జాపం చేస్తూ ఇష్టం సారంగా వివరించడం వల్ల నేటికి రెండు సంవత్సరాలైన పనులు పూర్తి కానీ దుస్థితి ఏర్పడింది. మండలంలోని బైరాపురం బ్రిడ్జి నిర్మాణం కోసం 2022 లో పనులకు శంకుస్థాపన చేశారు. అట్టి పనులు మధ్యన నిలిచిపోవడం వలన గ్రామంలోని రాకపోకలకు తీవ్ర సమస్యగా ఏర్పడింది. వాహనదారులు వెళేందుకు అడుగడుగు గుంతల మాయం ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటూ కాలం చెల్లిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు కొనసాగించాలి. బైరాపురంలోని బ్రిడ్జి పనులు వెంటనే కొనసాగించాలని ఆ గ్రామ ప్రజల కోరుతున్నారు. కిలోమీటర్ దూరం వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని వంతెన నిర్మాణ పనులు ఆగిపోవడం వలన సమీప గ్రామంలోని రాకపోకలకు వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పనులు చేయడాని ఆర్అండ్ బి శాఖ నుంచి కోటి 20 లక్షలు నిధులు మంజూరైన పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రభుత్వం స్పందించి వెంటనే బ్రిడ్జి పనులు కొనసాగించాలని స్థానికులు సత్యనారాయణ భాస్కరు తదితరులు కోరారు.

## ''జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ బలోపేతం చేస్తా

### తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా టంకరి శివ్రపసాద్ యాదవ్



**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** ''జాతీయ వినియోగదారులు హక్కుల కమిషన్'' తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా మహబూబ్ నగర్ జిల్లా రామచంద్రపూర్ గ్రామానికి చెందిన ''టంకరి శివ ప్రసాద్ యాదవ్''కు ''జాతీయ వినియోగదారులు హక్కు కమిషన్ (నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్)'' '' జాతీయ చైర్మన్ ''ఎం.పి.ఎల్. నాగేశ్వరావు'' నియామక పతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకం అయిన ''టంకరి శివప్రసాద్ యాదవ్'' మాట్లాడుతూ అన్ని రాష్ట్ర , జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో ''జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ '' సంస్థను బలోపేతం చేసి, వినియోగదారుల చట్టం పై ప్రజల్లో అవగాహన కల్పిస్తానని, వినియోగదారులు హక్కులకు చట్టపరంగా రక్షణ ఉంటుందని ఇందుకు ప్రత్యేకంగా '' వినియోగదారుల ప్రొడక్షన్ యాక్ట 2019 '' ను ప్రభుత్వం రూపొందించింది. ఈ విషయం వినియోగదారులకు తెలియదు. అందుకే ఎలాంటి కొనుగోలు లావాదేవీలు చేసినప్పుడలా వినియోగదారులు బిల్లులు తప్పనిసరిగా సేకరించాలి. వాలిటిడి, వారంటీ,గ్యారెంటీ ద్వారా లబ్ధి పొందాలనుకునే ఇన్ వాయిస్, ఇతర బిల్లులను చూపించాల్సి ఉంటుంది కాబట్టి కొనుగోలు చేసిన వస్తు సేవల్లో లోపాలు ఉన్నప్పుడు పరిహారిన్ని కోరే అవకాశం వినియోగదారులకు ఉంటుందని చెప్పారు. వీటితో పాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వినియోగదారులు తమ హక్కులకు సంబంధించిన పూర్తి వివరాలకు అవగాహన కలిగేలా చేస్తామని చెప్పారు.



## రాష్ట్ర గ్రంథాలయ సంస్థల చైర్మన్ రియాజ్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/మహబుబ్ నగర్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర గాంథాలయ సంస్థల చైర్మన్ మహమ్మద్ రియాద్ శుక్రవారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ను మహబూబ్ నగర్ జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ మల్లు నరసింహా రెడ్డి శాలువా కప్పి, పుష్ప గుచ్చం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ప్రవీణ్,గ్రంథాలయ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సర్టిఫికెట్ల పరిశీలన సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్ విజయేందిర

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** మహబూబ్ నగర్ పట్టణంలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ మొట్టుగడ్డ లో జరుగుతున్న డీఎస్సీ 2024 సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా సందర్శించినారు. డీఎస్సీ 2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సకాలంలో పూర్తి చేయవలెనని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో, కమిటీ సభ్యులతొ కలెక్టర్ మాట్లాడారు. పరిశీలన పూర్తయిన వెంటనే ఆ వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. ఇప్పటి వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు రాని అభ్యర్థులకు ఫోన్ ద్వారా సంప్రదించి నీ 1:3 నిష్పత్తికి ఎంపికైన అభ్యర్థులందరూ సర్టిఫికెట్లు పరిశీలన చేసుకునే విధంగా ప్రయత్నించవలెనని డీఈఓ కు సూచించారు. ఈ కార్యక్రమం లో డి.ఈ. వో రవీందర్ ,పాటు అసిస్టెంట్ డైరెక్టర్ అనసూయ, సీఎంఓ బాలు యాదవ్, బైకాని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ ,సూపరింటెండెంట్ శంభు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ వివరాలు సేకరించాలి



**ప్రజాపక్షం / జడ్చర్ల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుటుంబ సభ్యుల వివరాల సేకరణ. డిజిటల్ కార్డు జారీ ప్రక్రియ పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఇంటింటి సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు. శుక్రవారం నాడు జడ్చర్ల పట్టణంలోని వివిధ వార్డులతో పాటు మండల పరిధిలోని అల్వాన్పల్లి తదితర గ్రామాలలో ఆమె పర్యటించి అధికారులు చేపడుతున్న సర్వే గురించి వాకబ్ చేశారు. కార్యక్రమాలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్. అదనపు రెవెన్యూ కలెక్టర్ మోహన్ రావు . మండల అధికారులు మున్సిపల్ అధికారులు కౌన్సిలర్లు వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

### వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టం

# ముస్లిం సంక్షేమ మనుగడకు గొడ్డలి పెట్టు

### ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తంజీమే



**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల జీవన పునాదులను విధ్వంసం చేసు కుట్రలో భాగంగా ఆగ మేఘాల మీద తీసుకొస్తున్న వక్ఫ్ బోర్డు అమెండ్మెంట్ చట్టంలో ముస్లింల సంక్షేమానికి గొడ్డలి పెట్టుగా మారనుందని ఆల్ ఇండియా తంజీవ్ ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.డి ఫయజ్ ద్వజమెత్తారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకట్రామారెడ్డి భవన్ లో రేపటి నుంచి రెండు రోజుల పాటు జరిగే ఆల్ ఇండియా తంజీమే ఇన్సాఫ్ జాతీయ సమితి సమావేశాల ఆహ్వాన,నిర్వాహన కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఎం.డి. ఫయాజ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఉదమ్యంలో ముఖాభివృద్ధికి ముస్లిం మైనార్టీ ప్రజలు నరనరాన దేశభక్తిని నింపుకొని అనేక మంది ప్రాణ త్యాగాలకు ఒడి గట్టిన చరిత్ర ఎన్నటికీ మరవరానిదని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ సమైక్యత సమగ్రత విఘాతం కలిగించే విధంగా రాజ్యాంగ మూల సూత్రాలకు తిలోదాకలు ఇస్తూ మతం పేరా ప్రజల మధ్య వైమాస్యాలు పెంచుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో మైనార్టీల హక్కుల సాధనకై మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం వేదికగా ఈనెల 5, 6 తేదీలలో ఎనుగొండ శుభం కన్వెన్షన్ హాల్లో ఆల్ ఇండియా తంజిమే ఇన్సాఫ్ జాతీయ సమితి సమావేశాలు జరగనున్నాయని ఈ సమావేశాల సందర్భంగా రేపు వక్ఫ్ బోర్డ్ అమెండ్మెంట్ చట్టం పై జాతీయ స్థాయి సెమినార్ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఈ సెమినార్ కి ఆలిండియా తంజీమే ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ అజిజ్ పాషా, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అయూబ్ అలీ ఖాన్, అలీగడ్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్, ఇన్సాఫ్ జాతీయ గౌరవాధ్యక్షులు అహ్మద్ షేర్వాణి సాబ్, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని, మహబూబ్ నగర్ శాసనసభ్యులు యొన్నం శ్రీనివాస రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ తో పాటు ఇతర మైనార్టీ సామాజిక ఉద్యమ సారధులు మేధావుల ప్రసంగాలు ఉంటాయని, జాతీయ సమితి సమావేశాలకు 29 రాష్ట్రాల నుండి కేంద్ర పాలిత ప్రాంతాల నుండి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కనుక మైనార్టీ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్, సిపిఐ సీనియర్ నాయకులు పరమేశ్వర్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. సురేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి. రాజు, కౌన్సిల్ సభ్యులు ఎన్. శంకర్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సత్య నారాయణ రెడ్డి, ఇన్సాఫ్ నాయకులు రెహమాన్ పాల్గొన్నారు.

## అక్రమ అసైన్డ్ భూమి పట్టా రద్దు

**ప్రజాపక్షం / పెబ్బేరు :** తప్పుడు రికార్డులతో , రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని వనపర్తి జిల్లా చరిత్రలోనే అసైన్డ్ భూమి పట్టాని రద్దు చేసిన సంఘటన పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్లగా గ్రామానికి సమీపాన ఉన్న పల్లె గట్టు సర్వే నంబర్ 280/8 లో రెండు ఎకరాల భూమిని తప్పుడు ఎంట్రీలతో కబ్జా చేసుకున్నారని 2012 సంవత్సరంలో అయ్యవారిపల్లికి చెందిన గ్రామస్తులు పలుమార్లు జిల్లా కలెక్టర్ నుండి కమిషనర్ భూ పరిపాలన శాఖ హైదరాబాద్ వరకు ఫిర్యాదులు చేయగా స్థానిక తహసీల్దార్ , ఆర్డీఓ విచారణ చేసి ఉన్న రికార్డును జిల్లా రాష్ట్ర ఉన్నతాధికారులకు సమర్పించగా తప్పుడు ఎంట్రీలతో అసైన్డ్ భూమిని పొందినట్లు జిల్లా యంత్రాంగం పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికి లబ్దిదారు జ్యోతి ఎలాంటి ఆధారాలు చూపలేకపోయిందని చట్ట ప్రకారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆసైడ్ భూమి పట్టాను రద్దు చేస్తూ అక్టోబర్ ఒకటవ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గ్రామానికి చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధి హామీ పథకం ద్వారా వెంటనే ఆ భూమిలో చెట్లు నాటాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**వెంకటరత్నం నాయుడు మండల బీసీ సెల్ అధ్యక్షుడు అభిప్రాయం ...** గత 12 సంవత్సరాలుగా గ్రామం తరపున 280 సర్వే నంబర్లలో తప్పుడు ధృవీకరణ పత్రాలతో అక్రమంగా భూములు పొందిన వాటినంతటిని రద్దు చేసి ప్రభుత్వం ఆ భూమిని స్వాదీనం చేసుకొని హరితహారం లో భాగంగా పల్లె గట్టును సుందరంగా తీర్చిదిద్దాలని, సుదీర్ఘకాలం పోరాటం చేసి ప్రభుత్వ భూమిని తిరిగి స్వాదీనం చేసుకోవడం పట్ల మండల బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటరత్నం నాయుడు జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## సెప్టెంబర్ పింఛన్ ఇవ్వరా

### జనసేన పార్టీ వనపర్తి కో ఆర్డీనేటర్ ముకుంద నాయుడు

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :**ఎన్నికల నాటి కాంగ్రెస్ మెనిఫెస్టో 6 గ్యారంటీల పూర్తి అమలు ఇంకెప్పుడు వికలాంగులకు 6వేలు వృద్ధులకు 4వేలు ఎక్కడ వేస్తున్నారని ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో హామీల అమలు అన్నదానిపై ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం ఇవ్వాలని జనసేన పార్టీ వనపర్తి కో ఆర్డీనేటర్ ముకుంద నాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వృద్దులు వికలాంగులతో సహ ప్రజల్ని మభ్యపెడుతూ పాలన కొనసాగిస్తుంది. ప్రతి నెల మొదటి వారంలో అందాల్సిన పెన్షన్ డబ్బులు సెప్టెంబర్ నెల నుంచి ముగిసిపోయిన ఇంకా వృద్ధులకు తమ బ్యాంకు ఖాతాల్లోకి ఆసరా పింఛన్ డబ్బులు జమకాలేదని దానితో వృద్ధులు చాలా అవస్థలు పడుతున్నారని జనసేనా పార్టీ వనపర్తి కో ఆర్డీనేటర్ ముకుంద నాయుడు ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పించన్ డబ్బులతోనే అవే జీవనాధారంగా చేసుకొని జీవితం గడిపే వృద్ధుల కుటుంబాలు ఉన్న తరుణంలో ఇలా ఒక నెల పూర్తయి ఇంకో నెల అక్టోబర్‌లో 4 రోజులు పూర్తి కావస్తున్న వారి బ్యాంకు ఖాతాల్లో పింఛన్ డబ్బులు పడకపోతే ఏ పని చేసుకోలేని వృద్ధులు వికలాంగులు వారి జీవితం ఎలా కొనసాగిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చేయూత పథకం అమలులో ఈ జాప్యం ప్రభుత్వానికి సిగ్గుచేటని పేర్కొన్నారు.



## ఫోటోగ్రాఫర్లకు అండగా ఉంటా

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఉండే ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ తరపున చేపట్టే సావా కార్యక్రమాలు అభినందనీయమని ఫోటోగ్రాఫర్ల అభ్యున్నతికి తాను ఎల్లవేళలా సహకరిస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లందరూ వారి ఫోటో స్టూడియోలకు ఇన్సూరెన్స్ చేసుకొని ఉండాలని దాంతో ఏదైనా ప్రమాదం సంభవించిన కుటుంబాలకు ఇబ్బంది ఉండదని ఆయన సూచించారు. ఆర్థిక పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొనే ఫోటోగ్రాఫర్లలో అవసరం ఉన్నవారికి బ్యాంకు రుణాలు సైతం మంజూరు చేయించేందుకు తనువంతులు సహాయ సహకాఆరాలు అందిస్తానని ఎమ్మెల్యే ఫోటోగ్రాఫర్లకు భరోసా కల్పించారు. చెడు వ్యసనాలను దరిచేర నివ్వకుండా ఉండాలని ఎవరు కూడా చెడు మార్గంలో వెళ్లి కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టకూడదని ఆయన ఫోటో గ్రాఫర్లకు సూచించారు. అనంతరం ఆయన క్రీడాకారులతో పాటు క్రికెట్ ఆడి కార్యక్మరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ , మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ , వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, పట్టణ కౌన్సిలర్లు గోపాల్ పేట, ఇంచార్జీ సత్యశీలరెడ్డి, తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

### న్యాయవాది ఆంజనేయులు

**ప్రజాపక్షం / గోపాలపేట :** విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని న్యాయ విజ్ఞానం దేవది ఆంజనేయులు ఉన్నారు. శుక్రవారం గోపాలపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువుతో పాటు న్యాయవిజ్ఞానమైన అవగాహన , చట్టాల పైన బాధ్యత , అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రను పట్టుదలతో క్రమ శిక్షణతో చదివి లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. మహిళలు తమ చట్టాల గురించి తెలుసుకొని ఏమైనా సమస్యలు తలెత్తితే పరిష్కరించు కోవాలని సూచించారు. మహిళా చట్టాలు వారి వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రఘు , కళాశాల నిర్వాహకులు శ్రీనివాసులు , రాములు, శేషయ్య, నర్సింహ, అధ్యాపకు బృందం తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్య కోసం ఆర్థిక ఇబ్బందులు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** చదువుల తల్లి కొలువై ఉన్న కల్వరాల గ్రామంలో ఒపేదింటి విద్యార్థి వైద్య రంగంలో రాణించాలని లక్ష్యంతో ప్రతిష్టాత్మకైనా నీటి పరీక్షలో ఉన్నత ర్యాంకు సాధించి మెడికల్ కాలేజీలో సీట్ సాధించిన పేదరికంలో పుట్టిన అతనికి ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కోవటంతో వైద్య విద్యను అభ్యసించడానికి దాతల సహకారం కోసం ఎదురు చూస్తున్నాడు. కల్వరాల గ్రామానికి చెందిన బండారు దేవేందర్ అనే విద్యార్థి మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన బండారు గోవింద్ కుమారుడు దేవేందర్ చిన్నతనం నుండివిద్యలో చురుకుగా ఉంటూ చిట్యాల గురుకుల పాఠశాలలో చదువుతూ పదవ తరగతిలో 10 జిపిఏతో ఉత్తీర్ణత సాధించాడు. అనంతరం అదే గురుకుల కళాశాలలో బైపీసి విద్యను అభ్యసించి 95 శాతం ఉత్తీర్ణతతో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించి గౌలిదొడ్డి కళాశాలలో వైద్య విద్య కోసం నిర్వహించే నీటి పరీక్షకు కోచింగ్ తీసుకొని ఇటీవల విడుదలైన నీట్ పరీక్ష ఫలితాలలో 464 మార్కులు సాధించి హైదరాబాద్ సమీపంలోని భాస్కర్ మెడికల్ కాలేజీలో సీట్ సాధించారు. ఆర్థిక సహకారం అందించే దాతలు ఫోన్ నంబర్లకు 9502838026, 9704862230 ఫోన్ పే ద్వారా ఆర్థిక సాయం అందించి వైద్య విద్యకు సహకార అందించాలని వేడుకుంటున్నారు. వైద్య రంగంలో రాణించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించే తమ కుమారుడి కలలను నేర్చాలని దాతలను వేడుకుంటున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ




**ప్రజాపక్షం / పెబ్బేరు :** మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో శుక్రవారం అదనపు కలెక్టర్ సంచిత్ గంగార్ పర్యటించి గ్రామంలోని ముదిరాజ్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ , ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను తస్మాత్తుగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో చదువుతున్న చిన్న పిల్లలకు వారి ఆరోగ్యాల గురించి అంటే వయస్సు తగ్గినట్లు బరువు ఉన్నారా లేదా వారికి సెంటర్లలో అన్ని సదుపాయాలు ఉన్నాయా లేదా అని సెంటర్లకు సంబంధించిన టీచర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి రవీందర్ , రోజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ , కారోబార్ రాము, అంగన్‌వాడీ టీచర్ నర్మదా, కార్యక్రమంలో జిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లాలో డిజె నిషేధం

**ప్రజాపక్షం / వనపర్తి :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వనపర్తి జిల్లా పరిధిలో మతపరమైన ఊరేగింపుల్లో డిజే సౌండ్ ను వినియోగంపై నిషేదం విధిస్తూ జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి , జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. డీజేల నుంచి అధిక డెసిబెల్స్‌తో ఉత్పన్నమయ్యే శబ్దాల కారణంగా హృద్రోగులకు గుండెపోటు, ఇతర హృదయ సంబంధ ఇబ్బందులు వచ్చే ప్రమాదాలు ఉండటంతో పాటు చిన్న పిల్లలకు శాశ్వత వినికిడి సంబంధం సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నట్లు పలు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. అంతేకాక సామాన్య ప్రజలు, ముఖ్యంగా వృద్ధుల ఆరోగ్యం దెబ్బతింటుందనే కారణంతో ఇకపై వనపర్తి జిల్లా పరిధిలో ఊరేగింపుల్లో డిజే సౌండ్ మిక్సర్లు, యాంప్లిఫయర్ , బాణాసంచా ఉపయోగించడాన్ని నిషేదిస్తూ జిల్లా కలెక్టర్ , ఎస్పీ కీలక నిర్ణయం తీసుక్నురు. ఈ నిబంధనలు , ప్రభుత్వ అనుమతులను ఉల్లంఘిస్తే బీఎన్ఎస్ 223,280,292,293,324 బిఎన్ఎస్ 152 పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15 కింద కేసులు నమోదు చేస్తామని ఎస్పీ వెల్లడించారు. ప్రజలకు, విధుల్లో ఉండే అధికారులకు కలుగుతున్న ఇబ్బందులు, తలెత్తున్న సమస్యలను విశ్లేషించి అందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాత ఈ నిషేదాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ , ఎస్పీ వివరించారు.

## ప్రజల చెంతకు మెరుగైన వైద్యం

### ఎమ్మెల్యే వంశీకృష్ణ

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ప్రజలచెంతకు మెరుగైన వైద్యం కల్పించడం తమ బాధ్యతగా తీసుకున్నామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ప్రజలవద్దకు వైద్యం కార్యక్రమంలో శుక్రవారం లింగాల మండలంలోని ఆవుసలికుంట గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమపథకాల ఫలాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీకి కార్యకర్తలు వెన్నెముఖలాంటివారని అన్నారు. పార్టీకోసం కష్టపడినవారికి తగిన గుర్తింపు , పదవులుకూడా ఉంటాయన్నారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సదుపాయం గతంలో ఉండేదికాదని, ప్రస్తుతం తమ ప్రభుత్వం కృషిచేసి మారుమూలపల్లెల్లో సైతం వైద్య సదుపాయం అందిస్తుందన్నారు. ప్రతి కార్యకర్త తమపనిగా భావించి పనులు నిర్వహించాలన్నారు.

## 12న కొండారెడ్డిపల్లికి సిఎం

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ఈనెల 12న రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్వగ్రామమైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి రానున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. ఈనెల 12న సాయంత్రం కొండారెడ్డిపల్లికి చేరుకుంటారని అందుకు సంబంధించిన ఏర్పాట్లపై గ్రామంలో పరిశీలించినట్లు తెలిపారు. హెలిప్యాడ్‌కోసం తగిన సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్‌ప్రజాపాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్‌పార్టీ పటిష్టంకోసం కృషిచేయాలన్నారు. గిరిజన ప్రాంతమైన లింగాల మండల అభివృద్ధికి అధికనిధులు మంజూరుచేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాస్‌రావు, రాజు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పతనం ప్రారంభం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సూర్యలతకాటన్‌మిల్ కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన సూర్యప్రకాష్‌రావు కార్మికపక్షపాతి అని మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్ ఉప్పలవెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తిలక్‌నగర్‌లో కాటన్‌మిల్ అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన సూర్యప్రకాష్‌రావును ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఉప్పలవెంకటేష్ మాట్లాడుతూ గత మూడు పర్యాయాలు వరుసగా కార్మికసంఘం అధ్యక్షుడిగా ఎన్నికకావడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. నిరంతరం కార్మికుల సంక్షేమానికి పాటుపడుతున్నారు. కాబట్టి కార్మికులు సూర్యప్రకాష్‌కు పట్టంకట్టారని అన్నారు. రాష్ట్రంలో అధికారపార్టీకి పతనం ప్రారంభమైందన్నారు. కార్మికులను ప్రలోభాలకుగురిచేసినకూడా కాంగ్రెస్ అనుబంధసంఘం అభ్యర్థి ఓటమిచెందడం చూస్తే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌పార్టీకి ఓటమితప్పదన్నారు. ఈసన్మాన కార్యక్రమంలో బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోనిగణేష్, యూత్‌వింగ్ అధ్యక్షుడు వట్టెపుకిశోర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు భగత్‌సింగ్, ఎస్సిసెల్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, బిఆర్ఎస్వి కల్వకుర్తి ఉపాధ్యక్షుడు నాగరాజు, కృష్ణ,శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/అచ్చంపేట :** పట్టణంలోని బాలసదన్‌ను శుక్రవారం అదనపు కలెక్టర్ దేవసహాయం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా అక్కడున్న అనాథపిల్లలతో మాట్లాడారు. పిల్లలతో సమావేశం ఏర్పాటుచేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు నూతన దుస్తులు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివిద్యార్థి శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. చదువుతోపాటు మానసిక ఉల్లాసానికి ఆటలు ఆడాలని అన్నారు. ఆయనతోపాటు అధికారులు పాల్గొన్నారు.




## సీజన్ వ్యాధులపై అవగాహన

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని మిట్టసదగొడు, ఉల్పర గ్రామాలలో శుక్రవారం సీజన్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన నిర్వహించి వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా హెల్త్‌సూపర్‌వైజర్ రోజమ్మ మాట్లాడుతూ మన ఇంటితోపాటుచుట్టూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకొని నీటినిల్వలను లేకుండా చూసుకోవాలని , దోమలను నివారించుకోవాలని అన్నారు. ఫీవర్‌సర్వే నిర్వహించి బాధితులకు మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పట్టణంలోని ప్రభుత్వబాలికల జూనియర్ కళాశాలలో రికార్డుఅసిస్టెంట్ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో విద్యార్థిని కుటుంబీకులు షీటీమ్‌ను సంప్రదించారు. షీటీమ్ అధికారి కళాశాలకు చేరుకొని సమాచారం సేకరించారు. విద్యార్థినితో రాతపూర్వకంగా ఫిర్యాదు తీసుకున్నారు. ఈసందర్భంగా షీటీమ్ అధికారి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఫస్ట్ఇయర్ విద్యార్థినితో రికార్డు అసిస్టెంట్ అసభ్యకరంగా మాట్లాడినట్లు మాదృష్టికిరావడంతో విద్యార్థినితో ఫిర్యాదు తీసుకున్నామన్నారు. కావున పైఅధికారులకు సమాచారం ఇచ్చి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థి కుటుంబసభ్యులు రికార్డు అసిస్టెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** మండలపరిధిలోని జిల్లెల గ్రామంలో శుక్రవారం ఎముకచెన్నయ్య ఆకస్మాత్తుగా మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీసర్పంచ్ జిల్లెల రాములు తక్షణమే రూ.3వేలు మృతుని సోదరుడు గణేష్‌కు అందజేశారు. మృతుని కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో దేవాలయచైర్మన్ రవిగౌడ్, మాజీవార్డుమెంబర్లు బాల్‌జంగయ్య, సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ ఎస్సిసెల్ గ్రామ అధ్యక్షుడు మహేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎముకరవి, గ్రామయువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీహరి, జంగయ్య, నర్సింహ్మ పాల్గొన్నారు.

# రూ.10నాణేలు చలామణీలోనే ఉన్నాయి

### 'పిఎసి' కార్యక్రమంలో ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ రాజేష్‌కుమార్




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలలో రూ.10 నాణేలు చలామణీలో లేవనే అపోహలను తొలంగించేందుకు విస్తృతంగా 'పబ్లిక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్' (పిఎసి) నిర్వహిస్తున్నామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్ సర్కిల్ చీఫ్ రాజేష్‌కుమార్ తెలిపారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారం, ఎస్‌బిఐ సమన్వయంతో రూ.10నాణేల చలామణీ అంగీకార పబ్లిక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లను గురువారం (అక్టోబర్ 3), శుక్రవారం (అక్టోబర్ 4) రోజులలో నిర్వహించామని ఆయన వివరించారు. ముఖ్యంగా రూ.10 కాయిన్స్‌పై అపోహలు ఎక్కువగా ట్రేడర్లు, చిన్న వ్యాపారస్తులలో తద్వారా ప్రజలలోనూ నెలకొన్నాయని తెలియజేశారు. రూ.10నాణేలు చెల్లవని చెప్పడం రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయడమే అవుతుందని, ఈ ధోరణి సహేతుకం కాదని రాజేష్‌కుమార్ ప్రజలకు ఉద్బోదించారు. కొన్ని శక్తులు ఈ అనుమానాలు, అపోహలను రాష్ట్రాలలో వ్యాప్తింప చేస్తున్నాయని చెప్పారు. ఈ రెండు రోజులలో ఎస్‌బిఐ కనీసం 10మంది రిటైల్ కస్టమర్లలో అవగాహన పెంపొందించిందని రాజేష్‌కుమార్ వెల్లడించారు. ప్రధాన మంత్రి సన్నిధి లబ్ధిదారులు, చిన్నవ్యాపారస్తులు, కిరాణ స్టోర్ల యజమానులలో అవగాహన కల్పించేలా కరపత్రాలను కూడా పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగరం కోఠిలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద రూ.10నాణేలను తీసుకోవడం, పంపిణీ చేసే కార్యక్రమాన్ని రాజేష్‌కుమార్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని అన్ని ఎస్‌బిఐ బ్రాంచ్‌లు కూడా ఈ 'ప్రజా అవగాహనా కార్యక్రమాలను' నిర్వహించాయి.



## వేగవంతంగా డిఎస్‌సి అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలన

**ప్రజాపక్షం/యాదాద్రి** : ఉపాధ్యాయ ఎంపిక 2024 కోసం అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పక్కగా జరగాలని, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జండగే తెలిపారు. శుక్రవారం భువనగిరి పట్టణంలోని వెన్నెల కళాశాలలో ఏర్పాటు చేసిన డియస్సీ 2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరుగుతున్న తీరును కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ ఉపాధ్యాయ నియామక ప్రక్రియకి సంబందించి అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలన్నారు. మొత్తం 629 మంది అభ్యర్థులకు గాను శుక్రవారం వరకు 473 మంది అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన పూర్తి చేశామన్నారు. ఇంకా ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రాకుండా ఉన్న అభ్యర్థులు రేపు ఒక్క రోజు సమయం ఉన్నందున ఎంపికైన అభ్యర్థులు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఆరోగ్య కార్యక్రమంలో జోగులాంబ జిల్లా ముందుండాలి

**ప్రజాపక్షం / గద్వాల** : ప్రతి హెల్త్ ప్రోంగ్రాంల యందు జోగులాంబ జిల్లా ముందుండాలని డి.ఎం.హెచ్.ఓ, సిద్దప్ప పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయంలో హెల్త్ సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పి.హెచ్.సిలు అన్నీ హెల్త్ ప్రోగాంలల్లో ముందుండాలని అందులో సూపర్‌వైజర్లదే కీలక పాత్రని టార్గెట్లు, అచీవ్‌మెంట్లు, ముందుగానే తెలిసి ఉండాలని క్రింది సిబ్బంది పని చేసేలా 15 రోజులకు ఒకసారి పార్ట్ నైట్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని డెలివరీ సంఖ్యను పెంచుతూనే ప్రైవేటు డెలివరీలు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగాం ఆఫీసర్లు డాక్టర్ సంధ్యా కిరణ్ మై, డాక్టర్ నవీన్‌కుమార్ రెడ్డి, డాక్టర్ జి.రాజు, డాక్టర్ ప్రసూనరాణి, జిల్లా వైద్య సిబ్బంది డిడిఎం.రాము, ఏఎస్ఓ తిరుమలేష్ రెడ్డి, జిల్లా ఎన్సిడి కో ఆర్డినేటర్ శ్యాంసుందర్ , జిల్లాలోని పాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## 123 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

స్థల పరిశీలన చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే మందుల సామేల్



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** తుంగతుర్తి నియోజకవర్గంలోని వెలుగుపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 563, 564లలోని 123.32 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్‌లు అన్నారు. శుక్రవారం వెలుగుపల్లిలోని 123.32 ఎకరాల భూమిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటులో ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. త్వరలో ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో కలిసి శంకుస్థాపన నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఏలాంటి పరిశ్రమలు తీసుకవస్తే యువతకు ఉపయోగకరంగా ఉంటుందో అధికారులతో చర్చిస్తానని తెలిపారు. అనంతరం పక్కనే ఉన్న రుద్రమ్మ రిజర్వాయర్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి దయానంద్, సర్వే ఎయిర్ సాయికృష్ణ, ఎఆర్ఐ రవీందర్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జగదీష్‌రెడ్డిని కలిసిన నర్సింహ్మారావు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ బిఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుపులేటి నర్సింహ్మారావు, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎల్ నాగార్జునలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సోషల్‌మీడియాలో ప్రచారం చేయాలని, పార్టీ నాయకత్వం సూచించిన నియమ నిబంధనలు పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు.

## మోటకొండూరు మండల కేంద్రంలో సమస్యలు తీర్చండి

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు వినతి



**ప్రజాపక్షం/మోటకొండూరు:** మోటకొండూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గిరబోయిన మల్కయ్య నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ ఐరన్, హర్డ్ వేర్ షాపు ప్రారంభోత్సవంకు వచ్చిన సందర్భంగా నాయకులు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. మోటకొండూరు మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనములు నిర్మించాలని, స్మశాన వాటిక అసంపూర్తిగా ఉన్నదని, పశువుల వైద్యాధికారి నియమించాలని, బ్రాంచి పోస్ట్ ఆఫీస్‌ను సబ్ ఆఫీసుగా అప్ గ్రేడ్ చేయాలని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్)ను మండలంలో ఏర్పాటు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గం.ల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని, విద్యుత్ (ఏఈ) కార్యాలయాన్ని నిర్మించుటకు నిధులు మంజూరు చేయాలని, మాధవరెడ్డి యూత్ భవనమునకు నిధులు లేక అసంపూర్తిగా ఉన్నదని నిధులు మంజూరు చేయాలని, ఆలేరు నుండి వలిగొండ రోడ్డును డబుల్ రోడ్డుగా , మోటకొండూరు వయా రాయికుంట పల్లి నుండి శర్బనాపురం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని, మూటకొండూరు నుండి చాడ వరకు బీటీ రోడ్డు,మోట కొండూరు వయా బెజ్జంక భావి నుండి చాడా చందేపల్లి రోడ్డు వరకు బీటి రోడ్డు, మోటకొండూరులో ఉన్నటువంటి సబ్ మార్కెట్ యార్డును పూర్తిస్థాయి మార్కెట్ యార్డుగా చేయాలని, మండల కేంద్రంలో సీసీ రోడ్లను, అండర్ డ్రైనేజీ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరుతూ వినతి అందించారు.

# ఇక్కడి ట్రాక్టర్లకు నెంబర్ ప్లేట్లు ఉండవు...!?

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుగా ఉండడంతో తొలగింపు

కళ్ళముందే రయ్యి..రయ్యి మంటూ తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు

**ఇక్కడ రోడ్లపై తిరుగుతున్న ట్రాక్టర్లకు నెంబర్ ప్లేట్లు అంటూ ఉండవు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుగా ఉన్నాయని ట్రాక్టర్ల యజమానులు నెంబర్ ప్లేట్లను తొలగిస్తున్న పరిస్థితి. ఇలా ఒకటి కాదు... రెండు కాదు... నిత్యం వందలాది ట్రాక్టర్లు రోడ్లపై పొద్దస్తమానం రయ్యి... రయ్యి మంటూ కళ్ల ముందే తిరుగుతున్నా పోలీసులు కానీ... జిల్లా రవాణ శాఖ అధికారులు కానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో నెంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై తిరుగుతున్న ఇసుక ట్రాక్టర్లపై ప్రజాపక్షం ప్రత్యేక కథనం...**



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా కేంద్రానికి ఒక పక్క మూసీ మరో పక్క పాలేరు వాగు ఉండడంతో ఇసుక అక్రమ రవాణ అడ్డూ అదుపు లేకుండా సాగుతుంది. మూసీ పరివాహక ప్రాంతాలైన సూర్యాపేట రూరల్, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్) మండలాలతో పాటు కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గాలలోని మోతె, నూతనకల్, మద్దిరాల, అర్వపల్లి మండలాల నుండి అక్రమ మార్కులు నిత్యం పెద్ద ఎత్తున ఇసుకను రవాణ చేస్తున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇసుకను తరలించి అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా మండలాల పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పోలీసు అధికారులకు అక్రమ ఇసుక రవాణదారులు నెలవారి మాముళ్ల ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమ రవాణదారుల ఒక ట్రాక్టర్‌కు రూ. 10వేల చొప్పున ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఇలా ప్రతినెల ఒక్కోక్క స్టేషన్‌కు ఇసుక అక్రమ వ్యాపారం తోనే దాదాపు రూ. 10లక్షల ఆదాయం ఉంటుందని కింది స్థాయి అధికారులే బహిరంగంగానే చెబుతున్నారు. దీనికి బలం చేకూరేలా ఈ ప్రాంతాల్లో పని చేసేందుకు పోలీసులు పోటీలు పడుతున్న పరిస్థితి. ఎస్ఐ స్థాయి అధికారి ఉన్నత స్థాయిలో ఫైరవీలు చేసి లక్షలు ముట్టజెప్పి పోస్టింగ్‌లు పొందుతున్నారు. ఇదే విషయమై అక్రమాలకు పాల్పడుతున్న కొంత మంది అధికారులను ఇదేమని ప్రశ్నిస్తే మాకు ఈ పోస్టింగ్ ఉచితంగా రాలేదు. లక్షలు ఖర్చు చేసి వచ్చామంటూ సమాధానం చెప్పడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఆర్‌టిఏ అధికారులు వీరికన్నా తక్కువ ఏమి కాదు. నిత్యం తనిఖీల పేరుతో జేబులు నింపుకోనిపోతున్నారు.

**అక్రమ ఇసుక రవాణకు అడ్డుగా ఉండడంతో తొలగింపు**

సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లో రహదారులపై తిరిగే ఇసుక ట్రాక్టర్లకు ఒక్కదానికి కూడా నెంబర్ ప్లేట్లు ఉండవు. తమ అక్రమ వ్యాపారాలకు అడ్డుగా ఉన్నాయంటూ వారు వాటిని తొలగిస్తున్నారు. అధికారులకు అడిగినంత ముట్టజెబుతున్న అప్పుడప్పుడు కొత్తవారు తారసపడితే ఇబ్బంది అవుతుందని ఇలా నెంబర్ ప్లేట్లను తీసి పక్కకు పెడుతున్నారు. దీనికి తోడు అక్రమ ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్లను దారివెంట వెళ్లే వారు ఎవరైనా తమ చరవాణిలో పోటోలు తీసి సోషల్‌మీడియాలో పెడితే తమకు ఇబ్బంది అవుతుందని ఇలా చేస్తున్నట్లు తెలుస్తుంది.

రోడ్లపై ప్రతి నిత్యం వందలాది వాహనాలు జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో రయ్యి.. రయ్యి మంటూ కళ్ల ముందే తిరుగుతున్న సంబంధిత పోలీసులు కానీ... జిల్లా రవాణశాఖ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ఈ ఇసుక ట్రాక్టర్లతో రోడ్లపై ఇనేక మంది అమాయక ప్రజలు ప్రాణాలు గాలిలో కలిశాయి. నెంబర్ ప్లేటు లేకపోవడంతో ప్రమాదానికి పాల్పడిన వారిని గుర్తించలేకపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. జిల్లా ఉన్నత అధికారులు ఉండే సూర్యాపేట జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగతా ప్రాంతాల్లోని పరిస్థితి మరింత దారుణం. సూర్యాపేట పట్టణ నడిరోడ్డున వాణిజ్యభవన్ సెంటర్‌లో పదుల సంఖ్యలో నెంబర్ లేని ట్రాక్టర్లు ఇసుకను తీసుకవచ్చి అమ్మకానికి గంటల తరబడి అక్కడ నిలిపి ఉన్నా పట్టించుకునే నాధుడు లేదు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణ తరలిస్తున్న నెంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్లను సీజ్ చేసి సంబంధిత యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మత్స్యకారుల ఎదుగుదలే లక్ష్యం

**ప్రజాపక్షం / గద్వాల :** మత్స్యకారుల ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడం కోసం చేపల పెంపకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంగాల చెరువు రిజర్వాయిర్‌లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులు అభివృద్ధి చేందాలనే ఉద్దేశంతో రిజర్వాయిర్‌లో సుమారు 65 వేల చేప పిల్లలను వదలడం జరిగిందని చేపపిల్లల్లో కట్లు, బొచ్చు,శీలావతి,మృగలు, వంటి నాలుగు రకాల చేప పిల్లలు ఉన్నాయని అన్నారు. అనంతరం గద్వాల ఎమ్మెల్యే మాట్లాడు తూ మత్స్యకారులు ఆర్థికంగా ఎదగేలా మత్స్యకారుల సంక్షేమ పథకం ద్వారా ప్రభుత్వం వంద శాతం రాయితీపై చేప పిల్లలను సరఫరా చేస్తుందన్నారు. ఈ విధానంలో అన్నీ చెరువులను అభివృద్ధి చేసి చేప పిల్లలను పెంచేందుకు అనుకూలమైన వాతావరణం ప్రభుత్వం కల్పింస్తుందన్నా రు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ డిప్యూటి డైరెక్టర్ సుజాత, అసిస్టెంట్ డైరెక్టర్ షకీలా భాను, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన పాలక మండలి

**ప్రజాపక్షం / అలంపూర్ :** ఐదవ శక్తి పీఠం జోగులాంబ దేవాలయంలో శుక్రవారం దేవాలయం చైర్మెన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి మరియు కమిటి సభ్యులు పూజలు నిర్వహించిన అనంతరం ఏఐసిసి కార్యదర్శి,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డా,ఎస్.ఏ. సంపత్ కుమార్ అధ్యర్యంలో ప్రమాణ స్వీకారం చేసి కొలువుదీరారు. వీరి వెంట కాంగ్రేస్ శ్రేనులు మరియు అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వసతులు సమకూర్చుకోవాలి.. పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలి

డిఎస్‌సి సర్టిఫికెట్ల కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ** : చీకట్లో మొబైల్ లైట్ వెలుగులో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేస్తున్నారని కథనాన్ని 'ప్రజాపక్షం దిన పత్రిక' శుక్రవారం ప్రచురించడం జరిగింది. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి డైట్‌లోని సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని సందర్శించారు. సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా అన్ని రకాల వసతులు సమకూర్చుకొని సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయకుండా నిర్లక్ష్యం చేసిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన డిఎస్సి ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో గత మూడు రోజుల నుండి పరిశీలిస్తున్నారు. పరిశీలన కేంద్రంలో గురువారం కురిసిన ఈదురు గాలులు, భారీ వర్షంతో విద్యుత్ అంతరాయం ఏర్పడి అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను మొబైల్ లైట్ వెలుగు లోనే పరిశీలన చేయించుకొని తీవ్ర ఇబ్బందులు పడటం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రంలో అన్ని వసతులు సమకూర్చుకొని సర్టిఫికెట్లను పకడ్బందీగా వెరిఫికేషన్ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎవరైనా అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కానట్లయితే అలాంటి వారి దరఖాస్తులలోని ఫోన్ నెంబర్ ఆధారంగా ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకొని నిర్ధారించుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చేయకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి బిక్షపతి ఉన్నారు.

## కెసిఆర్, బిఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మాజీ సిఎం కెసిఆర్, బిఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ సభ్యత్వ బీమా, సిఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసిఆర్‌ది నిర్మాణ్మాత్మకమైన ఆలోచన అని కాంగ్రెస్ పార్టీది కూలగొట్టే అరాచక పాలన అని చెప్పారు. ఇల్లు ఇస్తారని నమ్మి ప్రజలు ఓట్లేస్తే ఉన్న ఇల్లు కూలగొట్టే పరిస్థితి నెల కొందన్నారు. రైతు భరోసా లేదు ఉన్న రైతుబంధు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అభివృద్ధి చేయడం చేతకాకనే కాంగ్రెస్ పాలకులు అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది ఎవరో.. ఆగం చేసిందేవరో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. హంస పాలను నీళ్లను వేరు చేసినట్లు ప్రజలే మంచిచెడును నిర్ణయిస్తారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, నాయకులు వై వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, రామగిరి నగేష్, జానీ యాదవ్ పాల్గొన్నారు.

## నాణ్యమైన ధాన్యాన్నే కేంద్రాలకు తీసుకురావాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టర్:** రైతులు ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే ఖాతాల్లో నగదు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై జిల్లాలోని వ్యవసాయ అధికారులు, ఐకెపి, మెప్మా, పిఏసిఎస్, డెడా ఎంట్రి ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వడ్లకు మద్దతు ధరపై రూ. 500 బోనస్ ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పిఏసిఎస్ ఆధ్వర్యంలో 63 కొనుగోలు కేంద్రాలు, ఐకెపి ఆధ్వర్యంలో 129 కేంద్రాలు, మెప్మా ఆధ్వర్యంలో 13 కేంద్రాలతో జిల్లాలో 206 ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 15లోపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్తాలు తూకంలో తరుగులు తీశారని తెలిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వహకులను హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులో చెక్ పోస్టు ఏర్పాటు చేసి 24 గంటలు పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లా అధికారులతో ఆకస్మిక తనిఖీలు చేపడుతామని ఏమైనా అవకతవకలు జరిగే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, జిల్లా సివిల్ సప్లై అధికారి డి రాజేశ్వర్ రావు, సివిల్ సప్లై డీఎంటిఎస్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఇన్ చార్జీ జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, ఎఈఓలు, పిఏసిఎస్ అధికారులు, ఐకెపి నిర్వహకులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదుల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** భారత స్వాతంత్ర పోరాటం నుండి తెలంగాణ విముక్తి వరకు జరిగిన ప్రతి పోరాటంలో ప్రజాస్వామిక ఉద్యమాలలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని తెలంగాణ జన సమితి ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ అన్నారు. శుక్రవారం తెలంగాణ జన సమితి లీగల్ సెల్ జిల్లా కమిటీ నిర్మాణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు సమాజాన్ని ప్రభావితం చేయగల శక్తులన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాల కాలంలో కనీస ప్రజాస్వామిక విలువలు లేకుండా కెసిఆర్ అణిచివేత పాలన సాగించారని ఆరోపించారు. డబ్బులు, అవినీతి చుట్టూ అధికారాన్ని తిప్పి రాజకీయాలను కలుషితం చేశారన్నారు. లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కుంచం చంద్రకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్,బచ్చలకూరి గోపి, వీరేష్ నాయక్, బొజ్జ అనిల్, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్, నవీన్, లోకేష్ పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ జన సమితి లీగల్ సెల్ నూతన కమిటీ అధ్యక్షుడిగా కుంచం చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శిగా షెక్ నాగుల్ పాషా, ఉపాధ్యక్షులుగా వీరేష్ నాయక్, అనిల్, వేణురాజు, సహాయ కార్యదర్శులుగా మంగు నాయక్, సుధాకర్ గౌడ్, సతీష్ యాదవ్‌లను నియమించారు.

అక్రమ పట్టాను తొలగించి..

## రైతులకు పట్టాలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/గుర్రంపోడు :** నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల పరిధిలోని పాల్వాయి గ్రామంలో ఇతరుల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే పాల్వాయి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి నల్ల శ్రీరాములు అదే గ్రామానికి చెందిన 30 కుటుంబాలకు చెందిన 22 ఎకరాల పట్టా భూములను వారికి తెలియకుండా అక్రమంగా తమ కుటుంబ సభ్యులందరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు.అదే విషయమే శుక్రవారం బాధితులు తహశీల్దార్ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. సర్వే నెంబర్లు 109, 110, 119, 120, 121, 138, 139లు పట్టా భూములు కాగా, సర్వే నెంబర్ 142, 154, 217, 417లలో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని సైతం అక్రమంగా పట్టా మార్పిడి చేసుకున్నాడు. రైతు బంధు డబ్బుల కోసం ఇతరులు భూముల్ని అక్రమంగా పట్టా చేసుకున్న కుటుంబ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అక్రమ పట్టాను తొలగించి కాస్తు కబ్జాలో ఉన్నటువంటి రైతులకు పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



## తప్పులకు ఆస్కారం లేకుండా ధాన్యం సేకరణ

సన్నధాన్యం బస్తాలకు రెడ్ కలర్.. దొడ్డు రకం బస్తాలకు గ్రీన్ కలర్ సుతిల్‌తో కుట్టాలి

కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :** ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా నూటికి నూరు శాతం వానకాలం ధాన్యం సేకరణ చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. 2024/25 ఖరీఫ్ ధాన్యం సేకరణ పై శుక్రవారం అయన మండల స్థాయి బృందాలతో కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండా పోలీస్ అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, చెక్ పోస్టుల వద్ద తనిఖీని కట్టుదిట్టం చేయాలన్నారు. జిల్లాలో దాన్యం తీసుకువెళ్లే వాహనాలకు ప్రత్యేకంగా స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, ఇతర రాష్ట్రాల నుండి ఎట్టి పరిస్థితులలో ధాన్యం జిల్లాలోని కొనుగోలు కేంద్రాలలో అమ్మడానికి వీలులేదని, ఈ విషయంపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని పునరుద్ఘాటించారు. ఈ సంవత్సరం నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయడం, జిల్లాలో అత్యధిక సామర్థం ఉన్న రైస్ మిల్లులు ఉండడం, ఎక్కువ సంఖ్యలో మిల్లులు ఉండడం , గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 20 వేల ఎకరాలు అదనంగా వరి పండించడం జరిగిందని,దీనితో పాటు ప్రభుత్వం సన్న ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ప్రకటించడం వంటి కారణాలవల్ల ఈ సంవత్సరం రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాలో అత్యధికంగా వరి పంట మార్కెట్‌కు రానుందని అన్నారు. ట్రక్ సీట్ పై స్పష్టంగా సన్నధాన్యం, దొడ్డు ధాన్యం అని రాయాలని, సన్నధాన్యం బస్తాలను రెడ్ కలర్ సుతిల్‌తో కుట్టాలని, దొడ్డు రకం బస్తాలను గ్రీన్ కలర్ సుత్లి తో కుట్టాలని, అంతేకాక సన్నధాన్యం బస్తాలపై ఎస్ అని రెడ్ ఇంకుతో రా యాలని సూచించారు. మిల్లర్లు సైతం సన్నధాన్యం మిల్లింగ్ వేరుగా ,దొడ్డు ధాన్యం మిల్లిం గ్ వేరుగా ఉంచాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లోఅదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా కేంద్రం నుండి పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ ,డిఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, జిల్లా సహకార శాఖ అధికారి పథ్యా నాయక్, దేవరకొండ ఆర్‌డిఓ శ్రీరాములు, చండూరు ఆర్‌డిఓ సుబ్రహ్మణ్యం, నల్లగొండ ఇంచార్జ్ ఆర్‌డిఓ శ్రీదేవి ,డిఎస్‌పిలు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు




**ప్రజాపక్షం/దేవరకొండ** : మండల పరిధిలోని కొండభీమనపల్లి గ్రామ పరిధిలో ఉన్న రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన నల్గొండ జిల్లా ఆయిల్ ఫామ్ రైతుల అవగాహన సదస్సు ఉద్యాన వనశాఖ వారి సహకారంతో పతాంజలి పుడ్స్ లిమిటెడ్ కార్యక్రమంలో దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్‌కు శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయల్ ఫామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో రైతులు ఎక్కువ లాభాలు ఆర్జించేందుకు అవకాశముందని అన్నారు. రైతులు సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ ఫామ్ మొక్కలు నాటిన తర్వాత నాలుగో సంవత్సరం నుండి దిగుబడులు ప్రారంభం అవుతాయని, 25 సంవత్సరాల వరకు మొక్క దిగుబడి ఇస్తూ రైతులకు ఆదాయాన్ని ఆర్జించి పెడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మాజీ ఎంపిపి జాన్‌యాదవ్, మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సినియర్ నాయకులు దేవేందర్, ప్రజా ప్రతినిధులు, యువజన విభాగ నాయకులు, రైతులు, హార్టికల్చర్ అధికారులు, డిహెచ్ఎస్‌వో సాయిబాబా, ఏపిడి శ్రీనివాస్, డిజిఎం యాదగిరి, సుబ్బరెడ్డి, కిరణ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ వినియోగించుకోవాలి : ఎఇ

**ప్రజాపక్షం/కొందుర్గు:** మంచి నీటి సహాయకులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జయశ్రీ కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో కొందుర్గు, జిల్లేడ్‌చౌదరిగూడ మండలాలకు సంబంధించి మంచినీటి సహాయకులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారానికి మూడో రోజుకు చేరుకుంది. శిక్షణలో మంచినీటి పైప్‌లైన్లను జాయింట్ చేసే విధానం, మోటర్ రిపేర్ చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో చౌదరిగూడ ఎంపిడిఒ ప్రవీణ్‌కుమార్, కొందుర్గు ఎంపిఒ లాలయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

హైదరాబాద్ రంగారెడ్డి

## అధికారులకు సహకరించాలి : ఆర్‌డిఓ

**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ హెల్త్‌కార్డుల పైలెట్ ప్రాజెక్టుకు ప్రజలందరూ అధికారులకు సహకరించాలని షాద్‌నగర్ ఆర్‌డిఓ వెంకట మాధవరావు కోరారు. శుక్రవారం కొత్తూరు మున్సిపాలిటిలోని 4వ వార్డు ఎంపిక చేశారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌డిఓ వెంకట మాధవరావు నాల్గవ వార్డులో 178కుటుంబాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలకు వచ్చిన అధికారులకు ప్రజలందరూ సహకరించి పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐలు సంజీవ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హక్కుల సాధన కృషి

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పునమోని శ్రీనివాసులు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనకు కృషి చేస్తానని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పునమోని శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక ప్రధాన ఎన్నికల అధికారి శ్యామ్, ఉప ఎన్నికల అధికారి డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. అధ్యక్షుడిగా కొప్పునమోని శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.రామాంజనేయులు, జనరల్ సెక్రెటరీగా సునీల్‌రాజ్, కోశాధికారిగా నామాల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ఎన్నికైన సభ్యులకు ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కె.శీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులకు, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కలిముద్దీన్ హైమద్, రంగారెడ్డి జిల్లా టిజిఓ అధ్యక్షులు రామారావు, సిద్దిపేట జిల్లా టిజిఓ అధ్యక్షులు శ్రీరామ్‌రెడ్డి, రాష్ట్రంలో వివిధ జిల్లాలలో పని చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యసేవలతో గుర్తింపు

మదర్ డైరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురం డివిజన్‌లోని నాగార్జున కాలనీ నాగర్జున సాగర్ జాతీయ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ విజన్ ఐ హాస్పటల్‌లో అత్యధిక ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని మదర్ డైరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, బిసి సంఘం జాతీయా అధ్యక్షులు జాజుల శ్రీనివాస్, గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనస్థలిపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వైద్య అసుపత్రి నిర్వహాకులు పి.సుమంత్, గంగిడి విజయ్‌రెడ్డి, గంగి రాజు, డాక్టర్ లక్ష్మి ప్రసన్నలతో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరుగైన వైద్యసేవలతో డాక్టర్లకు గుర్తింపు ఉంటుందన్నారు. ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలందించాలని కంటి వైద్య అసుపత్రి నిర్వహాకులకు సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సేంద్రీయ ఎరువుగా తడి చెత్త



**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** తడి చెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చుకోవాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం10,11,12వ డివిజన్‌లో తడి పొడి చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ తడి చెత్తను సేంద్రీయ ఎరువుగా తయారుచేసి డిఆర్‌సిసి సెంటర్‌కు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు యాదగిరి, తౌఫీక్, నరేందర్, జగన్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండల దత్తాయపల్లిలో గత సోమవారం మృతి చెందిన కానుగుల రాములు కుటుంబానికి శుక్రవారం దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ ఎంఎల్‌ఏ అంజయ్యయాదవ్ 5 వేలు, మాజీ జడ్పిటిసి విశాలశ్రావణ్‌రెడ్డి 5 వేలు, పోతర్ల మల్లేష్ 5 వేలు, మాజీ జడ్పిటిసి పల్లె నర్సింగ్‌రావు 3 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దాతలు అందించిన ఆర్థిక సహాయాన్ని గ్రామ నాయకులు భాధిత కుటుంబానికి అందజేశారు.

## యువత స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలి

కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి





**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** యువత స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలని వనస్థలిపురం, బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ లోని పంచాయతీ టీచర్స్ కాలనీ ఫేస్3లో నూతనంగా ఏర్పాటు చేసిన భువన డెవలపర్స్ కార్యాలయాన్ని శ్రీఈడ్ ఇండియా హౌసింగ్ ప్రైవేటు లిమిటేడ్ ఎండి నేనావత్ వంశీ, ఆర్ ఔకె ఇన్ ఫ్రా బిల్డర్ మద్ది రామకృష్ణారెడ్డిలు యజమాని మెగావత్ సీతారాంతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం ఉపాధితో వ్యాపారరంగాల్లో యువత రాణించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో విజయ్, రాజు, మోహన్, సురేందర్‌రెడ్డి, మాధవి, రజియ తదితరులు పాల్గొన్నారు.

# కెబిఆర్ ఫ్లైఓవర్, అండర్‌పాస్‌లకు ఓకె

రూ.826 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంతో తొలగనున్న ట్రాఫిక్ ఇబ్బందులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కె.బి.ఆర్ పార్కు ఫ్లైఓవర్‌ల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కెబిఆర్ పార్కు చుట్టు ఉన్న ఆరు జంక్షన్‌లలో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొన్న విషయం తెల్సిందే. ఫ్లైఓవర్లు నిర్మించి, సిగ్నల్ రహితంగా ఈ జంక్షన్‌లను మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.826 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం మంజూరు చేశారు. హైచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఈ పనులు చేపట్టనున్నారు. ఈ పార్కు చుట్టూ ఉన్న ఆరు జంక్షన్‌ల వద్ద ఈపనులు పూర్తయితే నగరంలోని వివిధ ప్రాంతాలనుంచి మాదాపూర్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాలకు వెళ్లేవారికి ట్రాఫిక్ చిక్కుముళ్లు తొలగిపోనున్నాయి. ఈ పనులు పూర్తయితే సిగ్నల్‌ఫ్రీగా ప్రయాణాలు సాగించేందుకు అస్కారం ఏర్పడుతుంది. ఫ్లైఓవర్‌లతో పాటు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు పనులను రెండు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

### పాత నగరం కొత్త నగరానికి అనుసంధానం చేసే ఫ్లైఓవర్లు..

హైదరాబాద్ జంటనగరాలకు హైటెక్‌సిటీ వైపు వెళ్లేందుకు కె.బి.ఆర్ పార్కు చుట్టు ఉన్న రహదారినే ప్రధాన మార్గంగా ఉంది. కె.బి.ఆర్. పార్కు చుట్టు ఉన్న ఈ రహదారిలో ఆరు ప్రధాన జంక్షన్‌లు ఉన్నాయి. వీటిని దాటుకొని వెళ్లాలంటే వాహనదారులు ప్రతిరోజు నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్‌లలో ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు వెళ్లాలంటే ఈ జంక్షన్‌ల మీదుగానే ప్రయాణించాల్సిన ఉంటుంది. దీంతో విపరితమైన ట్రాఫిక్ రద్దీ ఈ జంక్షన్‌లలో పెరిగిపోయింది. ప్రస్తుతం ఈ జంక్షన్‌లలో ట్రాఫిక్ సిగ్నల్స్, యుటర్న్‌లతో నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్‌ను సరళికరించాలంటే ఆరు జంక్షన్‌లలో ఫ్లైఓవర్‌లు నిర్మించాల్సి అవసరం ఉందని జిహెచ్ఎంసి వివిధ అధ్యయనాల ద్వారా తెల్చింది. దీనితో ఆరు చోట్ల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. జిహెచ్ఎంసి అధికారులు రెండు ప్యాకేజీలుగా నిర్మించాలని రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రెండు ప్యాకేజీలలో కె.బి.ఆర్. పార్క్ చుట్టూ ఉన్న ఆరు జంక్షన్‌లలో గ్రేడ్ సెపరేటర్లు మొత్తం రూ. 826 కోట్లతో నిర్మించనున్నారు. జంక్షన్‌లలో మొత్తం కె.బి.ఆర్. పార్కు చుట్టూ ఎక్కడా సిగ్నల్ లేకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేలా ఫ్లైఓవర్ల డిజైన్‌లు రూపకల్పన చేశారు.







### ప్యాకేజీ - 1

**జూబ్లీ హిల్స్ చెక్ పోస్ట్ జంక్షన్**

1. రోడ్డు నంబర్ 45 నుండి కె.బి.ఆర్. పార్కు, యూసుఫ్‌గూడ 421.00 వరకు వై ఆకారంలో అండర్‌పాస్
2. కెబిఆర్ పార్కు ప్రవేశ మార్గం జంక్షన్ నుండి రోడ్ నెంబర్ 36 వైపు 4 లేన్ ఫ్లైఓవర్.
3. యూసుఫ్‌గూడ వైపు నుండి రోడ్ నెంబర్ 45 జంక్షన్ వైపు 2 లేన్ ఫ్లైఓవర్

**కెబిఆర్ పార్కు ప్రవేశం, ముగ్ధా జంక్షన్**

1. జూబ్లీ హిల్స్ చెక్‌పోస్ట్ నుండి క్యాన్సర్ ఆస్పత్రి జంక్షన్ వైపు 2 లేన్ అండర్ పాస్.
2. పంజాగుట్ట వైపు నుండి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 3 లేన్ యూని డైరెక్షనల్.
3. కెబిఆర్ పార్కు ఎంట్రన్స్ జంక్షన్ నుండి పంజాగుట్ట వైపు 3 లేన్ అండర్ పాస్

### ప్యాకేజీ - 2

రోడ్ నెంబర్ 45 జంక్షన్ 2 లేన్ అండర్ పాస్ ఫిల్మ్ నగర్ జంక్షన్ నుండి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు
జూబ్లీ హిల్స్ చెక్‌పోస్ట్ నుండి రోడ్ నెంబర్ 45 వైపు 2 లేన్ ఫ్లైఓవర్. 405.00
ఫిల్మ్‌నగర్ జంక్షన్ 2లేన్ అండర్‌పాస్ మహారాజా అగ్రసేన్ జంక్షన్ నుండి రోడ్ నెంబర్45 జంక్షన్ వైపు.
ఫిల్మ్ నగర్ జంక్షన్ నుండి మహారాజా అగ్రసేన్ జంక్షన్ వైపు 2 లేన్ ఫ్లైఓవర్.
మహారాజా అగ్రసేన్ జంక్షన్ 2 లేన్ అండర్‌పాస్ క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ నుండి ఫిల్మ్ నగర్ జంక్షన్ వైపు
ఫిల్మ్‌నగర్ జంక్షన్ నుండి రోడ్ నెంబర్ 12 వైపు 2 లేన్ ఫ్లైఓవర్
క్యాన్సర్ ఆస్పత్రి జంక్షన్ 2 లేన్ అండర్‌పాస్ కెబిఆర్ పార్క్ వైపు నుండి మహారాజా అగ్రసేన్ జంక్షన్ వైపు
మహారాజా అగ్రసేన్ జంక్షన్ నుండి రోడ్ నెంబర్ 10 వైపు 2 లేన్ ఫ్లైఓవర్.

## 'గార్బేజ్ ఫ్రీ సిటీ'గా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక

జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'గార్బేజ్ ఫ్రీ సిటీ'గా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. అదనపు, జోనల్ కమిషనర్లతో శుక్రవారం కమిషనర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పక్రియను మెరుగుపరచి, గార్బేజ్ ఫ్రీ సిటీగా చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గతంలో పారిశుద్ధ్యం మెరుగునకు తీసుకున్న చర్యలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించాలన్నారు. అవసరమైతే జోనల్ కమిషనర్లు, ఎస్.ఎస్.డబ్ల్యూ ఇంజనీర్లతో చర్చించి, తుది నివేదికను రెండు రోజుల్లో అందచేయాలని అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం)ను ఆదేశించారు. మార్కెట్‌ల వద్ద వ్యర్థాలను ఒకే చోట వేసే విధంగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కమర్షియల్ స్ట్రేచేస్ వద్ద లిట్టర్ బిల్‌లను ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో జోనల్ లెవెల్‌లో పూర్తిస్థాయిలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. వాటర్ వర్క్స్, ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపట్టి పూర్తయిన నేపథ్యంలో కాంట్రాక్టర్ వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించే విధంగా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గార్బేజ్ ఫ్రీ సిటీలో ఇతర శాఖల సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. జిహెచ్ఎంసి వ్యాప్తంగా కాంట్రాక్టర్‌లు అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు జోనల్ స్థాయిలో కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి పనులు పూర్తి చేసే విధంగా కృషి చేయాలని జోనల్ కమిషనర్‌లకు కమిషనర్ ఆదేశించారు. పనులు పూర్తి కాకపోవడానికి గల కారణాలు వివరాలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అంతేకాకుండా ప్యాకేజీ పరంగా టెండర్లు పిలిస్తే పనులు వేగవంతంగా అయ్యే అవకాశాలపై కూడా ఆలోచించాలని జోనల్ కమిషనర్ కోరారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లకు సంబంధించి ఆస్తి పన్ను చెల్లింపులు డిప్యూటీ కమిషనర్లు వెళ్లినప్పుడు సమీపంలో అక్కడ పారిశద్ధ్య రిస్థితి పరిశీలించి, లిట్టర్ బిన్ ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛ ఆటో వాహనాలు జిపిఎస్ లింక్ ఇచ్చినందున రూట్ మ్యాప్ తయారు చేసి స్వచ్ఛ ఆటో రూట్ మ్యాప్ ప్రకారంగా ఇంటింటికి చెత్త సేకరణ పూర్తి స్థాయిలో చేసే విధంగా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లు ఆదేశించారు. నీటి వనరుల వద్ద, నాలాల వద్ద కూడా ఫ్లోటింగ్ మెటీరియల్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. గార్బేజ్ ఫ్రీ సిటీగా ఉండటానికి ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు.

## 'క్రిప్టో కరెన్సీ'పై ఆరోపణలు ఎదుర్కొన్న టీచర్లకు హైకోర్టు బెయిల్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** క్రిప్టో కరెన్సీ దందా చేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొని అరెస్టు అయిన నిర్మల్‌కు చెందిన పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసినట్టు న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ తెలిపారు. పోలీసులు ఈ కేసును సుమోటోగా తీసుకుని 34 రోజులు జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న వీరిపై ఏ ఒక్క ఫిర్యాదు వ్యతిరేకంగా నమోదు కాకపోవడంతో బెయిల్ ఇస్తున్నట్టు హైకోర్టు పేర్కొన్నదని ఆయన వెల్లడించారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం పలువురు న్యాయవాదులతో కలిసి ఆయన మాట్లాడారు. క్రిప్టో కరెన్సీలో ఎవరైనా పెట్టుబడులు పెట్టవచ్చని సీనియర్ న్యాయవాది ఎంపి.కశ్యప్ ఈ కేసుపై వాదనలు వినిపించారని న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు బి.రాజేశ్వరి, ఎం.హేమలత, డి. సునీత యాదవ్, సిహెచ్. సుభద్ర, డి. విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.



## పేదల పక్షపాతి ఇంద్రారెడ్డి

మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** నిరుపేదల అభ్యున్నతికి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు నిరంతరం తపించిన ఇంద్రారెడ్డిని ఈప్రాంత ప్రజలు మరువలేరని మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం దివంగత నేత పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతిని చేవెళ్ల నియోజకవర్గం పరిధిలో ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని కౌకుంట్ల గ్రామం పరిధిలోఉన్న ఇంద్రన్న సమాధి వద్ద కుమారులు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ లతో కలిసి నివాళులర్పించారు. అంతకుముందు చేవెళ్ల, ఇంద్రారెడ్డి నగర్, చిట్టం పల్లి గేటు వద్ద దివంగత ఇంద్రారెడ్డి విగ్రహాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకర్‌పల్లి మండలం మీర్జాగూడ గ్రామం పరిధిలోని ఇంద్రారెడ్డి నగర్‌లో స్థానిక నాయకులు, ప్రజాపతినిధులతో కలిసి ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## అభివృద్ధి పనులకు సహకరించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కేశంపేట:** అభివృద్ధి పనులకు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండలం వేములనర్వ పరిధిలోని బలిజరాళ్లతండా, తొమ్మిదిరేకుల పరిధిలోని బాల్య తండాలో ప్రభుత్వ నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. మారుమూల పల్లెలు, తండాలకు అన్ని విధాలుగా వసతులతో పాటు రోడ్లను బాగు చేస్తామని, ప్రజలకు విద్య, వైద్యం పూర్తి స్థాయిలో అందజేసేందుకు ప్రభుత్వం దృడసంకల్పంతో ఉందని తెలిపారు. నిరుపేదలు, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

**వాటర్ ప్లాంటు ప్రారంభం...** బాల్య తండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందజేయాలనే మండల పరిధిలోని వ్యాపారవేత్త, కాంగ్రెస్ నాయకుడు కొట్టం శశివర్ధన్‌రెడ్డి తన తాత, తండ్రుల జ్ఞాపకార్థం తన స్వంత డబ్బులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్లాంటు ఏర్పాటు చేసిన దాత శశివర్ధన్‌రెడ్డిని అభినందించారు. అనంతరం కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రెషర్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్, మాజీ మర్కెట్ చైర్మెన్ యాదయ్యయాదవ్, మాజీ జడ్పిటిసి విశాలశ్రావణ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయమ్మ, నాయకులు గిరి యాదవ్, శ్రీధర్‌రెడ్డి, రూప్లానాయక్, కరుణాకర్‌రెడ్డి, లాలమోని చంద్రయ్య, తైద పర్వతాలు, కోదూరి రాములులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్ మండలంలో..** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని గొల్లకుంట తండా, జిడిగడ్డ తండాలకు ప్రభుత్వ నిధులతో నిర్మించతలపెట్టిన బీటీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే గిరిజనుల అభివృద్ధి పథంలో నడిచారని, గిరిజన తండాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యతనిస్తామని ఎంఎల్‌ఏ స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు యాదయ్యయాదవ్, తిరుపతిరెడ్డి, శ్రీనునాయక్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, జాంగారి రవి, జంగయ్య, గణేష్‌గౌడ్, మధుసూధన్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్, ముకుందగౌడ్, తిరుపతి యాదవ్, వెంకటేష్‌గౌడ్‌లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్యం దిశగా వెళ్తే విజయాలు వెన్నంటే

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** క్రీడాకారులు లక్ష్యం ఎంచుకొని ఆ దిశగా వెళ్తేనే విజయాలను అందుకునేందుకు అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని మినీ స్టేడియంలో బిఆర్ఎస్ యువ నాయకుడు నందారం అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ చోర్నమెంట్‌ను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా భావిస్తూ ముందుకు వెళ్తేనే విజయాలను అందుకుంటారన్నారు. క్రీడలతో ప్రాంతాలు, వ్యక్తుల మధ్య స్నేహ సంబంధాలు పెరుగుతాయని తెలిపారు. క్రీడా కారులకు ఎల్లప్పుడు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, ఈ విషయాన్ని ప్రతి క్రీడాకారులు గుర్తించాలని సూచించారు. జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో 70 జట్లు పాల్గొనడం ఎంతో అభినందనీయమని, క్రీడా స్ఫూర్తిని చాటి చేప్పేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. నిర్వాహకుడు నందారం అశోక్ సమాజ సేవలో పాల్గొన్నడం ఎంతో అభినందనీయమని, భవిష్యత్ ఎంతో ఉందని, ముమ్ముందుకు మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుగా స్పందించడం నంగారం అశోక్ యాదవ్ గొప్పతనం అని పేర్కొన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నారంటే ఎంతో గొప్పవిషయమని, ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ నటరాజన్, మాజీ జడ్పివైస్ చైర్మెన్ ఈట గణేష్, నేతలు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ బచ్చలి నర్సింలు, మహ్మద్ అజాజ్, సుధీర్, మహేష్ మాల, కబీర్, శివ, మున్నాతో పాటు క్రీడాకారులు ఉన్నారు.

## ఆలయాల పరిరక్షణకు సహకారం

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** ఆలయాల పరిరక్షణకు సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జానంపేటలో ఉన్న శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నూతన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎలా సాగుతున్నాయనే విషయాలను ఆలయ పూజరులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఒగ్గు కిశోర్, కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, భూపాల్‌తోపాటు భక్తులు పాల్గొన్నారు.



## విచ్చలవిడిగా అనుమతిలేని షెడ్లు

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేటలో అక్రమనిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. సింహపురి కాలనీలో మూడు అనుమతిలేని షెడ్లు, అనుమతులకు మించి తొమ్మిది నిర్మాణాలు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, శికరా స్కూల్, సారేగుడెం దగ్గర అనుమతి లేని రెండు భారీ షెడ్లు నిర్మిస్తున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారు లు చర్యలు తీసుకోవాలని సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



# మహానగరి

మేడ్చల్ మల్కాజ్‌గిరి | వికారాబాద్

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఇళ్లల్లో పాడై పోయిన దేవతా విగ్రహాలను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని అలా చేస్తే దేవతలను అగౌరవ పరచటమేకాక శానిటైజేషన్ సమస్య తీవ్రమవుతుందని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ప్రజలకు సూచించారు. సర్దార పటేల్ నగర్‌లో జిహెచ్ఎంసి పారిశుద్ధ విభాగ అధికారులు, సిబ్బందితో కల్సి ఇంటింటకి తిరుగుతూ పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. శానిటైజేష్ విభాగ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది గిరి, బాలమణి, రవి, రాజు, నందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ప్రజాభివృద్ధి కార్యక్రమాల్లో అన్ని వేళలా అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్‌లోని బాబానగర్‌లో 17 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, వాటర్ వర్క్స్ ఏఈ వేణుగోపాల్, బిఆర్ఎస్ శ్రేణులు శ్రీశైలం, విగ్నేష్, ప్రవీణ్, మహేందర్ ఉస్మాన్, దయాకర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మరమ్మత్తు పూర్తైన బైకు తీసుకొని వస్తానని చెప్పి ఇంటినుండి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఉదంతం నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇనస్పెక్టర్ సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాకతీయనగర్‌లో నివసిస్తూ ప్రయివేట్ ఉద్యోగం చేస్తూ జీవిస్తున్న చంద్రబాబు శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు తాను మరమ్మత్తుకు ఇచ్చిన బైకు తీసుకొని వస్తానని ఇంటినుండి వెళ్లి తిరిగి చేరు కోలేదు. అతడి జాడ కోసం స్నేహితులు, బంధువులను అడిగినా ఫలితం లేక పోవటంతో భార్య స్వప్న ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మృతుని అంత్యక్రియలకు ఎస్‌కెఆర్ ట్రస్టు ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/మర్పల్లి :** మర్పల్లి మండల పరిధిలోని రావులపల్లి గ్రామానిచేందిన కాంగ్రెస్ కార్యకర్త గొల్ల మొగలయ్య గురువరం సాయంత్రం ఆకస్మాత్తుగా మృతి చెందాడని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్నా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనగరి కొండల్‌రెడ్డి మృతుని అంత్యక్రియలకు 5వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నల్ల అబ్రహం, ఉప్పరి రమేష్ నల్ల ప్రభాకర్, వడేలా బ్రాహ్మచారీ, ఎల్లప్ప తదితరులు పాల్గోన్నా రు.



## హైడ్రా బాధితులకు ఎంపి ఈటల అండ

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** హైడ్రా బాధితులకు అండగా తాను నిలుస్తానని, త్వరలోనే మీతో కల్సి దీక్ష చేస్తానని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ తెలిపారు. రాష్ట్రంలో అధికారం చేపట్టగానే ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి ప్రజలకు సేవ చేయాల్సింది పోయి తాను సృష్టించిన హైడ్రా పేరిట పేద జనాలను భయభ్రాంతులకు గురి చేస్తూ నిలువ నీడ లేకుండా చేస్తున్నాడని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని వినాయకనగర్ డివిజన్‌లో పలు కాలనీలకు చెందిన హైడ్రా బాధితులను కల్సి ఈ మేరకు ఆయన హామీ ఏ మాత్రం భయపడాల్సింది లేదని, మీ ఇళ్లు కూల్చకుండా తాను అడ్డంగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇక్కడి బండ చెరువు సమీపంలో శివానందనగర్, కృష్ణనగర్, ఆర్టీసీ కాలనీ, శంకరయ్య కాలనీ, పిబి కాలనీ, పిబి సూర్య కాలనీ, సంతోషిమా కాలనీ, సింహాద్రి కాలనీ, లక్ష్మి నగర్, చంద్రనగర్ కాలనీ, లాల్వాని నగర్‌లతో పాటు 35 ఏళ్ల క్రితమే ఏర్పడిన మొత్తం 18 కాలనీలలో రోజు వారీ సంపాదనతో జీవనాలు గడిపే పేదలు, మధ్య తరగతి ప్రజలు, బడుగు వర్గాలు,చిరుద్యోగులు తాము కష్టపడ్డ సొమ్ము కూడగట్టుకొని జాగాలు కొనుక్కొని ఇళ్లు సొంతంగా నిర్మించుకొని కుటుంబాలను పోషించుకొంటూ ప్రశాంతంగా జీవనాలు గడుపుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో చెరువుల పరిరక్షణ అంటూ హైడ్రా పేరిట ఇలాంటి సొంత గూడులను కూల్చి వేస్తామంటూ హైడ్రాను ప్రభుత్వం ప్రయోగిస్తోందన్నారు. ప్రతి శని, ఆదివారం వస్తోందంటే ఎక్కడ తమ ప్రాంతానికి బుల్డోజర్లు వచ్చి కష్టించి నిర్మించుకొన్న ఇళ్లను కూల్చి వేస్తారోనని బిక్కు బిక్కుమని బతికే దుస్థితికి తీసుకొని వచ్చిన ఘనతను ముఖ్యమంత్రిగా రేవంత్ సాధించుకొన్నాడని ఈటెల అన్నారు. ఒక వైపు నివాస గృహాలను కూల్చివేయమని హైడ్రా అధికారులతో పాటు సిఎం ప్రకటనలిస్తూనే మరో పక్క ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో ఇళ్లు అంటూ కూల్చి వేసేందుకు సిద్ధం అన్న విధంగా మార్కింగ్ చేస్తున్నారన్నారు. తమకు మేలు చేస్తారన్న నమ్మకంతో కాంగ్రెస్ పార్టీని అందలమెక్కిస్తే ప్రజలకు ఆ దిశగా ఏ ఒక్క పని చేయక పోగా కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. హైడ్రా పని తీరును, ప్రభుత్వ విధానాన్ని న్యాయస్థానాలు తప్పని చెప్పి మొట్టికాయలు వేసినా బుద్ధి రావటం లేదని, ఈ పరిస్థితుల్లో తానే హైడ్రా బాధితులతో కల్సి రంగంలో దిగుతానన్నారు. వినాయకనగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, బిజెపి శ్రేణులు ఓం ప్రకాష్, సాయి సురేష్, జగదీష్‌చారి

## ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/పరిగి:** పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండల కేంద్రలోని రైతు వేదికలో ఉద్యాన శాఖ, ఇకోపామ్ ఆయిల్ అండ్ ఫట్స్ప్రైవేట్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగు పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ తనే స్వయంగా వారి క్షేత్రంలో ఆయిల్ పాం సాగు చేస్తానని రెండు సంవత్సరాలుగా ఇ పథకం కోసం రైతులు వేచి చూస్తున్నారని తెలిపారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సత్తార్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట యొక్క ఆవశ్యకత, ప్రభుత్వం ఇస్తున్న రాయితీల గురించి వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు డిఎస్ లక్ష్మి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా నేల రకాలు అనువైనవని ఇక్కడి రైతులు ఆయిల్ పామ్ పథకాన్ని అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో పాండు, మండల వ్యవసాయ అధికారి తులసిరాం, ఉద్యాన అధికారులు వైజయంతి, కమల, వ్యవసాయ విస్తరణఅధికారులు, ఎకోపాం ఆయిల్ ఫ్యాట్ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సేవలందించాలి

## డిఎంహెచ్‌ఒను ఆదేశించిన కలెక్టర్ గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులను పూర్తి స్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన చికిత్సలందించాలని జిల్లా కలెక్టర్ గౌతం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.రఘునాథస్వామిని ఆదేశించారు. శామీర్‌పేట మండలంలోని మూడుచింతలపల్లిలోని కామిడి వీరారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో కల్సి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆరోగ్య కేంద్రానికి ప్రతి రోజు ఎంత మంది రోగులు వస్తున్నారన్న విషయాన్ని తెలుసుకొని సమీప ప్రాంతాల్లో ఆశా వర్కర్లు ఇంటింటికి తిరుగుతూ ఇక్కడ లభించే వైద్య సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల గురించి వివరిస్తూ రోగుల సంఖ్య పెంచేలా చూడాలన్నారు. అదే విధంగా ప్రసవాల సంఖ్య, గర్భిణీలు, బాలింతలకు ఏ మేరకు సేవలందిస్తున్నారన్న విషయాలను రిజిస్టర్లలో ఉన్న వివరాలను చూసి ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలని, ఎక్కడా ఖాళీలు ఉండరాదని హెచ్చరించారు. విష జ్వరాలు విస్తరిస్తున్న సందర్భంగా ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవఖానాలు, ప్రభుత్వ ఆస్పత్రులన్నిటిలోనూ ఎలాంటి జాప్యం లేకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు చికిత్సలందించాలని కలెక్టర్ సూచించారు.

**తహసీల్దార్ నూతన భవన పనులు పరిశీలన**

నూతనంగా నిర్మిస్తున్న మూడుచింతలపల్లి తహసీల్దార్ నూతన భవనం జిల్లాలో ఒక మోడల్ భవనంలా ఉండాలని జిల్లా కలెక్టర్ గౌతం స్థానిక తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డిని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో కల్సి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేపట్టిన ఆయన అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణాలు చేపడుతామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ భవనంలో రికార్డులను భద్రపరచేందుకు స్ట్రాంగ్ రూంలను ఆధునీకరణ పద్ధతుల్లో నిర్మించాలని, అదే విధంగా కార్యాలయానికి వచ్చే సిబ్బందితో పాటు ప్రజలందరికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన పూర్తి మౌళిక వసతులు సమకూరేలా చూడాలన్నారు.ఎలాంటి జాప్యం లేకుండా ప్రమాణాలకు లోబడి నిర్మాణం పూర్తి అయ్యేలా చూడాలన్నారు.

# రేషన్‌కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ

## అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి నెల నుండి రేషన్ కార్డుల ద్వారా జిల్లాలో సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నామని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. దీనిలోని భాగంగా జిల్లాలో ధాన్యం సేకరణ విషయమై ధాన్య సేకరణ కేంద్రాల ఇన్‌చార్జిలు, రైస్ మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ రైతుల నుండి సన్న బియ్యానికి సంబంధించిన ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున అదనంగా బోనస్ రూపంలో చెల్లించనున్నామన్నారు. దీని కోసం రైతులను దుమ్ము లేకుండా తూర్పారబట్టి, ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వచ్చే విధంగా రైతులను చైతన్య పరచాల్సి ఉంటుందని ఏఈఓలను ఆదేశించారు. వరి కోత సమయంలో వరి మార్పిడి యంత్రాల వారితో మాట్లాడి ఒక క్రమ పద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వచ్చే విధంగా చూడాలని, సన్న వడ్లకు, దొడ్డు వడ్లకు వేర్వేరు విభాగాలు ఉండేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలని, సన్న ధాన్యాన్ని గుర్తించే విధంగా వాటి గన్నీ బ్యాగులపై S అని మార్కింగ్‌తో పాటు సెంటర్ కోడ్ వేయాలన్నారు. సన్న,దొడ్డ వడ్లను వేర్వేరు లోడ్‌లతో రైస్ మిల్లులకు పంపాలని ఆయన కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. సోమవారంలోగా జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తి ఏర్పాట్లతో సిద్ధం కావాలన్నారు. రైస్ మిల్లు యజమానులు సన్నవడ్ల దిగుమతుల సమయంలో తగు జాగ్రత్తలు పాటించి వాటి కోసం ప్రత్యేక రిజిస్టర్లను నిర్వహించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. రైతులు తీసుకొని వచ్చిన ధాన్యం అమ్మిన 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూస్తామన్నా రు. దీనికి సంబంధించిన సిబ్బంది, అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లా అగ్రస్థానంలో ఉండేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కోరారు.



## కౌన్సిలర్ శంకర్ నాయక్‌ను పరామర్శించిన ఎంఎల్‌సి శంభీపూర్ రాజు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డు కౌన్సిలర్ శంకర్ నాయక్ తల్లి కొర్ర లక్ష్మీ భాయి ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్ళి లక్ష్మి బాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, 125 డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ రామ్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ మోహన్ నాయక్, వార్డు ప్రెసిడెంట్ అమర్ సింగ్, సీనియర్ నాయకులు రవీందర్ నాయక్, సంజీవ్, వినోద్, దశరథ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కంచి కామాక్షి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపాలిటి పరిధిలోని శ్రీగాయత్రీ మహాక్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా అమ్మవారు కంచి కమాక్షి దేవిగా దర్శనమిచ్చారు. శుక్రవారం శ్రీ గాయత్రీ మహా క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్‌విఎల్‌ఎన్ మూర్తి ఆద్వర్యంలో వేద పండితులు మంత్రోచ్చరణలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిపి చంద్రశేఖర్‌యాదవ్, భక్తులు పాల్గొన్నారు.

## దసరా పండుగకు ఊరు వెళ్తున్నారా.... జాగ్రత్త!



నవాబుపేట్ ఎస్సై కె.అరుణ్ కుమార్

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** దసరా పండుగకు సొంత ఊర్లకు వెళుతున్నారా తస్మాత్ జాగ్రత్త అంటూ నవాబుపేట్ ఎస్సై కె.అరుణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రజలు ఇంటికి తాళాలు వేసి వారి యొక్క సొంత గ్రామాలకువెళ్తుంటారు. స్కూళ్లకి సెలవులు ఉన్నందువలన తల్లిదండ్రులు, పిల్లలు, కుటుంబ సభ్యులు కలిసి విహారయాత్రలకు వెళ్తుంటారు. ఊరికి వెళ్లేటప్పుడు మీ ఇంట్లోని విలువైన వస్తువులను, బంగారం, డబ్బులను మీ వెంట తీసుకోని వెళ్ళాలి లేదా బ్యాంక్ లాకర్ లో దాచి వెళ్ళాలి లేదా ఇంట్లో ఎవరినైనా ఉంచి వెళ్లగలరని లేదా మీ ఇంటి పక్కవారు నమ్మకస్తులు ఉంటే ఇంటి వైపు చూస్తుండు మని చెప్పాలన్నారు. మీ ఇంటి పరిసరాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని, మీ ఫోన్లో మీ ఇంటిని ఒక కంట కనిపెడుతూ ఉండాలన్నారు.

మీ గ్రామాలలో గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్నట్లయితే వెంటనే పోలీస్ వారికి లేదా 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఆర్టీసీ లేదా ఇతర పబ్లిక్ రవాణా మార్గాలలో ప్రయాణించేవారు తప్పనిసరిగా తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా చూసుకోగలరు.

## హత్య కేసులో నలుగురికి కఠిన శిక్ష

వివరాలను వెల్లడించిన ధారూర్ సిఐ భీమ్ కుమార్, ఎస్ఐ శ్రవంతి

**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** మిస్సింగ్ అయిన ఓ వ్యక్తిని అతి కిరాతకంగా చంపిన సంఘటన కోట్‌పల్లి పోలీస్టేషన్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి ధారూర్ సర్కిల్ కార్యాలయంలో సీఐ భీమ్ కుమార్, ఎస్ఐ శ్రవంతితో కలిసి మీడి యా సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. కోట్‌పల్లి మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి 25.9.2024 నాడు ఇంటి నుండి బయట కు వెళ్లి తిరిగి రాకపోగ మూడు రోజుల పాటుగా శ్రీ కాంత్ తండ్రి నర్సింలు స్నేహితులు, బంధువుల వద్దకు పోన్ చేసి అడిగినా ఆచూకీ లబించలేదు. 28.9.2024 రోజు కోట్‌పల్లి పోలీస్టేషన్‌లో తన కోడుకు శ్రీకాంత్ కనబడుట లేదని ఫిర్యాదు చేశారు. దాంతో మిస్సింగ్ పై ఎఫ్ఐఆర్‌గా నమోదుచేసి ధర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ఎన్ బందెయ్య అనే వ్యక్తి పోలీసులకు పోన్ చేసి శ్రీకాంత్ అనే వ్యక్తిని సౌట మల్లెశం, మొల్ల బందెల్లి, బంటు బందెల్లి, అంజప్పలు చంపినామని ఒప్పుకున్నారని ఎస్ఐ శ్రవంతికి పోన్ చేయగా ఆమే అక్కడికి చెరుకుని ఆ నలుగురిని చెరుకుని వారిని విచారించింది. ఇందుకు వారు నలుగురిలో సౌట మల్లెశం అనే వ్యక్తి తమ గ్రామంలోని అనిత తో అక్రమ సంబంధం ఉంది, అంతకు ముందు శ్రీకాంత్‌తో కూడా అనితకు అక్రమ సంబందం ఉండడంతో శ్రీకాంత్ అనే వ్యక్తి మా ఇద్దరిని చంపుతానని వార్నింగ్ ఇచ్చాడు దింతో ఎం చేయాలో తెలియక అనిత, నేను కలిసి శ్రీకాంత్‌ను చంపాలని ప్లాన్ చేసుకుని సాయం కొసంమొల్ల బందెల్లిని కోరగా సరే అని ఒప్పుకున్నాడు, 25.9.24 నాడు నలుగురు కలిసి శ్రీకాంత్‌ను తీసుకుని లింగంపల్లి చౌరస్తా వద్దకు చేరుకుని బందెల్లి జైలో ఎపి29,సిఎ7659 కారులో వెల్లి శ్రీకాంత్‌కు బాగా తాగించి మల్లెశం జేబులోని తాగుతో చంపి జాడి మల్కాపూర్ జలపాతంలో వేసినట్టు ఒప్పుకున్నారు. చంపిన నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



# ప్రతి కుటుంబానికీ డిజిటల్ కార్డులు

## సెర్ప్ సీఈఓ జిల్లా ప్రత్యేక అధికారి దివ్యదేవరాజన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొంపల్లిలో డిజిటల్ కుటుంబ ఇంటింటి సర్వే ప్రక్రియ ను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదపు కలెక్టర్ సుధీర్ ట్రైని కలెక్టర్ ఉమాహరతిలతో కలిసి సెర్ప్ సీఈఓ జిల్లా ప్రత్యేక అధికారి దివ్యారాజన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ప్రభు త్వం ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు అందజేయనున్న నేపథ్యంలో మున్సిపల్ వార్డుల్లో, గ్రామాల్లోకి వచ్చే అధికారులకు తమ కుటుంబా లో ఉండే తమ సామాచారన్ని అందజేయాలని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఉమ్మడి ఉన్న కుటుంబాలు విడిగా ఉండాలనుకుంటే కుటుంబా యజమనిగా ఉండవలసిన వారితో వేరుగా డిజిటల్ కార్డు పొందేందుకు సమాచారన్ని సర్వే బృందాలకు తెలియజేసి నమోదు చేసుకోవలని ఆమె సూచించారు. సర్వే బృందాలు గ్రామల్లోకి వెళ్లినప్పుడు కొందరు కుటుంబ సభ్యులు అందుబాటులో లేనట్టుయితే డిజిటల్ కార్డు నిమిత్తం పోటోను తీసుకునేందుకు సమయం ఇచ్చి వివరాలు సేకరించాలని అదికారులకు సూచించా రు. క్షేత్రస్థాయి పరిశీలనలో డిఆర్డిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.



**క్రీడలను ప్రోత్సహించడానికి సిఎం కప్**

క్రీడలను పోత్సహించడానికి సీఎం 2024 నిర్వహించే సందర్భంగా వికారాబాద్ జిల్లాలో క్రీడాకరులకు, యువతకు అవగాహన,క్రీడలపట్ల అసక్తిని పెంచుటకు కలెక్టర్ కార్యాలయం నుండి టార్చ్ రిలే ర్యాలీని జెండా ఊపీ ప్రారంభించారు.

**కొడంగల్‌లో :** ప్రతి కుటుంబానికి డిజటిల్ కార్డులు అందించే దిశగా పనిచేయాలని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో మున్సిపల్ కమిషినర్ బలరాంనాయక్, తహశీల్దార్ విజయ్‌కుమార్‌ల సమక్షంలో అధికారులు ఇంటింటి సర్వే ప్రక్రియను చేపట్టారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు అందజేయనున్నారని తమ కుటుంబాల సమాచారాన్ని అందజేయాలనిసూచించారు. వీరితోపాటు మున్సిపల్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది,అంగన్‌వాడీ టీచర్‌లు తదితరులు పాల్గోన్నారు.



# దొంగ డాక్యుమెంట్లు సృష్టిస్తున్న ముఠా అరెస్ట్



**ప్రజాపక్షం/దుండిగల్:** గుట్టు చప్పుడు కాకుండా నకిలీ డాక్యుమెంట్ సృష్టిస్తున్న ముఠాను పట్టుకున్న సంఘటన కుత్బుల్లాపూర్ లో వెలుగులోకి వచ్చింది. సిపి అవినాష్ మహంతి తెలిపిన వివరాల ప్రకారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సుభాష్ నగర్‌లోని ప్లాట్ నెంబర్ 147 నందు గల 200 గజాల స్థలముకు సంబంధించి నకిలీ భూమి పత్రాల ద్వారా తన భూమిని కబ్జా చేశారని లెండ్యాల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా ఇందులో ఒక పెద్ద నకిలీ డాక్యుమెంట్లు చేసే ముఠా హస్తం ఉందని తెలిసింది. పద్మజా రెడ్డి భూమిని సొంతం చేసుకోవాలని దురుద్దేశంతో రేపాటి కరుణాకర్ అనే వ్యక్తిని సంప్రదించిందని, అందుకు కరుణాకర్ కు 3.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని అందుకుగాను ఆ ల్యాండ్ కు సంబంధించి సీసీ కాపీస్ కావాలని చెప్తే వాటిని కరుణాకర్ కు అందించింది. కరుణాకర్ తన ముఠా సభ్యులతో కలిసి ఫిక్ డాక్యుమెంట్స్ తయారు చేశారు. ప్రైమ్ సీసీ కాపీ ఆధారంగా ఫోటో షాపి లో ఒరిజినల్ డాక్యుమెంట్ లాగా పాత పేపర్ పైన ప్రింట్ తీసి ల్యాండ్ ఓనర్స్ సురేష్ 1992లో చనిపోయినట్లు ఒక ఫేక్ డెత్ సర్టిఫికెట్ అలాగే ల్యాండర్ రవిశంకర్ అతని కుమారుడి లాగా లీగల్ హెయిర్ సర్టిఫికెట్ తయారు చేయించి రవిశంకర్ లాగా ఒక వ్యక్తికి హరీష్ సహాయంతో, ఆధార్ కేంద్రంలో పనిచేసే నరేంద్రతో ఫేక్ ఆధార్ కార్డును తయారు చేయించారు.

22 ఫిబ్రవరి 2023 నాడు కుత్బుల్లాపూర్ ఎస్ఆర్ఓ సహకారంతో ఫేక్ రవిశంకర్ ద్వారా కుత్బుల్లాపూర్ పద్మ తన చెల్లెలు నాగిరెడ్డి కోమల కుమారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు గతంలో వీరిపై రచ్చకుం డా హైదరాబాద్ సైబరాబాద్ లోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

**జీడిమెట్ల పోలీసులకు అభినందనలు : సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి వాళ్ళ భూములను లాక్కునే వాళ్ళను గుర్తించి వారిని అరెస్టు చెయ్యడం అభినందనీయమని వారు పత్రికప్రకటానలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కబ్జారాయులు అనేక ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్రజలకు తప్పుడు పత్రాలను చూపి లక్షలకు అమ్మి మోసం చేసారని, నేడు ఆ ప్రాంతాలో నివసిస్తున్న ప్రజలు ఎప్పుడు హైడ్రా వచ్చి కూలుస్తోందొనని భయం తో బతుకుతున్నారని అన్నారు. ఆ సృష్టించిన పత్రాలు భూములు అమ్ముకోవ దానికే కాకుండా ఆ పేపర్లతో ఎలక్ట్రిక్ మీటర్లు, టాక్సలు, మంచి నీటి కనెక్షన్, డోర్ నంబర్ లు ఇలాగ అన్నింటికి ఉపయోగించారని, కావున ఆ కబ్జాదారులను అరె స్టు చెయ్యడమే కాకుండా వా ళ్ళ వల్ల మోసపోయిన వారిని గుర్తించి,కబ్జాదారులు మోసంతో పెంచుకున్న ఆస్తులను జప్తు చేసి ప్రజలకు న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేసారు. వాటి వెనుకాల ఉన్న అధికారులను అరెస్టు చెయ్యాలన్నారు. నేటికీ భూకబ్జాదారులు వాళ్లు కబ్జా చేసి కాలనీలుగా ఏర్పరిచి అందులో మధ్య లో ఖాళీగా ఉన్న స్థలాలలో గదులను నిర్మిస్తున్నారని, గతంలో సిపిఐ గా పోరాటం చేసి, విజ్ఞప్తుల పై ఇంకా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించట్లేదని, ఉద్యమాన్ని మరొక సారి నిర్మిస్తామని అన్నా రు. అనేక ప్రాంతాలో నిర్మించిన బస్తీలలో ఇలాగే అక్రమ పత్రాలను సృష్టించి ఉండవచ్చని కావున వాటిపై కూడా సమగ్ర దర్యాప్తు చెయ్యాలని పోలీస్ అధికారులను కోరారు. గతంలో చింతల్ చెరువు లో హైడ్రా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తే మళ్ళీ అక్కడ నిర్మాణాలు మొదలు పెట్టారని సమాచారం ఉందని, కావున వాటి పైన కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# క్రీడ

## గ్వాలియర్‌లో 14ఏళ్ల తర్వాత ఇంటర్నేషనల్ మ్యాచ్



ఇటీవలే బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను టీమ్‌ఇండియా వైట్ వాష్ చేసింది. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న టీ20 సిరీస్‌పై కూడా కన్నేసింది. అక్టోబరు 6న గ్వాలియర్ నగరంలో కొత్తగా నిర్మించిన 'శ్రీమంత్ మాధవరావు సింధియా క్రికెట్ స్టేడియం'లో భారత్, బంగ్లాదేశ్ జట్లు తొలి టీ20లో తలపడనున్నాయి. అయితే 14 ఏళ్ల తర్వాత గ్వాలియర్ నగరంలో ఇంటర్నేషల్ క్రికెట్ మ్యాచ్ జరగనుండటం గమనార్హం.

**సచిన్ డబుల్ సెంచరీ తర్వాత నో మ్యాచ్**

గ్వాలియర్ నగరంలో 14 ఏళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరగబోతోంది. ఇక్కడ చివరి మ్యాచ్ 2010లో జరిగింది. రూప్ సింగ్ స్టేడియం వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్‌దక్షిణాఫ్రికా జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియా దిగ్గజం సచిన్ టెండూల్కర్ వన్డే క్రికెట్‌లో మొదటి డబుల్ సెంచరీని చేశాడు. దీంతో టీమ్‌ఇండియా 153 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే గ్వాలియర్ లో సుదీర్ఘకాలం తర్వాత అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరగనుండటం వల్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**షెడ్యూల్ మార్పుతో గ్వాలియర్‌కు అవకాశం**

అయితే తొలుత భారత్ బంగ్లాదేశ్ మధ్య తొలి టీ20ని హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో నిర్వహించాలని బీసీసీఐ భావించింది. అక్కడ స్టేడియం పునరుద్ధరణ పనులు జరుగుతుండడం వల్ల వేదికను ఇటీవలే మార్చింది. గ్వాలియర్ లోని 'శ్రీమంత్ మాధవరావు సింధియా క్రికెట్ స్టేడియం'లో నిర్వహించేందుకు సిద్ధమైంది. దీంతో 14 ఏళ్ల తర్వాత గ్వాలియర్ నగరంలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరగనుంది.

**గ్వాలియర్‌లో 10 వన్డేలు ఆడిన భారత్**

గ్వాలియర్ నగరంలోని రూప్ సింగ్ స్టేడియంలో మొదటి అంతర్జాతీయ మ్యాచ్ 1988లో జరిగింది. ఆ మ్యాచ్ లో భారత్ పై వెస్టిండీస్ 73 పరుగుల తేడాతో విజయం సాధించింది. గ్వాలియర్ లో ఇప్పటివరకు టీమ్ ఇండియా మొత్తం 10 వన్డేలు ఆడగా, అందులో 8 గెలిచింది. రెండింట్లో ఓటమిపాలైంది.



## భారత్‌కు గోల్డ్..

### జూనియర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానం మనదే

పెరూలోని లిమా వేదికగా జరుగుతున్న ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ హవా కొనసాగుతోంది. పురుషుల విభాగంలో టీమ్‌ఇండియా త్రయం స్వర్ణం గెలుచుకుంది. ముకేశ్ నేలవల్లి, రాజ్‌వర్ధన్, హర్సిమర్ సింగ్ రత్తా 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో గోల్ గెలిచారు. దీంతో పతకాల పట్టికలో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు 16 పతకాలు సాధించింది. ఇందులో 11 బంగారు, 1 రజత, నాలుగు కాంస్య పతకాలు ఉన్నాయి. అంతకుముందు.. భారత క్రీడాకారిణి ఖుషి కాంస్యం సొంతం చేసుకుంది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్‌లో ఖుషి (447.3) మూడో స్థానంలో నిలిచింది. ఎనిమిది మంది బరిలో దిగిన ఫైనల్లో సినోవ్ బర్గ్ (458.4 నార్వే) స్వర్ణం, కరోలిన్ లుండ్ (458.3 నార్వే) రజతం సాధించారు. అంతకుముందు అర్హత రౌండ్లో ఖుషి ఏడో స్థానంలో నిలిచింది. నలుగురు క్రీడాకారిణుల పాయింట్లు సమమవగా.. కౌంట్‌బ్యాక్‌లో ఖుషి ఏడు, అనా షివాన్ (ఇటలీ) ఎనిమిదో స్థానం సాధించి ఫైనల్లో అడుగుపెట్టారు.

## మహిళల టి20లో భారత్ ఓటమి

**దుబాయి:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌లోనే ఘనంగా బోణీ చేసి కప్పుపై కన్నేద్దామనుకున్న భారత జట్టుకు నిరాశ. తొలి పోరే అయినప్పటికీ న్యూజిలాండ్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో టీమ్ ఇండియా చేతులెత్తేసింది. తొలుత న్యూజిలాండ్‌ను 160 పరుగులకు కట్టడి చేసిన హర్మన్ ప్రీత్ సేన.. అనంతరం లక్ష్యఛేదనలో దారుణంగా విఫలమైంది. 19 ఓవర్లలో 102 పరుగులకే ఆలౌట్ అయి 58 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (15) టాప్ స్కోరర్. మిగతావారు ఎవ్వరూ 15 పరుగులకు మించి చేయలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లలో రోస్ మేరీ మెయిర్ 4, లీ తహుహు 3 వికెట్లు తీసి భారత్ పతనాన్ని శాసించారు.

**చెలరేగిన న్యూజిలాండ్ బౌలర్లు..**

న్యూజిలాండ్ నిర్దేశించిన 162 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన భారత్ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. తొలి బంతినే మంధాన బౌండరీ తరలించింది. ఈ ఓవర్లో మొత్తం 11 పరుగులు వచ్చాయి. అయితే రెండో ఓవర్ తొలిబంతికే షఫాలీ వర్మ (2) గార్సన్ బౌలింగ్‌లో తనకే క్యాచ్ ఇచ్చి ఔట్ అయింది. ఐదో ఓవర్లో గార్సన్ బౌలింగ్‌లో మంధాన (12) ఔట్ అయింది. ఆ తర్వాతి ఓవర్లోనే హర్మన్ ప్రీత్ కౌర్ ఎల్బీగా పెవిలియన్ చేరింది. 9 ఓవర్లో లీ బౌలింగ్‌లో రోడ్రిగ్స్ (13) క్యాచ్ ఔట్ అయింది. త్వరత్వరగా వికెట్లు కోల్పోయిన భారత్ 10 ఓవర్లు ముగిసే సరికి 63/4 పరుగులతో నిలిచింది.వరుసగా వికెట్లు పడడం, ఛేదించాల్సిన రన్ రేట్ భారీగా ఉండడంతో టీమ్ ఇండియా తీవ్ర ఒత్తిడికి గురింది. అనంతరం లీ బౌలింగ్‌లో దీప్తి శర్మ (13) క్యాచ్‌ఇచ్చింది. దీంతో భారత్ 15 ఓవర్లు ముగిసే సరికి 7 వికెట్లు కోల్పోయి 88 పరుగులతో నిలిచింది. అప్పటికే భారత్ పరాజయం ఖాయమైంది. తర్వాత వచ్చిన వారు కేవలం అంతరాన్ని తగ్గించారు. ఇక మెయిర్ వేసిన 19వ ఓవర్లో చివరి రెండు బంతుల్లో శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్ ఔట్ కావడంతో భారత ఇన్నింగ్స్ 102 పరుగుల వద్దే ముగిసింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. సోఫీ డివైన్ (57; 36 బంతుల్లో 7x4) అర్ధశతకంతో చెలరేగింది. ఓపెనర్లు సుజియా బేట్స్ (27), జార్జియా ప్లిమ్మెర్ (34) క్రీజులోకి రాగానే చెలరేగి పోయారు. అయితే వీరి దూకుడుకు అరుంధతిరెడ్డి కళ్లెం వేసింది. ఎనిమిదో ఓవర్లో భారీ షాట్‌కు ప్రయత్నించిన సుజుయీ.. శ్రేయంక పాటిల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాతి ఓవర్ వేసిన ఆశా శోభన బౌలింగ్‌లో స్మృతి మంధానకు క్యాచ్ ఇచ్చి జార్జియా పెవిలియన్‌కు చేరింది. ఆ తర్వాత న్యూజిలాండ్ దూకుడు కాస్త తగ్గినప్పటికీ.. రెండో డౌన్‌లో వచ్చిన సోఫీ క్రీజులో నిలదొక్కుకొని ఆడటంతో ఆ జట్టు మంచి స్కోరే చేసింది. భారత్ బౌలర్లలో రేణుకా ఠాకూర్ 2 వికెట్లు తీయగా, అరుంధతి రెడ్డి, ఆశా శోభన తలో వికెట్ తీశారు.

# రీల్



## 'విశ్వంభర' పై లేటెస్ట్ అప్డేట్..

మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్ గా దర్శకుడు వశిష్ఠ తెరకెక్కించిన భారీ ఫాంటసీ యాక్షన్ డ్రామా విశ్వంభర కోసం అందరికీ తెలిసిందే. మరి ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ ఎప్పుడు నుంచో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ చిత్రం షూటింగ్ అలాగే డబ్బింగ్, పోస్ట్ ప్రొడక్షన్ ఇలా అన్నీ ఏకకాలంలో జరిగిపోతున్నాయి. ఇక ఈ సినిమాపై ఇపుడు లేటెస్ట్ అప్డేట్ తెలుస్తుంది. ప్రస్తుతం సినిమాలో రెండు పాటలు షూటింగ్ మినహా మిగతా అంతా కంప్లీట్ అయ్యిపోయినట్టుగా తెలుస్తుంది. ఇవి కూడా అతి త్వరలోనే కంప్లీట్ చేసేసి ఈ జనవరి బరిలోనే సినిమాని దింపే సన్నాహాలు మేకర్స్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. ఇక ఈ చిత్రానికి ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా యూవీ క్రియేషన్స్ వారు భారీ బడ్జెట్ తో నిర్మాణం వహిస్తున్నారు.



## గ్రాండ్‌గా విజయ్ 69 మూవీ లాంచ్! నేటి నుండి రెగ్యులర్ షూటింగ్

తమిళ స్టార్ హీరో విజయ్ రీసెంట్‌గా 'ది గోట్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అయితే, ఈ సినిమా తరువాత విజయ్ తన లాస్ట్ మూవీలో నటిస్తాడని అందరికీ తెలిసిందే. తాజాగా ఈ సినిమాను అఫీషియల్‌గా లాంచ్ చేశారు. దర్శకుడు హెచ్.వినోత్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీలో అందాల భామ పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. దీనికి సంబంధించిన ఫోటోలను మేకర్స్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. విజయ్ సినిమా కెరీర్‌లో ఆఖరి చిత్రం దళపతి 69ని అత్యంత వైభవంగా తెరకెక్కించేందుకు కెవియన్ ప్రొడక్షన్స్ సిద్ధమైంది. సినిమాలో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల సమక్షంలో ఆత్మీయంగా జరిగింది దళపతి 69 మూవీ పూజ. ఇక ఈ సినిమాలో భారీ క్యాస్టింగ్ నటిస్తుండగా, మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి ప్రారంభించేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.



## 'పుష్ప-2' హిందీ రైట్స్.. డబుల్

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ మూవీ 'పుష్ప2' ప్రస్తుతం చివరిదశ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు సుకుమార్ అత్యంత గ్రాండియర్‌గా రూపొందిస్తున్నాడు. ఫస్ట్ పార్ట్ అందుకున్న భారీ విజయానికి ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమాపై అంచనాలు క్రియేట్ అవుతున్నాయి. దీంతో ఈ సినిమా ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. కాగా, ఈ సారి 'పుష్ప2' మూవీపై ఉత్తరాదిన కూడా భారీ హైప్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమా కోసం హిందీ బెల్ట్‌లో తీవ్ర పోటీ నెలకొంది. తాజాగా పుష్ప2 చిత్రానికి సంబంధించిన హిందీ రైట్స్‌ను మేకర్స్ అత్యంత భారీ ధరకు అమ్మినట్లుగా సినీ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. పుష్ప తొలి భాగానికి ఇది రెండింతల రేటుగా వార్తలు వస్తున్నాయి. దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చు 'పుష్ప2' మూవీపై నార్త్ ఆడియెన్స్ ఏ రేంజ్‌లో ఆసక్తిగా ఉన్నారనేది. ఇక తన యాక్టింగ్‌తో ఏకంగా నేషనల్ అవార్డ్ అందుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, పుష్ప2 మూవీతో మరోసారి నేషన్‌వైడ్‌గా ట్రెండ్ సెట్టర్ అవుతాడని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుండగా, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 6న వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

## డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంది. దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ వర్గానికి చెందిన ఎన్‌సిపి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ నరహరి ఝిర్వాల్‌తో పాటు బిజెపి ఎంపి హేమంత్ సావ్రా, ఎమ్మెల్యేలు కిరణ్ లహమాటే, హిరామన్ ఖోస్కర్, రాజేష్ పాటిల్ నిరసన చేపట్టారు. సచివాలయంలోని మూడో అంతస్తు నుంచి కిందకు దూకారు. మొదటి అంతస్తు వద్ద ఏర్పాటు చేసిన సేఫ్టీ నెట్‌లో పడ్డారు. పోలీసులు వెంటనే వారిని రక్షించారు. వీరికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. అనంతరం వారంతా సచివాలయం ముందు బైఠాయించి ఆందోళన కొనసాగించారు. ధన్‌గఢ్ కమ్యూనిటీ సభ్యుల అభివృద్ధికి ప్రభుత్వం వివిధ పథకాలను ప్రకటించడంలో తమకు ఎలాంటి సమస్యలు లేవని.. అయితే వారిని ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఝిర్వాల్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు మంత్రాలయం (సచివాలయం) వద్దే ధర్నా కొనసాగిస్తామన్నారు. అయితే మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండే వారితో సమావేశమై ఎమ్మెల్యేల సమస్యలు పరిష్కరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఈ సచివాలయం పైనుంచి కొందరు దూకేందుకు ప్రయత్నించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా 2018 ఫిబ్రవరిలో సచివాలయం మొదటి అంతస్తు వద్ద భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు.

## అసెంబ్లీ, మండలిని సందర్శించిన ఆస్ట్రేలియా ప్రజా ప్రతినిధుల బృందం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఆస్ట్రేలియా దేశానికి చెందిన ప్రజా ప్రతినిధుల బృందం శుక్రవారం తెలంగాణ శాసన సభ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,డిప్యూటి చైర్మన్ బండ ప్రకాష్ , పిఎసి చైర్మన్ అరికేపుడి గాంధీ, లేజిస్లేచర్ సెక్రెటరీ డా నరసింహా చార్యులు ఆస్ట్రేలియా దేశానికి చెందిన మంత్రులు రిచర్డ్ రీయర్డాన్ , బ్రాండ్ బట్టిన్‌లను ఘనంగా సన్మానించారు. శాసన మండలి ఛైర్మన్ , డిప్యూటి చైర్మన్ తదితరులు స్వయంగా ఆస్ట్రేలియా ప్రజా ప్రతినిధుల బృందానికి తెలంగాణ శాసన సభ, శాసన మండలి సభా మందిరాలను చూపించి అన్ని విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా దేశానికి చెందిన మంత్రులు రిచర్డ్ రీయర్డాన్ , బ్రాండ్ బట్టిన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర లేజిస్లేచర్ సభలను చాలా గొప్పగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. లేజిస్లేచర్‌కి సంబంధించిన చాలా విషయాలను ఇక్కడ తెలుసుకున్నమని చెప్పారు. తెలం గాణ రాష్ట్ర శాసన సభ కార్యా లయాన్ని సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## నల్లగొండ బిఆర్‌ఎస్ బిల్డింగ్ కేసులో ఊరట

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** నల్గొండ బిఆర్‌ఎస్ బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు లేవంటూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన కూల్చివేత నోటీసుల విషయంలో స్టేటస్కో (యథాతథస్థితి0 ఉత్తర్వులను హైకోర్టు జారీ చేసింది,నల్గొండ జిల్లా బీఆర్‌ఎస్ బిల్డింగ్ రెగ్యులరైజేషన్ చేసేందుకు కార్పొరేషన్ తిరస్కరించింది. కూల్చివేత నోటీసులను రెండుసార్లు బిఆర్‌ఎస్ నేత రమావత్ రవీందర్ సవాల్ చేయడంతో ఆగ్రహించిన సింగిల్ జడ్జి వాటిని కొట్టివేయడమే కాకుండా లక్ష రూపాయలను జరిమానా విధించారు. వీటిని సవాలు చేస్తూ రవీందర్ అప్పీల్ పిటిషన్ వేయగా చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ శుక్రవారం విచారించింది. ఇదే తరహాలో మరో అప్పీల్ పిటిషన్ ఈ నెల 21న విచారణ జరగనుందని, ఈ అప్పీల్ను కూడా అప్పుడే విచారిస్తామంది. అప్పటి వరకు బిఆర్‌ఎస్ బిల్డింగ్ వ్యవహారంపై స్టేటస్కో ఉత్తర్వులను అమలు చేయాలంది.



## ఎస్సిల ఉపవర్గీకరణ తీర్పుపై రివ్యూ పిటిషన్లు కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకిస్తూ 2006లో పంజాబ్ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. అలాంటి ఉప వర్గీకరణ చెల్లదంటూ పంజాబ్–హర్యానా హైకోర్టు 2010లో తీర్పు వెలువరించింది. ఇవి చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2004లో వెలువరించిన తీర్పును ఉల్లంఘించేలా పంజాబ్ చట్టం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. దానిని సవాల్ చేస్తూ పంజాబ్ ప్రభుత్వం అప్పట్లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అనంతరం దీనిపై మరో 22 పిటిషన్లు దాఖలయ్యాయి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ కూడా ఇందులో ఒక పిటిషనర్‌గా ఉన్నారు. పిటిషన్లను విచారించిన అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. 2020లో దీనిని ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది. సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం దీని విచారణను చేపట్టి.. 6:1 ఆధిక్యంతో తీర్పు వెలువరించింది. ఎస్‌సిల రిజర్వేషన్లను వర్గీకరించి అదే వర్గంలో అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక కోటాలు కల్పించడానికి పచ్చజెండా ఊపింది. అయితే న్యాయసమీక్షకు లోబడే ఈ వర్గీకరణ ఉంటుందని స్పష్టంచేసింది. నిర్దిష్ట గణాంకాల ఆధారంగా, అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేందుకే దాన్ని ఉపయోగించాలని స్పష్టంచేసింది. వెనుకబాటుతనం పేరుతో 100 శాతం రిజర్వేషన్లను ఒకే ఉప వర్గానికి (సబ్ గ్రూప్‌నకు) ధారాదత్తం చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. రాష్ట్రాలు రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకుంటే వాటిని న్యాయస్థానాలు సమీక్షించవచ్చని పేర్కొంది. 15(4), 16(4) అధికరణాల కిందికి వచ్చే అన్ని వర్గాలకూ ఆ ప్రయోజనాన్ని కల్పించాలని చెప్పింది.

## అమేథీలో దళిత కుటుంబం దారుణహత్య

(మొదటి పేజీ తరువాయి)

చెందిన ఇద్దరు కూతుళ్లు దృష్టి, సునిలను దుండగులు శుక్రవారం నాడు ఇంట్లోకి చొరబడి మరీ కాల్చిచంపారు. దీంతో ప్రతిపక్షాలు బిజెపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. ఈ దారుణ హత్య ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయన్న పరిస్థితికి అద్దం పడుతున్నదని విపక్షాలు ధ్వజమెత్తాయి. బహుజన్ సమాజ్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి),రాష్ట్రీయ సోషిత్ సమాజ్ పార్టీ, ఆజాద్ సమాజ్ పార్టీలు ఈ దారుణ హత్యను ఖండించాయి. ఒకే కుటుంబానికి చెందిన దళిత కుటుంబ సభ్యుల దారుణ హత్యా సంఘటన విచారకరమని , నేరస్తులు ఎలాంటి భయం లేకుండా ఈ దారుణానికి పాల్పడ్డారని, ప్రభుత్వం ఈ దారుణానికి పాల్పడిన నిందితులపై, పోలీసులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ చీఫ్ మాయావతి సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో హిందీలో చేసిన పోస్ట్ వేదికగా డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో శాంతిభద్రతలు ఎంత హీనస్థితికి దిగజారాయన్న విషయాన్ని దళిత కుటుంబం దారుణ హత్యా సంఘటన తెలియజేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఉత్తరప్రదేశ్ ప్రసిడెంట్ అజయ్ రాయ్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలు నాశనం అయ్యాయన్నారు. గూండాలు, దుండగులు, నేరస్తులు ఉత్తరప్రదేశ్‌లో కాలర్ ఎగురవేసుకుని ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని అజయ్ రాయ్ ధ్వజమెత్తారు. రాష్ట్రీయ సోషిత్ సమాజ్‌పార్టీ అధ్యక్షులు స్వామి ప్రసాద్ ఈ సంఘటనను ఖండిస్తూ ఈ విచార సమయంలో తాను బాధితుల కుటుంబానికి అండగా ఉంటానన్నారు. నలుగురి హత్యలకు పాల్పడ్డ దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆజాద్ సమాజ్ పార్టీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలో ఈ సంఘటన శాంతిభద్రతల వైఫల్యాన్ని చాటిచెబుతున్నదన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన సునీల్‌కుమార్ ఇంట్లోకి దుండగులు జొరబడి ఈ కుటుంబ సభ్యులను దారుణంగా కాల్చిచంపడం తీవ్ర విచారకరమని, దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాదాపు పూనమ్ భర్తీ 45రోజుల కిందటే తమను చంపుతామని బెదిరిస్తూ కొందరు వ్యక్తులు వేధింపులకు గురిచేస్తున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును పట్టించుకుంటే ఇంతటి దారుణం జరిగిఉండేది కాదని నాగినా లోక్‌సభ నియోజకవర్గం ఎంపి చంద్రశేఖర్ ఆజాద్ 'ఎక్స్'లో చేసిన హిందీ పోస్ట్‌లో తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం నాడు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్‌యాదవ్ సోషల్ మీడియా పోస్ట్‌లో బిజెపి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దారుణంగా ఉన్నదని ఆరోపించారు.

**దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటాం : యుపి సిఎం యోగీ ఆదిత్యనాథ్**

ఈ దారుణ హత్యా సంఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. 'అమేథీ జిల్లాలో జరిగి ఈ దారుణహత్య ఖండించతగినది. క్షమించరానిది. మృతుల కుటుంబానికి నేను సంతాపం ప్రకటిస్తున్నాను. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉంటుంది. దుండగుల ఘాతుకాన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. దుండగులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం అని ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'హిందీ పోస్ట్‌లో తెలియజేశారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com